
'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 200

మంగళవారం 10-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




కివీస్ గెలుపు జోరు...

నెదర్లాండ్స్‌పై 99 పరుగులతో నెగ్గిన న్యూజిలాండ్ -12లో



దలాల్ స్ట్రీట్‌పై 'యుద్ధ' సెగలు

సెన్సెక్స్ నష్టం 483 పాయింట్లు నిఫ్టీ 141 పాయింట్లు పతనం -13లో



2,400కు చేరిన మరణాలు

అఫ్గానిస్తాన్ భూకంపంలో మృతుల సంఖ్య 2,445కు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. 2వేల మంది గాయపడ్డారన్నారు.

వివరాలు 6లో ▸



అధికారంలోకి రాగానే కులగణన

దేశవ్యాప్తంగా కులాల వారీగా జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభిం చాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది.

వివరాలు 6లో ▸



టాప్ గేర్‌లో వాహన విక్రయాలు

పండుగల సీజన్ నేపథ్యంలో దేశీయంగా ఆటోమొబైల్ రిటైల్ అమ్మకాలు సెప్టెంబర్‌లో గణనీయంగా పెరిగాయి.

వివరాలు 13లో ▸



ఊరంతా మా కుటుంబమే!

విధుల్లో ఉత్తమసేవలకు జాతీయస్థాయి ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా ఎంపికైన తెలంగాణకు చెందిన రేగట్టి వెంకటరమణపై కథనం.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

ఇక పక్కాగా అఫిడవిట్



ఎమ్మెల్యే అభ్యర్థులు తమ ఎన్నికల అఫిడవిట్‌లోని ప్రతికాలమ్‌ను ఇకపై తప్పనిసరిగా పూరించాల్సిందేనని.. లేకుంటే. ఆ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరిస్తారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ స్పష్టం చేశారు.

- వివరాలు 3లో▶

రేపో, ఎల్లుండో పెన్షన్ల పెంపు, గ్యాస్ ధర తగ్గింపు



పెన్షన్ల పెంపు, గ్యాస్ ధర తగ్గింపుపై రేపో, ఎల్లుండో సీఎం కేసీఆర్ శుభవార్త చెబుతారని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. రాష్ట్రంలో వైద్య వ్యవస్థను బలోపేతం చేశామన్నారు.

- వివరాలు 2లో▶

ఎన్నికలొచ్చాయ్..

తెలంగాణ శాసనసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

నవంబర్	నవంబర్	డిసెంబర్
3	30	3
నోటిఫికేషన్	పోలింగ్	ఫలితాలు



తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో ఎలక్షన్లు..
లోక్‌సభకు 'సెమీ ఫైనల్స్'..

మిజోరం, ఛత్తీస్‌గఢ్ (తొలివిడత)లలో నవంబర్ 7న..
ఛత్తీస్‌గఢ్ (రెండో విడత), మధ్యప్రదేశ్ నవంబర్ 17..
రాజస్తాన్‌లో నవంబర్ 23న పోలింగ్
ఐదు రాష్ట్రాల ఓట్ల లెక్కింపు, ఫలితాలు డిసెంబర్ 3నే..

- ఐదు రాష్ట్రాల్లో మొత్తం 16.14 కోట్ల మంది ఓటర్లు
- అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి
- ఉచితాలు, నగదు చేరవేతను అరికట్టేందుకు తనిఖీలు
- ఎన్నికల వ్యయంపై నిఘా
- కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ/ సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది. నవంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు నామినేషన్ల స్వీకరణ మొదలుకానుంది. అదే నెల 30న పోలింగ్, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. వచ్చే ఏడాది మొదట్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు సెమీఫైనల్‌గా భావిస్తున్న తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్, మిజోరం శాసనసభలకు ఎన్నికల ఏర్పాట్లు, ఇతర వివరాలను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్, ఎలక్షన్ కమిషనర్లు అనూప్ చంద్ర పాండే, అరుణ్ గోయల్ సోమవారం ఢిల్లీలో మీడియాకు వెల్లడించారు.

రాష్ట్రంలో ఒకే దశలో.. : వచ్చే ఏడాది జనవరి 16వ తేదీతో ముగిసే తెలంగాణ అసెంబ్లీలోని 119 నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియ ఈసారి ఒకే విడతలో జరగనుంది. నవంబర్ 3న ఎన్నికల మిగతా 3వ పేజీలో ▶



కేటీఆర్
మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

"ఎన్నికల సమరానికి బీఆర్‌ఎస్ ఇప్పటికే సర్వసన్నద్ధమైంది. కాంగ్రెస్ అస్త్ర సన్యాసం చేసింది. బీజేపీ కాడి పడేసింది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పాత రికార్డులు తిరగరాసి సెంచరీ కొడుతుంది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఏకపక్షంగానే జరుగుతాయి. పదేళ్ల ప్రగతి మా పాశుపతాస్త్రం, విశ్వసనీయతే మా విజయ మంత్రం.

ఈసారి సెంచరీ కొడతాం 2లో



కిషన్‌రెడ్డి
కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

"తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం వస్తోంది. కేసీఆర్ అవినీతి ప్రభుత్వం పోవాలని, మార్పు రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నాం. బీజేపీ అధికారంలోకి రావడానికి అన్ని శక్తిసామర్థ్యాలను వినియోగిస్తాం. మేము ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాం. తెలంగాణలో బీజేపీ జెండా ఎగరేస్తాం.

మార్పు కోరుకుంటున్నారు 2లో



ఎ.రేవంత్‌రెడ్డి
టీపీసీసీ అధ్యక్షుడు

"కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో ఇప్పటికే కేసీఆర్‌కు చలిజ్వరం పట్టింది. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడనుండటంతో ఇకపై ఆయన ఫామ్‌హౌస్ నుంచి బయటకు రావాల్సిన అవసరం లేదు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలి.

త్వరలోనే రాష్ట్రానికి చీడ విరగడ 2లో



క్లాడియాకు ఆర్థిక నోబెల్

అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారం ఈ ఏడాది అమెరికాకు చెందిన ప్రఖ్యాత ఆర్థికవేత్త క్లాడియా గోల్డిన్‌ను వరించింది. నోబెల్ అవార్డులిచ్చే రాయల్ స్వీడిష్ అకాడెమీ సోమవారం ఈ మేరకు ప్రకటించింది. శ్రామిక రంగంలో లైంగిక అంతరాలపై అవగాహనను మరింతగా పెంచే దిశగా చేసిన సమగ్ర అధ్యయనాలకుగాను ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు కమిటీ పేర్కొంది. -వివరాలు 6లో

మళ్లీ ప్రకటించండి

కానిస్టేబుల్ తుది ఫలితాలపై హైకోర్టు ఆదేశం

- అందరికీ 4 మార్కులు కలిపి ఫలితాలు వెల్లడించాలి..
- ఆ తర్వాతే నియామక ప్రక్రియ చేపట్టాలి..
- పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు హైకోర్టు స్పష్టీకరణ
- ఇప్పటికే ఉద్యోగం పొందిన అభ్యర్థుల్లో గందరగోళం



సాక్షి, హైదరాబాద్: కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష నుంచి 4 ప్రశ్నలు తొలగించి.. మార్కులను లెక్కించి, మళ్లీ ఫలితాలు వెల్లడించాలని రాష్ట్ర పోలీస్ నియామక బోర్డును హైకోర్టు ఆదేశించింది. 122, 130, 144వ నంబర్ ప్రశ్నలను తెలుగులోకి అనువదించలేదని, 57వ ప్రశ్న తప్పుగా ఉన్నందున వాటిని తొలగించాలని తేల్చిచెప్పింది. 2022, ఆగస్టు 30న జరిగిన కానిస్టేబుల్ నియామక తుది రాత పరీక్షలో 23 ప్రశ్నలకు అభ్యంతరాలు తెలుపుతూ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు వినతిపత్రం సమర్పించినా ఎలాంటి బదులివ్వకపోవడంతో కోర్టును ఆశ్రయించినట్లు పిటిషనర్లు తెలిపారు. తప్పుగా రూపొందించిన ప్రశ్నలు, ఇచ్చిన తప్పు సమాధానాలను తొలగించాలని కోరడంతో పాటు తెలుగులోకి అనువదించని కొన్ని ప్రశ్నలను సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు రమేశ్ చిల్ల, ఎన్ఎస్ అర్జున్ వాదనలు వినిపించారు. వాదనలు పూర్తి కావడంతో తీర్పు రిజర్వు చేసిన న్యాయమూర్తి.. సోమవారం తీర్పు వెలువరించారు. 'పోలీసు కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్ కోసం నిర్వహించిన మెయిన్స్ పరీక్షలో 4 ప్రశ్నలను మినహాయించి, అభ్యర్థులందరికీ నాలుగు మార్కులు ఇవ్వాలని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుని ఆదేశిస్తున్నాం. పేపర్‌లను మూల్యాంకనం చేసి, ఆ తర్వాత ఫలితాలను ప్రచురించి, తదుపరి నియామక ప్రక్రియ కొనసాగించాలి' అని తీర్పులో పేర్కొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల్లోనూ గందరగోళం....

కానిస్టేబుల్ నియామక పరీక్షల తుది ఫలితాలను పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గత బుధవారం ప్రకటించిన విషయం తెలిసిందే. 15,750 మంది పోస్టులకు సంబంధించిన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. 12,866 మంది పురుషులు, 2,884 మంది మహిళా అభ్యర్థులు ఎంపికయ్యారు. అయితే తాజా తీర్పు మళ్లీ ఫలితాలు వెల్లడించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే విడుదలైన ఫలితాల్లో కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థుల్లో ఇది తీవ్ర గందరగోళానికి దారితీసింది. నాలుగు మార్కులు కలిపి మళ్లీ ఫలితాలు వెల్లడిస్తే ఉద్యోగాలు ఉంటాయా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే గ్రూప్–1 ప్రిలిమ్స్ రెండుసార్లు రద్దు కాగా, ఇప్పుడు కానిస్టేబుల్ పరీక్ష ఫలితాలు మళ్లీ వెల్లడించే అవకాశం రావడంతో నియామక బోర్డుల తీరుపై అభ్యర్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పథకాలకు బ్రేక్!

- ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో నిలుపుదల
- దళిత బంధు, బీసీ బంధు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు బ్రేకులు

-వివరాలు 3లో▶

రాజకీయం గరం గరం

- ఇప్పటికే అధికారిక కార్యక్రమాలతో జనంలోకి బీఆర్‌ఎస్
- 50 రోజుల క్రితమే అభ్యర్థుల ఎంపిక.. ఈ నెల 15 నుంచి సభలు
- అభ్యర్థుల ఎంపిక, మేనిఫెస్టోలపై కసరత్తు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ
- కాంగ్రెస్‌తో తేలని కమ్యూనిస్టుల పొత్తు.. చెరో రెండు స్థానాలపై చర్చలు?
- 20 పేర్లతో తొలి జాబితా ప్రకటించిన బీఎస్పీ
- టీజేఎస్, వైఎస్సార్ టీపీ వైఖరిపై అస్పష్టత

5లో

17ఏ.. నిందితులకు కాదేమో!

ఆ సెక్షన్ నేరం జరిగిన తేదీకి వర్తిస్తుంది

చంద్రబాబు పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు

- అవినీతిని నిరోధించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యం
- చట్టం లక్ష్యాన్ని భంగపరిచే వివరణ స్వీకరించలేం
- విచారణ సందర్భంగా న్యాయమూర్తుల వ్యాఖ్యలు
- సుదీర్ఘ వాదనలు వినిపించిన చంద్రబాబు న్యాయవాది
- బాబు న్యాయవాదికి పలు ప్రశ్నలు సంధించిన ధర్మాసనం.. విచారణ నేటికి వాయిదా
- వాదనలు వినిపించనున్న సీఐడీ న్యాయవాది

10లో





విప్లవాత్మక పరిపాలన

చేసిన మంచే మన బలం.. ధైర్యం

వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సదస్సులో ఏపీ సీఎం జగన్ దిశానిర్దేశం

-వివరాలు 10లో▶

ఇదండీ సంగతి




సార్ లేరయ్యా! అర్జంట్ పనుంటే బిగ్‌బాస్ హౌస్‌లోకి ఏదో రకంగా ఎంట్రీ సంపాదించుకుని వెళ్లు!

15 నుంచి రంగంలోకి కేసీఆర్!

వరుసగా సభలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం

- 15న తెలంగాణ భవన్‌లో పార్టీ అభ్యర్థులకు బీఫారాలు
- అనంతరం అభ్యర్థులతో ప్రత్యేకంగా భేటీ.. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో విడుదల
- అదే రోజున హుస్నాబాద్ సభతో నియోజకవర్గాల పర్యటనలు షురూ..
- 16న జనగామ, భువనగిరి.. 17న సిద్దిపేట, సిరిసిల్ల.. 18న జడ్చర్ల, మేడ్చల్‌లలో సభలు..
- మిగతా నియోజకవర్గాల్లో పర్యటనల షెడ్యూల్ త్వరలో ఖరారు
- 26 లేదా 27న వరంగల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహణకు నిర్ణయం
- నవంబర్ 9న గజ్వేల్, కామారెడ్డిలలో కేసీఆర్ నామినేషన్లు



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో.. బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్వయంగా గోదాలోకి దిగుతున్నారు. ఈ నెల 15 నుంచి సభలు, ఇతర కార్యక్రమాలకు ప్రణాళిక సిద్ధంచేసి ఎన్నికల శంఖారావం పూరించారు. ఈ నెల 15న తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమై పార్టీ బీఫారాలు అందజేస్తారు. తర్వాత పార్టీ మేనిఫెస్టోను విడుదల చేస్తారు. ఆ వెంటనే నియోజకవర్గాల పర్యటనకు బయలుదేరుతారు.

అభ్యర్థులకు దిశానిర్దేశం చేసి..

15న తెలంగాణ భవన్‌లో పార్టీ అభ్యర్థులతో జరిగే భేటీలో.. ఎన్నికల ప్రచార వ్యూహాలు, సభలు, సమావేశాల నిర్వహణలో పాటించాల్సిన నియమ నిబంధనలు, విపక్షాల ఎత్తులను చిత్తుచేసేందుకు అనుసరించాల్సిన మార్గాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారు. తర్వాత అదే రోజున సాయంత్రం 4 గంటలకు హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

వరుసగా నియోజకవర్గాల పర్యటన

సుమారు 50రోజుల క్రితమే పార్టీ అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన కేసీఆర్.. ఈ నెల 15 నుంచి నియోజకవర్గాల్లో ప్రచార సభలకు శ్రీకారం చుడుతున్నారు. ఇందులో 18 వరకు వరుసగా నాలుగు రోజుల పాటు జరిగే బహిరంగ సభల షెడ్యూల్‌ను బీఆర్‌ఎస్ ప్రకటించింది. 15న హుస్నాబాద్, 16న జనగామ, భువనగిరి, 17న సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల్లో నిర్వహించే

మిగతా 2వ పేజీలో ▶



గాజాపై నిప్పుల వర్షం

వైమానిక దాడులు ఉధృతం చేసిన ఇజ్రాయెల్
సరిహద్దుల్లో యుద్ధ ట్యాంకులు, డ్రోన్ల మోహరింపు
ఇజ్రాయెల్‌లో 700 మందికిపైగా బలి
గాజాలో 500 మంది మృత్యువాత
గాజాను దిగ్బంధించే దిశగా ఇజ్రాయెల్ అడుగులు

- వివరాలు 6లో

క్లుప్తంగా...

ఉద్యోగులకు పాత పింఛన్

- హిమాచల్ తరహా వాగ్దానంపై కాంగ్రెస్ యోచన
- మేనిఫెస్టో కమిటీలో చర్చ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పింఛన్‌ను వర్తింప చేస్తామన్న హామీనివ్వాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో ఇచ్చిన విధంగానే ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని అమలు చేస్తామనే హామీని మేనిఫెస్టోలో పెట్టాలనే ప్రతిపాదన వచ్చింది. ఈ ప్రతిపాదనపై సోమవారం గాంధీభవన్‌లో మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన మేనిఫెస్టో కమిటీ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఉద్యోగులకు పాత పింఛన్ విధానంతో పాటు గృహ కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, తెలంగాణ ఉద్యమకారులు, టూర్స్ అండ్ ట్రావెల్స్ యజమానులు, క్యాబ్ డ్రైవర్లు, వీధి వ్యాపారులు, పాఠశాలల రిటైర్డ్ సిబ్బంది తదితర వర్గాలకు చెందిన అంశాలపై చర్చించారు.

ఆ సంస్కృతి తెచ్చిన ఘనత కేసీఆర్‌దే

ఎన్నికల్లో ఇష్టారాజ్యంగా డబ్బు ఖర్చు పెట్టే దుష్ట సంప్రదాయాన్ని తెచ్చింది ఆయనే: ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అత్యధిక డబ్బు ఖర్చుపెట్టే నీచమైన సంస్కృతిని తెలంగాణకు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని రాష్ట్ర బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. సోమవారం ఈటల మీడియాతో మాట్లాడుతూ గతంలో తెలంగాణలో డబ్బు, మద్యం ప్రభావం తక్కువగా ఉండేదని ఉమ్మడి ఏపీలో ఖర్చయ్యే దాంట్లో నాలుగో వంతుతో ఇక్కడ గెలిచేవారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. వేల ఎకరాల భూమిని అక్రమంగా అమ్ముకుని.. ఆ డబ్బుతో ఎన్నికల్లో గెలుద్దామని కేసీఆర్ నిర్ణయించుకున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఒక్కో నియోజక వర్గంలో రూ.30–50 కోట్ల మధ్య ఖర్చు చేయనున్నారని, అందులో రూ.10, 15 కోట్ల చొప్పున ఇప్పటికే పోటీ చేసే నేతల వద్దకు చేర్చారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక గొప్ప సంప్రదాయాన్ని అందిస్తానన్న కేసీఆర్ మద్యం తాగించే విషయంలో.. డబ్బులు ఎరవేయడంలో నెంబర్ వన్ అయ్యారని ఆయన విమర్శించారు. ఎన్నికల్లో నిక్కచ్చిగా పనిచేసే వారికి అవకాశం లేకుండా.. డబ్బున్నోళ్లే గెలిచే కలుషిత వాతావరణం సృష్టించారన్నారు. బీజేపీకి ఓటేస్తే.. మోటార్లకు మీటర్లు వస్తాయని, పింఛన్లు పోతాయని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వాస్తవానికి బీజేపీ గెలిస్తేనే.. ఇవన్నీ టైమ్‌కు మీ అకౌంట్లలోకి వస్తాయి. ఒకటో తేదీకే జీతాలు వస్తాయని ఈటల భరోసానిచ్చారు. అమరవీరులు కలలుగన్న బంగారు తెలంగాణను సాధించుకోవాలంటే.. బీజేపీ అధికారంలో రావాలన్నారు.

పరివర్తన ఎలా ఉంటుందో ప్రజలు చూపిస్తారు

బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో జరగబోయేవి చరిత్రాత్మక ఎన్నికలని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాష్ జవదేకర్ వ్యాఖ్యా నించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ద్వారా మార్పు అనేది ఎలా సాధ్యమో తెలంగాణలో స్పష్టం కాబోతోందన్నారు. నవంబర్ 30న జరగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలై బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం జవదేకర్ హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్ కుటుంబ, ప్రజావ్యతిరేక పాలనను అంతమొందించడం తథ్యమన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి పాత్ర పోషించబోవడం లేదని, ఆ పార్టీ మూడోస్థానానికే పరిమితం కాబోతోందన్నారు. గత రెండు, మూడేళ్ల కాలంలో జీహెచ్ఎంసీ ఎన్నికలు, రెండు, మూడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఎలాంటి బలాన్ని చూపలేక పోయిందని ప్రస్తావించారు. గత ఎన్నికల నాటి నుంచి క్రమంగా బీజేపీ తన బలాన్ని పెంచుకుంటూ వస్తోందని గుర్తు చేశారు. బీఆర్ఎస్‌తో పోటీపడి డబ్బులు పంచే పరిస్థితి తమది కాదని, ప్రజల్లో నెలకొల్పే విశ్వాసం, నమ్మకం ఆధారంగానే ఓట్లుసాధిస్తామని ఒక ప్రశ్నకు బదులిచ్చారు.

తెలంగాణలో 119 స్థానాల్లో శివసేన పోటీ

శివసేన రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 119 స్థానాల్లో శివసేన పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ ప్రకటించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సందర్భంగా పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ త్వరలోనే శివసేన పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే హాజరయ్యే ఈ సభలో భారీగా చేరికలుంటాయని శివాజీ వెల్లడించారు. తెలంగాణలో బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలను తరిమికొట్టడమే శివసేన ధ్యేయమన్నారు. హైదరాబాద్ నగరంలో ఒవైసీ బ్రదర్స్‌ని ఓడించేందుకు బలమైన కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు.

రేపోమాపో పులి బయటకు

ఇక తోడేళ్లన్నీ తొర్రల్లోకే!

తెలంగాణలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికలన్నీ ఏకపక్షమే.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ భారీ విజయం సాధిస్తాం

- మూడోసారీ ముఖ్యమంత్రిగా కేసీఆరే కావడం పక్కా
- 60 ఏళ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదేళ్లలోనే చేశాం
- విపక్షాల హామీలకు ఆగం కావద్దు.. ఆలోచించి ఓటేయండి
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభల్లో మంత్రి కేటీఆర్



సభలో ఎర్రబెల్లిని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్న కేటీఆర్



డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరైన వృద్ధురాలిని ఆప్యాయంగా దగ్గరికి తీసుకున్న కేటీఆర్

సాక్షి ప్రతినిధి, వరంగల్/సాక్షి మహబూబాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచార బరిలోకి ముఖ్యమంత్రి కేసీఆర్ దిగితే విపక్ష నేతలు 'రేపో మాపో పులి (కేసీఆర్‌ను ఉద్దేశించి) బయటకు వస్తది.. వచ్చిన తర్వాత ఇవాళ ఎగిరెగిరి పడుతున్న, నీలుగుతున్న నక్కలు, మూలుగుతున్న తోడేళ్లన్నీ (కాంగ్రెస్, బీజేపీ నేతలను ఉద్దేశించి) మళ్లీ తొర్రల్లోకే పోతాయి'అని మంత్రి కె. తారక రామారావు వ్యాఖ్యానించారు. వివిధ అభివృద్ధి పథకాల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి, పరకాల, తొర్రూరులలో సోమవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. భూపాలపల్లిలో కలెక్టర్, పోలీసు కార్యాలయాల సముదాయాలను ప్రారంభించిన తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మిగతా కార్యక్రమాలను వాయిదా వేసుకొని భూపాలపల్లి, పరకాల, తొర్రూరులలో నిర్వహించిన ప్రగతి నివేదన బహిరంగ సభల్లో ప్రసంగించారు. భూపాలపల్లి సభ నుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తూ తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

2014లో మన పరిస్థితి ఏమిటో ఆలోచించండి..

'ఎలక్షన్ షెడ్యూల్ వచ్చింది. ఇక సంక్రాంతికి గంగిరెద్దులోళ్లు వచ్చినట్లు కాంగ్రెస్, బీజేపీ నాయకులు వస్తారు. నోటికొచ్చిన కథలు చెబుతారు. కేసీఆర్, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించాలని అడుగుతారు. ప్రజలు విచక్షణతో, ఆలోచనతో చైతన్యాన్ని ప్రదర్శించి ఓటేయాలి. అమలుకు నోచుకోని ప్రతిపక్షాల హామీలకు ఆగం కావొద్దు'అని కేటీఆర్ కోరారు. 2014లో మన పరిస్థితి ఏమిటి? ఇప్పుడు పరిస్థితి ఏమిటి? అనేది ఒక్కసారి ఆలోచించాలన్నారు. కరెంట్, మంచినీళ్లు, వ్యవసాయం, సాగునీరు, సంక్షేమం పట్టని కాంగ్రెస్, బీజేపీల రెచ్చగొట్టే ముచ్చట్లు చెబితే ఆగం కావొద్దని పిలుపునిచ్చారు.

రేవంత్ దొరికిన దొంగ..

టీపీసీసీ చీఫ్ పదవికి ఎవరూ దిక్కులేకపోవడంతో ఓటుకు కోట్లు కేసులో దొరికిన దొంగకు అధ్యక్ష పదవి అప్పగించారని, ఇప్పుడా రేవంత్‌రెడ్డి సీటుకో రేటు పెట్టి ఎమ్మెల్యే టికెట్లు డబ్బులకు అమ్ముకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలకు కర్ణాటక, గుజరాత్‌ల నుంచి నోట్ల కట్టలు వస్తున్నాయని, ఆ పార్టీ నాయకులు ఇచ్చే డబ్బుతీసుకొని కారు గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

వచ్చేది సారే.. గెలిచేది కారే..

'60 ఏళ్లలో జరగని అభివృద్ధి తెలంగాణలో తొమ్మిదిన్నరేళ్లలోనే చేసి చూపించాం. సంక్షేమ పథకాల అమల్లో తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారింది. విజన్ ఉన్న సీఎంగా మనసున్న నేత కేసీఆర్ దేశంలో ఏ సీఎం చేపట్టని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశారు. ఫలితంగా తలసరి ఆదాయంలో దేశంలో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచింది. వచ్చే ఎన్నికల్లో వచ్చేది సారే.. గెలిచేది కారే'అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

పోలింగ్, కౌంటింగ్ తేదీలు కలిపితే మా లక్కీ నంబర్..

ఇప్పటివరకు తెలంగాణలో జరిగిన ఎన్నికలన్నీ ఏకపక్షమేనని, ఈ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ భారీ విజయం సాధించబోతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 'ఎన్నికల కమిషన్ ప్రకటించిన తేదీల ప్రకారం నవంబర్ 30న పోలింగ్.. డిసెంబర్ 3న కౌంటింగ్.. మూడు, మూడు కలిపితే ఆరు. అది మా లక్కీ నంబర్. ముచ్చటగా మూడోసారి కూడా కేసీఆర్‌నే ప్రజలు ఆశీర్వదిస్తారు.. ఇది పక్కా'అని కేటీఆర్ జోస్యం చెప్పారు. ప్రజలు ఇంకా ఏం కోరుకుంటున్నారో.. ఎన్నికల వేళ ఏమేమి చేయాలో కేసీఆర్ లెక్కలు తీస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల కోసం నిరంతరంగా పని చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులు గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావులను అత్యధిక మెజార్టీతో గెలిపించి కేసీఆర్ హ్యాట్రిక్ ప్రభుత్వాన్ని బలపర్చాలని ఆయన కోరారు.

మళ్లీ గెలిపించండి: ఎర్రబెల్లి

తొర్రూరు సభలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ ఇప్పటివరకు 7సార్లు తనను ప్రజలు గెలిపించారని... సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చలువతో పాలకుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దినందుకు మరోసారి తనను గెలిపించాలని కోరారు. తాను చేసిన పనులకు దేశంలోనే అత్యధిక అవార్డులు తీసుకున్న మంత్రిగా నిలిచానని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, బానోత్ శంకర్ నాయక్, పెద్ది సుదర్శన్, రెడ్యానాయక్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎంపీలు కవిత, వద్దిరాజు రవిచంద్ర, పసునూరి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు చిన్ననాటి స్కూల్ ఫొటో బహూకరణ

పరకాల: మంత్రి కేటీఆర్ చిన్నప్పుడు పరకాలలో చదువుకున్నప్పుడు దిగిన ఓ స్కూల్ ఫొటోను సభలో బీఆర్ఎస్ నేతలు ఆయనకు బహూకరించారు. 1982–83లో కేటీఆర్ పరకాలలోని తన బాబాయి ఇంట్లో ఉంటూ మినర్వా హైస్కూల్‌లో 3వ తరగతి చదువుకున్నారు. ఈ విషయాన్ని బహిరంగ సభలో కేటీఆర్ పేర్కొనగా సభ ముగిశాక బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు నాటి స్కూల్‌లో టీచర్లు, స్నేహితులతో కలసి కేటీఆర్ దిగిన ఫొటోను ఆయనకు బహూకరించారు. ఆ ఫొటోను చూసి మంత్రి ముచ్చటపడ్డారు.



కేటీఆర్ మూడో తరగతి చదువుతున్నప్పటి ఫొటో (వృత్తంలో కేటీఆర్).

ఈసారి సెంచరీ కొడతాం

- ఎన్నిక ఏకపక్షమే.. ముచ్చటగా మూడోసారి సీఎంగా కేసీఆర్ ప్రమాణం: కేటీఆర్
- పదేళ్ల ప్రగతి ప్రస్థానమే మాకు విజయాన్ని కట్టబెడుతుందన్న మంత్రి
- కాంగ్రెస్ అస్త్ర సన్యాసం చేసిందని, బీజేపీ కాడి పడేసిందని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఏకపక్షంగానే జరుగుతాయని.. బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత ఆయన 'ఎక్స్ (ట్విట్టర్)'లో స్పందించారు. ''ప్రజలు రెండు సార్లు నిండు మనసుతో ఆశీర్వదించారు. డిసెంబర్ మూడున జరిగే ఓట్ల లెక్కింపులో ముచ్చటగా మూడోసారి గెలిచి కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారు. దక్షత గల నాయకత్వానికే మరోసారి ప్రజలు పట్టం కట్టడం ద్వారా దక్షిణ భారతంలోనే సరికొత్త అధ్యాయం మొదలవుతుంది. పదేళ్ల ప్రగతి మా పాశుపతాస్త్రం, విశ్వసనీయతే మా విజయ మంత్రం. ప్రజల అండతో బీఆర్ఎస్‌కు విజయం.. ప్రతీప శక్తులకు పరాభవం తప్పదు. మా టీమ్ కెప్టెన్ కేసీఆర్ కాబట్టి హ్యాట్రిక్ విజయం సాధిస్తాం. మంచి చేసే బీఆర్ఎస్‌కు ప్రజలు మద్దతు పలికి.. ముంచే పార్టీలపై వేటు వేస్తారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ దాకా గులాబీ జెండా ఎగురుతుంది. తెలంగాణలో గాంధీ సిద్ధాంతమే తప్ప గాడ్సే రాద్ధాంతం నడవదు. ఉద్యమ చైతన్యం 2014 అసెంబ్లీ ఎన్నికలను నడిపిస్తే.. సంక్షేమ సంబురం 2018లో రెండోమారు గెలిపించింది. గత పదేళ్ల ప్రగతి ప్రస్థానమే 2023 ఎన్నికలో మా విజయాన్ని శాసిస్తుంది. ఎన్నికల సమరానికి బీఆర్ఎస్ ఇప్పటికే సర్వసన్నద్ధమవగా.. కాంగ్రెస్ అస్త్ర సన్యాసం చేసింది, బీజేపీ కాడి పడేసింది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పాత రికార్డులు తిరగరాసి సెంచరీ కొడుతుంది' అని కేటీఆర్ పేర్కొన్నారు.

రేపో, ఎల్లుండో.. పెన్షన్ల పెంపు, గ్యాస్ ధర తగ్గింపు

- ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త చెబుతారు: మంత్రి హరీశ్‌రావు
- రాష్ట్రాన్ని పొరపాటున కాంగ్రెస్ చేతిలో పెడితే పెద్దపాము మింగినట్లేనని వ్యాఖ్య



మంత్రి హరీశ్‌రావును గజమాలతో సత్కరిస్తున్న మహిళలు

సాక్షి, సిద్దిపేట: ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ వచ్చిన రాష్ట్రాన్ని పొరపాటున కాంగ్రెస్ చేతిలో పెడితే కైలాసం ఆటలో పెద్దపాము మింగినట్లేనని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రజలకు తాగేందుకు నీళ్లు ఇవ్వలేకపోయిందన్నారు. సోమవారం సిద్దిపేట బస్టాండ్‌లో టీ హబ్ చెకప్ కేంద్రం, స్వయం ఉపాధి శిక్షణ పొందే మహిళా ప్రాంగణం, వృద్ధాశ్రమం, జిల్లా మహిళా సమాఖ్య భవనాలను మంత్రి హరీశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ల పెంపు, గ్యాస్ ధర తగ్గింపుపై రేపో, ఎల్లుండో సీఎం కేసీఆర్ శుభవార్త చెబుతారన్నారు. రాష్ట్రంలో వైద్య వ్యవస్థను బలోపేతం చేశామని... ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందని తెలిపారు. గతంలో రాష్ట్ర ప్రజలు ఇతర ప్రాంతాలకు కూలి పనులకు వెళ్లే వారని... ఇప్పుడు పక్క రాష్ట్రాల వారికి కూలీ ఇచ్చే పరిస్థితికి వచ్చామన్నారు. వీఏోలను ఆదుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని... ఉద్యోగస్తులతోపాటు వారికి కూడా పీఆర్సీ వర్తింపజేశామన్నారు. 'దేశమంతా తెలంగాణ రాష్ట్రం వైపు చుస్తోంది.. ఇక్కడ అమలవుతున్న రైతు బంధు, బీమా, ఆసరా పెన్షన్‌లు దేశంలో ఎక్కడా లేవు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా సిద్దిపేటలో మహిళా భవనం, వృద్ధాశ్రమం ఏర్పాటు చేశాం' అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి కేసీఆరే ముఖ్యమంత్రి: అసదుద్దీన్

రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి పోటీ చేయనున్నట్లు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి తెలంగాణ సీఎం అవుతారని మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ జోస్యం చెప్పారు. సోమవారం హైదరాబాద్ దారుస్సలాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి, సుఖశాంతుల కోసం మూడోసారి కేసీఆర్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందేనని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని, తెలంగాణతోపాటు మొదటిసారిగా రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తామని అసదుద్దీన్ ప్రకటించారు. రాజస్తాన్‌కు సంబంధించి ఇప్పటికే ముగ్గురు అభ్యర్థులను ప్రకటించామని, త్వరలో తెలంగాణ అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. తాము నిరంతరం ప్రజల మధ్యలో ఉంటామని, పోటీచేసే ప్రతి చోటా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలని ఆయన ఆకాంక్షించారు.

లెఫ్ట్‌తో పొత్తు ఇంకా ఖరారు కాలేదు

- సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క
- సీపీఎంకు భద్రాచలం, మిర్యాలగూడ..
- సీపీఐకి మునుగోడు, కొత్తగూడెం ఇస్తారన్న వార్తలు ఊహాగానాలే
- చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్‌కు వామపక్షాలకు మధ్య ఎన్నికల పొత్తు కుదిరిందన్న వార్తల్లో వాస్తవం లేదని సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సీపీఐ, సీపీఎం పార్టీలకు చెరో రెండు అసెంబ్లీ స్థానాలు ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు సోమవారం విస్తృత ప్రచారం జరిగింది. ఢిల్లీ స్థాయిలో ఈ పొత్తు కుదిరిందని, సీపీఎంకు మిర్యాలగూడ, భద్రాచలం, సీపీఐకి మునుగోడు, కొత్తగూడెం నియోజకవర్గాలను కేటాయించారని ప్రచారం జరిగింది. అయితే ఈ అంశాన్ని సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క సున్నితంగా తోసిపుచ్చారు. వామపక్షాలతో పొత్తు చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని, వామపక్షాలకు నాలుగు స్థానాలు కేటాయించినట్లు జరిగిన ప్రచారం కేవలం ఊహాగానమేనని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తుందని, అభ్యర్థుల ప్రకటనకు సంబంధించి మీడియాలో వస్తున్న కథనాలపై పార్టీ శ్రేణులు ఆందోళనకు గురికావద్దని సోమవారం ఆయన వెల్లడించారు. కాగా, వామపక్షాలు అడుగుతున్న నియోజకవర్గా లకు సంబంధించిన సమాచారాన్ని టీపీసీసీ, అధిష్టానికి పంపించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఈనెల ఒకటో తేదీన సమావేశమై ఉమ్మడిగా ఎన్నికలకు వెళ్లడానికి కార్యాచరణ సిద్ధం చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పినా.. అలాంటి సమావేశం ఏదీ జరగకపోగా, చెరో రెండు స్థానాలు ఖరారైనా ఏయే నియోజకవర్గాలన్న అంశంపై మాత్రం ఇంకా సస్పెన్స్ కొనసాగుతున్నట్లు కామ్రేడ్లు చెబుతున్నారు.

అప్పుడు బీఆర్ఎస్‌తో ఇప్పుడు కాంగ్రెస్‌తో..

'ఇండియా'కూటమిలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలు కీలకంగా ఉన్నాయి. తెలంగాణలోనూ బీజేపీని ఓడించడమే లక్ష్యంగా కమ్యూనిస్టులు ముందుకు సాగుతున్నారు. మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా బీజేపీకి బ్రేక్ వేసేందుకు ఆనాటి పరిస్థితుల్లో బీఆర్ఎస్‌తో వామపక్షాలు చేతులు కలిపాయి. ఆ ఎన్నికలో బీజేపీ గెలవకుండా అడ్డుకోవడంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో సాధారణ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌తో కలసి సాగాలని లెఫ్ట్ పార్టీలు భావించాయి. కానీ వివిధ రాజకీయ కారణాలతో అది సాధ్యం కాలేదు. దీంతో రాష్ట్రంలో బీజేపీని, బీఆర్ఎస్‌ను ఓడించేందుకు కాంగ్రెస్‌తో కలవాలని కమ్యూనిస్టులు నిర్ణయించుకున్నారు. ఈ మూడు పార్టీలు కలిస్తే పలు నియోజకవర్గాల్లో కమ్యూనిస్టుల ఓట్లు కాంగ్రెస్‌కు కలసి వస్తాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

గతంలోనే జాతీయ నేతల భేటీ..

- తెలంగాణలో పొత్తుపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిలు గతంలోనే భేటీ అయినట్లు తెలంగాణ లెఫ్ట్ నేతలు వెల్లడించారు. మూడు జాతీయ పార్టీల అధినేతలు తెలంగాణలో పొత్తుకు పూర్తి స్థాయిలో ఆమోదం తెలిపారని చెపుతున్నారు. పొత్తుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయా పార్టీల రాష్ట్ర నేతలకు అగ్ర నాయకత్వాలు సూచించాయని సమాచారం. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలసి జాబితాను ప్రకటించే అవకాశం ఉందని అంటున్నారు. కాగా, కమ్యూనిస్టులు కోరుతున్న స్థానాల్లోని కాంగ్రెస్ ఆశావహుల నుంచి ఎలాంటి ప్రతిస్పందన వస్తుందోనన్న ఆందోళన హస్తం నేతల్లో నెలకొని ఉంది.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

- రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం వస్తోంది
- కేసీఆర్ కుటుంబపాలన పోవాలనుకుంటున్నారు
- కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం వస్తోందని, సీఎం కేసీఆర్ అవినీతి, కుటుంబ, నియంతృత్వ, దుర్మార్గపు ప్రభుత్వం పోవాలని మార్పు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అభి ప్రాయపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఈ ఎన్ని కల్లో బీజేపీ అధికారంలోకి రావడానికి అన్ని శక్తిసామర్థ్యాలను వినియోగిస్తామన్నారు. తాము ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నామని, ప్రజల విశ్వాసాన్ని చూరగొంటామని, తెలంగాణ లో బీజేపీ జెండా ఎగరేస్తామని ఆయన ధీమా వ్యక్తంచేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌ల సమక్షంలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ నేత డి.వసంతకుమార్ (ఢిల్లీ వసంత్), జైపాల్‌రెడ్డి, పాపయ్య, స్లీమెన్‌సన్, జహంగీర్, విఠల్, కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన కాంగ్రెస్ నేత లక్కిరెడ్డి సురేందర్, లక్కి రెడ్డి సాయి, చీమల లక్ష్మీనారా యణ, బాలాజీ నాయక్, బానోత్ పంతూనాయక్ బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఢిల్లీ వసంత్ హనుమ ఫలాన్ని అందించగా ఈ 'హనుమఫలమే.. బీజేపీ విజయఫల'మని అన్నారు. మీడియాతో మాట్లాడుతూ ''మోదీ నాయకత్వం పట్ల తెలంగాణ ప్రజల్లో ఎన్నో ఆశలు న్నాయి.. వారి ఆకాంక్షలకు అనుగుణంగా రాబోయే 50 రోజులు మేమంతా ఐకమత్యంతో కష్టపడి పనిచేస్తాం. పార్టీని అధికారానికి తీసుకొస్తాం' అని ధీమా వ్యక్తం చేశారు.

2, 3 స్థానాల కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ

ఇటీవల ప్రధాని రెండు బహిరంగసభల తర్వాత రాష్ట్ర ప్రజల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని కిషన్‌రెడ్డి చెప్పారు. అధికారంలోకి వచ్చేది బీజేపీ మాత్రమేనని, 2,3 స్థానాల కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ పడాల్సి ఉంటుందన్నారు. మంగళవారం ఆదిలాబాద్ బహిరంగ సభలో కేంద్రమంత్రి అమిత్ షా పాల్గొంటారని, సాయంత్రం నగరంలోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో.. మేధావులు, విద్యా వంతులనుద్దేశించి ఆయన మాట్లాడతారని తెలిపారు.

బీఎస్పీకి అధికారం ఖాయం

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ధీమా
- ఏనుగుపై ప్రగతి భవన్‌కు వెళ్లాలి: బీఎస్పీ ఎంపీ రాంజీ గౌతమ్
- ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బీఎస్పీ ఎన్నికల నగారా సభ



సాక్షి, హైదరాబాద్, గన్‌ఫౌండ్రీ: రానున్న ఎన్నికల్లో ఎవరెన్ని కుట్రలు చేసినా, తెలంగాణలో బీఎస్పీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలు కొండ చిలువలకు, చలిచీమలకు మధ్య పోటీ అని వ్యాఖ్యానించారు. బీఎస్పీ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సోమవారం కాన్షీరాం 17వ వర్ధంతి సందర్భంగా ఎన్నికల నగారా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాబలం బీఎస్పీకి ఉందనీ, మరో రెండు నెలలు పార్టీ శ్రేణులు రాత్రింబవళ్లు కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకు రావాలని పిలుపునిచ్చారు. బహుజనులు పాలకులు కావాలని కలలుగన్న కాన్షీరాం పేద ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతారన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరుగుతుంటే ఈ వర్గాల ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేతలపై పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. మంత్రి జగదీశ్ రెడ్డి ప్రోద్బలం, ఒత్తిడితోనే వట్టే జానయ్య యాదవ్‌పై నిరాధారంగా పోలీసులు కేసులు పెట్టారని విమర్శించారు.

తెలంగాణ గడ్డపై నీలి జెండా ఎగురవేయాలి

బీఎస్పీ నేషనల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల్లో తెలంగాణ గడ్డపై నీలి జెండా ఎగురవేసి, ఏనుగుపై ప్రగతి భవన్‌కు వెళ్లాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం గురించి మాట్లాడుతున్న బీజేపీ, కాంగ్రెస్‌లు రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లలో ఎందుకు మాట్లాడడం లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. మెజారిటీ ప్రజలకు అధికారం దక్కాలనేదే బీఎస్పీ ధ్యేయమని పార్టీ రాష్ట్ర చీఫ్ కోఆర్డనేటర్ మంద ప్రభాకర్ అన్నారు. సభలో పార్టీ ఉపాధ్యక్షులు దాగిళ్ళ దయానంద్, చాట్ల చిరంజీవి, రుద్రవరం సునీల్ పాల్గొన్నారు.

15 నుంచి రంగంలోకి కేసీఆర్!

► మొదటి పేజీ తరువాయి



బహిరంగ సభల్లో కేసీఆర్ పాల్గొంటారు. ఈ నెల 18న జడ్చర్ల, మేడ్చల్‌లలో జరిగే సభల్లో ప్రసంగిస్తారు. మిగతా నియోజకవర్గాల్లో ప్రచార సభల షెడ్యూల్‌ను త్వరలో ఖరారు చేయనున్నారు. మరోవైపు ఈ నెల 16న వరంగల్‌లో భారీ బహిరంగ సభను తలపెట్టినా కేసీఆర్ అనారోగ్యం కారణంగా వాయిదా వేశారు. ఆ సభను ఈ నెల 26 లేదా 27వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు.

కోనాయపల్లి ఆలయంలో పూజలు చేసి..

కేసీఆర్ తాను పోటీ చేసే గజ్వేల్, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గాల్లో నవంబర్ 9న నామినేషన్లు దాఖలు చేస్తారు. కేసీఆర్ సెంటిమెంట్, ఆనవాయితీ మేరకు ఆ రోజున ఉదయం సిద్దిపేట నియోజకవర్గంలోని కోనాయపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నామినేషన్ పత్రాలు పెట్టి ప్రత్యేక పూజలు చేస్తారు. తర్వాత గజ్వేల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేసి, మధ్యాహ్నం కామారెడ్డికి చేరుకుని రెండో నామినేషన్ సమర్పిస్తారు. అనంతరం కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు.

త్వరలోనే రాష్ట్రానికి చీడ విరగడ

ఢిల్లీలో మీడియాతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: మరికొన్ని రోజుల్లోనే రాష్ట్రానికి పట్టిన చీడ విరగడ కాబోతోందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో ఇప్పటికే కేసీఆర్‌కు చలిజ్వరం పట్టిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడనుండటంతో ఇకపై ఆయన ఫాంహౌస్ నుంచి బయటకు రావాల్సిన అవసరం లేదన్నారు. నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్ని కల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించిన నేపథ్యంలో సోమవారం ఢిల్లీలో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.

చర్చకు సిద్ధమా?

రాబోయే విజయదశమిని తెలంగాణ ప్రజలు ఉత్సాహంగా జరుపుకోవాలని రేవంత్‌రెడ్డి సూచించారు. అధికారం కోల్పోతున్నామన్న భయం బిల్లా–రంగాలలో మొదలైందని విమర్శించారు. అందుకే ఏ స్థాయి లేకపోయినా సోనియా గాంధీ, రాహుల్ గాంధీని విమర్శిస్తున్నా రని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలతో పాటు బీఆర్ఎస్ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు అందించిన పాలనపై అమర వీరుల స్థూపం వద్ద చర్చకు రావాలంటూ ఆయన సవాల్ విసిరారు. రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు దోచుకుందని, 10 వేల ఎకరాల భూములను ఆక్రమించుకుందని రేవంత్ ఆరోపించారు. అమరవీరుల స్థూపం, సచివాలయ నిర్మాణంలో కూడా దోపిడీకి పాల్పడ్డారని దుయ్యబట్టారు. అవినీతి సొమ్ముతో కేసీఆర్ ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారన్నారని... దీన్ని ప్రజలు తిప్పికొట్టాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు.

అక్బరుద్దీన్, అసదుద్దీన్‌కు ఎందుకు అసహనం?

తాము బీజేపీ, బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తుంటే ఎంఐఎం నేతలైన అక్బరుద్దీన్, అసదుద్దీన్‌లు ఎందుకు అసహనం చెందుతున్నారో అర్థంకావట్లేదని రేవంత్ వ్యాఖ్యానించారు. వారు ఎవరి పక్షాన నిలబడ్డారో, ఎవరికి మద్దతుగా నిలుస్తారో ఇప్పటికైనా తేల్చుకోవాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా బీజేపీ, బీఆరెస్ కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు.

సంక్షేమ పథకాలకు బ్రేక్!

- దళితబంధు, బీసీ బంధు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు బ్రేకులు
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో నిలుపుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగిన వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. దీంతో పలు సంక్షేమ పథకాలపై ఎన్నికల కోడ్ ప్రభావం చూపనుంది. ఇప్పటికే అమలవుతున్న పథకాలను కొనసాగించవచ్చని ఎన్నికల సంఘం సూచించినప్పటికీ ఆ పథకాలకు సంబంధించి కొత్తగా లబ్ధిదారుల ఎంపిక మాత్రం నిలిపివేయాల్సి ఉంటుంది. దీంతో సంక్షేమ శాఖలు అమలు చేస్తున్న పలు పథకాలకు కొంతకాలం బ్రేక్ పడినట్లే. ఎస్సీ కార్పొరేషన్ అమలు చేస్తున్న దళితబంధు పథకం మొదలు... బీసీ సంక్షేమ శాఖ అమలు చేసే బీసీబంధు, మైనార్టీ సంక్షేమ శాఖ అమలు చేసే మైనార్టీ బంధు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ద్వారా అమలయ్యే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు కొంతకాలం పాటు నిలిచిపోనున్నాయి. ఇప్పటికే పథకాల కింద లబ్ధిదారులను ఎంపిక చేసి నిధులు విడుదల చేసి ఉంటే ఆమేరకు లబ్ధిదారులకు ఆర్థికసాయాన్ని అందించవచ్చు. కానీ అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి లబ్ధి కలిగించే పరిస్థితులు మాత్రం కొంత కాలం వాయిదావేయాల్సి ఉంటుందని ఎన్నికల ప్రవర్తనా నియమావళి చెబుతోంది.

సీ ఓటర్.. 'చీటింగ్ ఓటర్' సర్వే: దాసోజు



సాక్షి, హైదరాబాద్: దాదాపు 50 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు సమర్థులైన అభ్యర్థులు కూడా దొరకని కాంగ్రెస్ పార్టీ 62 సీట్లు గెలుస్తుందని సీ ఓటర్ సర్వే తేల్చడం హాస్యాస్పదమని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. ఇప్పటికీ తెలంగాణ కాంగ్రెస్‌లో అసమ్మతి, గ్రూపు రాజకీయాలు, నాయకుల మధ్య విభేదాలతో కనీసం అభ్యర్థులను ప్రకటించలేకపోతోందని పేర్కొన్నారు. సందేహాస్పద సర్వేలు చేయడం, వాటిని మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తూ ఓటర్లను మభ్యపెడుతోందని ఆరోపించారు. కుట్రపూరిత సర్వేలతో సీఎం కేసీఆర్‌ని రాజకీయంగా దెబ్బకొట్టాలని 'సీ వోటర్' సర్వే ప్రయత్నిస్తోందన్నారు. 2018 ఎన్నికల్లోనూ ఇదే తరహాలో ప్రయత్నించి భంగపడిందని గుర్తుచేశారు. సీ ఓటర్ సర్వేకు తెలంగాణ ప్రజలు డిసెంబర్ 3న బుద్ధి చెప్తారని దాసోజు పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి బీజాలు నాటిన సీఎం కేసీఆర్ ప్రజల ఆశీర్వాదంతో మూడోసారి గెలుపొంది తెలంగాణను అగ్రగామిగా నిలుపుతారన్నారు. బూటకపు సర్వేలు, తప్పుడు కథనాలు కేసీఆర్ విజయాన్ని అడ్డుకోలేవని, తెలంగాణ కోసం జీవితాన్ని అర్పించిన కేసీఆర్‌కు ప్రజలు మళ్లీ పట్టం కట్టడం ఖాయమని దాసోజు పేర్కొన్నారు.

ఇక పక్కాగా అఫిడవిట్!

ఏ ఒక్క కాలమ్ భర్తీ చేయకున్నా నామినేషన్ తిరస్కరణ

- రూ.50 వేలకు పైగా నగదు తరలిస్తే జప్తు
- లెక్కలు చూపిస్తేనే విడుదల
- అక్టోబర్ 31 వరకు కొత్త ఓటర్ల నమోదు, వివరాల మార్పునకు అవకాశం
- నేరచరితులకు టికెట్లు ఎందుకిచ్చారో పార్టీలు పత్రికల్లో ప్రకటనలివ్వాలి
- ఎలక్షన్ షెడ్యూల్ ప్రకటన అనంతరం మీడియాతో సీఈఓ వికాస్‌రాజ్



రూ.50వేలకు పైగా నగదు తీసుకెళ్తుంటే తనిఖీల్లో జప్తు చేస్తారని, ఆ నగదుకు సంబంధించిన లెక్కలను చూపిస్తేనే విడిచి పెడ్తారని వికాస్‌రాజ్ తెలిపారు. రాజకీయ పార్టీలు ముందుగా సమాచారమిచ్చి నగదును తరలిస్తే వారికి అనుమతి జారీ చేస్తామని వెల్లడించారు.

సాక్షి, హైదరాబాద్: అభ్యర్థులు తమ ఎన్నికల అఫిడవిట్‌లోని ప్రతికాలమ్‌ను ఇకపై తప్పనిసరిగా పూరించాల్సిందే. కుటుంబ సభ్యుల వివరాలు, ఆస్తులు, అప్పులు, నేర చరిత్ర, విద్యార్హతలు తదితర వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశిత నమూనాలోని అఫిడవిట్‌లో పొందుపరచాల్సిందే. ఏ ఒక్క కాలమ్‌ను ఖాళీగా ఉంచినా సంబంధిత అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించనున్నారు. నామినేషన్ల పరిశీలనలో అభ్యర్థి తన అఫిడవిట్‌లో ఏదైనా కాలమ్‌ను ఖాళీగా ఉంచినట్టు నిర్ధారిస్తే, సదరు అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి నోటీసు జారీ చేసి ఆ కాలమ్‌ను నింపాలని కోరుతారు. అయినా కాలమ్‌ను నింపడంలో విఫలమైతే ఆ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరిస్తారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ స్పష్టం చేశారు.

అభ్యర్థులు నేరచరిత్రను పత్రికల్లో ప్రకటించాలి

రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో అదనపు సీఈఓ లోకేష్‌కుమార్, పోలీసు నోడల్ అధికారి సంజయ్‌కుమార్ జైన్, జాయింట్ సీఈఓ సత్యవతితో కలిసి మీడియాతో మాట్లాడారు. అభ్యర్థులు తమ నేర చరిత్రను పత్రికల్లో ప్రకటించాలని, నేర చరిత్ర గల అభ్యర్థులకు ఎందుకు టికెట్ ఇవ్వాల్సి వచ్చింది అన్న అంశంపై కారణాలు తెలుపుతూ రాజకీయ పార్టీలు సైతం పత్రికల్లో ప్రకటన ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

ఇక ఈసీ పరిధిలోకి అధికార యంత్రాంగం

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన మరుక్షణమే రాష్ట్ర ప్రభుత్వ అధికారులందరూ కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలోకి వచ్చేశారని, వారు ఈసీకి డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నట్టు పరిగణిస్తామని వికాస్‌రాజ్ స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం 6, ఓటర్ల వివరాల మార్పు కోసం ఫారం 8 దరఖాస్తుల స్వీకరణకు గడువు ఈ నెల 31 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఆలోగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన ఓటర్లకు ఎన్నికల్లో ఓటేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలతో సోమవారం తర్వాత అందనున్న ఫారం-7 దరఖాస్తులను ఎన్నికలు ముగిసే వరకు పెండింగ్‌లో పెడతామని వివరించారు.

వారికి ఇంటి నుంచే ఓటు హక్కు

దివ్యాంగులు, 80ఏళ్లు పైబడిన ఓటర్లకు తొలిసారిగా ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించే అవకాశాన్ని కల్పిస్తున్నట్టు వికాస్‌రాజ్ తెలిపారు. ఇందుకోసం ఫారం 12డీ దరఖాస్తు చేసుకోవాలని వారికి సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, ర్యాంపులు, వీల్‌చైర్ వంటి కనీస సదుపాయాలు కల్పిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్లతో పాటు ఈవీఎం బ్యాలెట్లలో సైతం అభ్యర్థుల ఫొటోలు ముద్రిస్తున్నామని తెలిపారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిశీలన కోసం తొలిసారిగా ఇంటిగ్రేటెడ్ ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నామని చెప్పారు. మీడియా సర్టిఫికేషన్ కమిటీ నుంచి ధ్రువీకరణ పొందిన తర్వాతే వాణిజ్య ప్రకటనలు జారీ చేయాలని రాజకీయ పార్టీలను కోరారు.

లెక్కలు చూపితే నగదు విడుదల...

పక్కాగా నిబంధనలు అమలు చేయాలి

రాష్ట్ర శాసనసభ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాలను నిక్కచ్చిగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులు(డీఈఓ), జిల్లా ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు సీఈఓ వికాస్ రాజ్ ఆదేశించారు. రాష్ట్ర వ్యయ పరిశీలన నోడల్ అధికారి మహేశ్ భగవత్, కేంద్ర సాయుధ బలగాల నోడల్ అధికారి స్వాతి లక్రా, రాష్ట్ర పోలీసు నోడల్ అధికారి సంజయ్‌కుమార్ జైన్‌తో కలిసి సోమవారం సాయంత్రం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. తాజా పరిణామాలను ఎప్పటికప్పుడు పై అధికారులకు తెలపాలని, వెబ్‌సైట్లలో సైతం ఆలస్యం చేయకుండా మార్పులు చేస్తుండాలని ఆదేశించారు.

కొత్త అభివృద్ధి పనులు, వాణిజ్య ప్రకటనలకు నో

సర్కారు వాహనాల్లో నేతల ఎన్నికల ప్రచారంపై నిషేధం

- ప్రభుత్వ ఆస్తులపై ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, పోస్టర్లు తొలగించాల్సిందే
- శాసనసభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన నేపథ్యంలో ఈసీ ఆదేశం
- రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం మధ్యాహ్నం ప్రకటించడంతో తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. డిసెంబర్ 5 నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండనుంది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికల నిర్వహణ కోసం ఈ కింద పేర్కొన్న చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది.

- ➡ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడిన 24గంటల్లోగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ భవనాల ప్రాంగణాల్లోని గోడలపై రాతలు, పోస్టర్లు/పేపర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు,జెండాలను తొలగించాలి.
- ➡ షెడ్యూల్ వచ్చిన 48 గంటల్లోగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల వంటి ప్రభుత్వ ఆస్తుల నుంచి అన్ని రకాల అనధికార రాజకీయ ప్రకటనలను తీసేయాలి.
- ➡ షెడ్యూల్ ప్రకటన తర్వాత 72 గంటల్లోగా ప్రైవేటు ఆస్తుల వద్ద నుంచి అనధికార రాజకీయ ప్రకటనలన్నింటినీ తొలగించాలి.
- ➡ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు లేదా ఎన్నికలతో సంబంధం ఉన్న వ్యక్తులు ఎన్నికల ప్రచార కార్యక్రమాలు,ఎన్నికల కార్యకలాపాలు, ఎన్నికల రవాణా అవసరాలకోసం ప్రభుత్వ వాహనాలను వినియోగించరాదు.
- ➡ అధికార పార్టీ ప్రజాధనంతో వార్తాపత్రికలు, ఇతర మాధ్యమాల్లో వాణిజ్య ప్రకటనలు ఇవ్వరాదు.
- ➡ పక్షపాత ధోరణితో రాజకీయ వార్తలు, ప్రచారంతో ఎన్నికల్లో లబ్ధికి ప్రభుత్వ ప్రసార మాధ్యమాలను దుర్వినియోగం చేయరాదు.
- ➡ ప్రభుత్వ సొమ్ముతో ప్రభుత్వ విజయాలపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఎలాంటి వాణిజ్య ప్రకటనలు ఇవ్వరాదు. ఒకవేళ ఇప్పటికే ఇచ్చి ఉంటే వాటిని ఎన్నికల అధికారులు నిలుపుదల చేయించాలి.
- ➡ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారిక వెబ్‌సైట్ల నుంచి మంత్రులు, రాజకీయ నేతలు, రాజకీయ పార్టీలకు సంబంధించిన అన్ని రకాల సమాచారాన్ని తొలగించాలి.
- ➡ ఇప్పటికే ప్రాంభించిన అభివృద్ధి పనులు, ఇంకా ప్రారంభించని కొత్త పనుల జాబితాలను ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించాక 72 గంటల్లోగా అన్ని శాఖల నుంచి ఎన్నికల అధికారులు తెప్పించుకోవాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి కొత్త పనులు ప్రారంభిస్తే ఈ జాబితాల ఆధారంగా చర్యలు తీసుకోవాలి.
- ➡ ఎన్నికల ఫిర్యాదులను 1950 టోల్ ఫ్రీ నంబర్ లేదా వెబ్‌సైట్ ద్వారా 24 గంటలూ స్వీకరించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలి. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎస్ఎంఎస్ ద్వారా ఫిర్యాదుదారులకు తెలపాలి.

రూ. 50 వేలకుపైగా నగదు తీసుకెళ్లేవారు ఆధారాలు చూపాలి



ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో రంగంలోకి దిగిన నిఘా బృందాలు అక్రమ మద్యం, నగదు, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టడానికి ముమ్మర తనిఖీలు ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో ఎవరైనా వ్యక్తులు తమ అవసరాల కోసం రూ. 50 వేలకు మించి నగదును తీసుకెళ్లాలనుకుంటే అందుకు సంబంధించిన అన్ని రుజువులను దగ్గర పెట్టుకోవాలని ఈసీ సూచించింది. భూ విక్రయాలు/కొనుగోళ్లకు సంబంధించిన డబ్బు తీసుకెళ్తుంటే అందుకు సంబంధించిన దస్తావేజులు ఉండాలని పేర్కొంది. ఒకవేళ ఆస్పత్రుల్లో బిల్లు చెల్లింపుల కోసం రూ. 50 వేలకు మించి నగదు తీసుకెళ్లే వారు ఆస్పత్రి కేస్ షీట్, రశీదులు, ఎస్టిమేట్స్ వంటివి దగ్గర పెట్టుకోవాలని కోరింది. బంగారు, వెండి ఆభరణాలను ఇతరత్రా పంపిణీకి తీసుకెళ్లే వస్తువులు ఏమైనా అందుకు తగ్గ రశీదులు దగ్గర పెట్టుకోవాలని సూచించింది.

ఎన్నికలొచ్చాయ్..

▶ మొదటి పేజీ తరువాయి

నోటిఫికేషన్ జారీ చేస్తారు. నామినేషన్ దాఖలుకు నవంబర్ 10 ఆఖరు తేదీగా నిర్ణయించారు. నవంబర్ 13న దరఖాస్తుల పరిశీలన చేపడతారు. ఉపసంహరణకు నవంబర్ 15 వరకు గడువు ఇస్తారు. అదే నెల 30న రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఒకేసారి పోలింగ్ జరుగుతుంది. మావోయిస్ట్ ప్రభావిత రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లో రెండు విడతల్లో, మిగతా మూడు రాష్ట్రాల్లో ఒకే విడతలో పోలింగ్ పూర్తికానుంది. ఎన్నికల షెడ్యూల్, పోలింగ్ వేర్వేరు తేదీల్లో ఉన్నా.. ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపును మాత్రం డిసెంబర్ 3వ తేదీనే చేపట్టి, ఫలితాలను ప్రకటించనున్నారు.

ఐదు రాష్ట్రాలు.. 16.14 కోట్ల మంది ఓటర్లు

ఐదు రాష్ట్రాల్లోని మొత్తం 679 నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహిస్తుండగా, మొత్తం 16.14 కోట్ల మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లేనని సీఈసీ రాజీవ్‌కుమార్ ప్రకటించారు. ఐదు రాష్ట్రాల్లో కలిపి 2,900కు పైగా పోలింగ్ కేంద్రాలను యువత నిర్వహిస్తారని తెలిపారు.

మొదటిసారిగా 'సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం'

ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్)ను ఎవరైనా అతిక్రమించినట్టు గుర్తిస్తే.. సీవిజిల్ యాప్ ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చని సీఈసీ రాజీవ్ కుమార్ సూచించారు. క్రిమినల్ కేసులున్న అభ్యర్థులు తప్పనిసరిగా కేసులకు సంబంధించి పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని స్పష్టం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మొదటిసారిగా 'ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం'ను ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ఖర్చుపై పూర్తిస్థాయి పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. నాన్ షెడ్యూల్డ్ చార్టర్డ్ విమానాలతోపాటు రైల్వే, పోస్టల్ కార్గోలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని చెప్పారు. వివాదాస్పద, సున్నితమైన ప్రాంతాల్లో కేంద్ర పారామిలటరీ బలగాలను మోహరిస్తామన్నారు.

ఎన్నికల నేపథ్యంలో నగదు తరలింపు, ఉచితాలు, బహుమతులు, మద్యం, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టడానికి విస్తృత తనిఖీలు చేపట్టనున్నామని.. ఈ మేరకు నిఘా వ్యవస్థను పటిష్టం చేశామని వివరించారు. ఐదు రాష్ట్రాల్లో మొత్తం 940 చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ ఇదీ..

రాష్ట్రం	మొత్తం సీట్లు	నోటిఫికేషన్	నామినేషన్ల ముగింపు	నామినేషన్ల పరిశీలన	ఉపసంహరణ	పోలింగ్
తెలంగాణ	119	నవంబర్ 3	నవంబర్ 10	నవంబర్ 13	నవంబర్ 15	నవంబర్ 30
రాజస్తాన్	200	అక్టోబర్ 30	నవంబర్ 6	నవంబర్ 7	నవంబర్ 9	నవంబర్ 23
మధ్యప్రదేశ్	230	అక్టోబర్ 21	అక్టోబర్ 30	అక్టోబర్ 31	నవంబర్ 2	నవంబర్ 17
ఛత్తీస్‌గఢ్ (తొలివిడత)	90	అక్టోబర్ 13	అక్టోబర్ 20	అక్టోబర్ 21	అక్టోబర్ 23	నవంబర్ 7
ఛత్తీస్‌గఢ్ (రెండో విడత)	-	అక్టోబర్ 21	అక్టోబర్ 30	అక్టోబర్ 31	నవంబర్ 2	నవంబర్ 17
మిజోరం	40	అక్టోబర్ 13	అక్టోబర్ 20	అక్టోబర్ 21	అక్టోబర్ 23	నవంబర్ 7

రాష్ట్ర శాసనసభ ఎన్నికల షెడ్యూల్ ఇదీ..

- ☛ గెజిట్ నోటిఫికేషన్: నవంబర్ 3, 2023 (శుక్రవారం)
- ☛ నామినేషన్ల ముగింపు: నవంబర్ 10, 2023 (శుక్రవారం)
- ☛ నామినేషన్ల పరిశీలన: నవంబర్ 13, 2023 (సోమవారం)
- ☛ ఉపసంహరణకు చివరి తేదీ: నవంబర్ 15, 2023 (బుధవారం)
- ☛ పోలింగ్ తేదీ: నవంబర్ 30, 2023 (గురువారం)
- ☛ ఓట్ల లెక్కింపు, ఫలితాలు: డిసెంబర్ 3, 2023 (ఆదివారం)
- ☛ ఎన్నికల ప్రక్రియ పూర్తి: డిసెంబర్ 5, 2023 (మంగళవారం)

తెలంగాణ ఓటర్ల లెక్కలివీ..

మొత్తం ఓటర్లు:	3,17,17,389	80ఏళ్లు పైబడిన ఓటర్లు:	4.43 లక్షలు
పురుషుల సంఖ్య:	1,58,71,493	100 ఏళ్లు పైబడిన ఓటర్లు:	7,689
మహిళల సంఖ్య:	1,58,43,339	తొలిసారి ఓటర్లు:	8.11 లక్షలు
స్త్రీ, పురుష ఓటర్ల మధ్య నిష్పత్తి:	998	సర్వీసు ఓటర్లు:	15,338
ట్రాన్స్‌జెండర్లు:	2,557 మంది	చెంచు, కొలాం, తోటి, కొండరెడ్లు తదితర ఆదివాసీ ఓటర్లు:	39,186
దివ్యాంగ ఓటర్లు:	5.06 లక్షలు		

మొత్తం నియోజకవర్గాలు 119

- జనరల్ నియోజకవర్గాలు: 88
- ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలు: 19
- ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలు: 12

పోలింగ్ కేంద్రాల లెక్క ఇదీ..

మొత్తం పోలింగ్ కేంద్రాలు	35,356
పట్టణ ప్రాంతాల్లో కేంద్రాలు	14,464
గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రాలు	20,892
సగటున ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఓటర్లు	897
మోడల్ పోలింగ్ కేంద్రాలు	644
దివ్యాంగుల నిర్వహణలోని కేంద్రాలు	120
మహిళల నిర్వహణలోని కేంద్రాలు	597

ధర్మ సమాజ్ పార్టీకి టార్చిలైట్ గుర్తు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న పార్టీలకు సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించింది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రం నుంచి దరఖాస్తు చేసుకున్న ధర్మ సమాజ్ పార్టీకి టార్చిలైట్ గుర్తును కేటాయించామని, తెలంగాణలో జరిగే ఎన్నికల్లో ఈ గుర్తుతో పోటీ చేసుకోవచ్చని పేర్కొంది. ఈ మేరకు సోమవారం కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మాట్లాడుతూ 119 నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, అణగారిన వర్గాల నేతలు బరిలో ఉంటారన్నారు. ప్రజలందరూ ధర్మ సమాజ్ పార్టీలో భాగస్వాములు కావాలని, తెలంగాణలో అట్టడుగు వర్గాల రాజ్యాన్ని స్థాపించడానికి అన్ని కులాలు కలిసిరావాలని విశారదన్ పిలుపునిచ్చారు.

గొల్ల కురుమలను అప్పుల పాలు చేశారు: రవీందర్

సాక్షి, హైదరాబాద్: గొల్లకురుమలను కోటీశ్వరులని చేస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం వారిని అప్పుల పాలు చేసిందని తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్‌యాదవ్ ఆరోపించారు. సబ్సిడీ గొర్రెలిస్తామని చెప్పి రాష్ట్రవ్యాప్తంగా 1.16 లక్షల మంది వద్ద డీడీలు కట్టించుకున్న ప్రభుత్వం.. ఇప్పటివరకు 28 వేల మందికే ఇచ్చిందని, మిగతావారి సంగతేంటని ప్రశ్నించారు. సబ్సిడీ గొర్రెల పంపిణీకి సరిపడా నిధులు విడుదల చేసి నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ జీఎంపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మాసాబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయం ముట్టడికి యత్నించారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. రవీందర్ మాట్లాడుతూ గొర్రెల పంపిణీ కోసం 5 రోజుల కిందట రూ.50 కోట్లు విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని, ఆ నిధులతో కేవలం 3,800 మందికి మాత్రమే గొర్రెలు ఇవ్వొచ్చని తెలిపారు. 50 ఏళ్లు దాటిన గొర్ల కాపరులకు నెలకు రూ.5 వేల పింఛన్, ప్రమాదాల్లో చనిపోయేవారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, గొర్రెలకు ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కిల్లె గోపాల్, రాష్ట్ర నాయకులు శంకరయ్య, కె.లింగయ్య, బి.అశోక్, సాదం రమేశ్, లింగయ్య, మధుకర్‌లతో పాటు వందలాది మంది గొల్లకురమలు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖలో మరో ఐదుగురు సస్పెన్షన్

నల్లగొండ అగ్రికల్చర్: నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖలో మరో ఐదుగురు అధికారులపై వేటుపడింది. శనివారం ముగ్గురు అధికారులను సస్పెండ్ చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్.. సోమవారం మరో ఐదుగురు మండల వ్యవసాయ అధికారులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌తో పాటు ఐదుగురు అధికారులను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు అటాచ్ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. సస్పెన్షన్ సమయంలో వారికి రావాల్సిన అలవెన్స్‌లను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పొందాల్సి ఉంటుంది. వానాకాలం సీజన్‌లో యూరియా స్టాకు లేనప్పటికీ, అందుబాటులో ఉన్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖకు తప్పుడు నివేదిక ఇచ్చినందుకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. నల్లగొండ ఏఓ సుమన్‌రామన్, చండూరు ఏఓ మల్లేశ్, హాలియా ఏఓ సంతోషి, చందంపేట ఏఓ మల్లారెడ్డి, చింతపల్లి ఏఓ రామలింగేశ్వర్ సస్పెండ్ అయినవారిలో ఉన్నారు.









తన ఆలోచనల రంగులతో ఆత్మ వన్నెలద్దుకుంటుంది.
– మార్కస్ అరీలియస్

సాక్షి
మంగళవారం, 10 అక్టోబర్ 2023

మానవాళి కోరుకోని యుద్ధం

ఆ దృశ్యాలు ఏదో హార్రర్ సినిమానో, మరేదో అమెరికన్ వార్ సినిమానో చూస్తున్నట్లుంది. ఇజ్రాయెల్‌పై పాలస్తీనాకు చెందిన 'హమాస్' తీవ్రవాద సంస్థ జరిపిన ఆకస్మిక దాడులు, బదులుగా గాజా భూఖండంపై ఇజ్రాయెల్ చేస్తున్న ప్రతీకార దాడుల దృశ్యాలు మూడు రోజులుగా చూస్తున్న వారికి ఒళ్ళు ఝల్లుమనేలా చేస్తున్నాయి. భారీ విధ్వంసాలు, 1200 మందికి పైగా మృతులు, వేలల్లో నిరాశ్రయులు, పసిపిల్లల మొదలు పదహారేళ్ళ పడుచుల దాకా తీవ్రవాదుల చేతిలో చిక్కిన వందకు పైగా బందీల కథ మానవతావాదుల గుండెను బరువెక్కిస్తోంది. పొరుగున ఉన్న అరబ్ దేశాలతో ఇప్పుడిప్పుడే ఇజ్రాయెల్ సంబంధాలు మెరుగుపడుతున్నాయనీ, ఆర్థిక సహకారం – శాంతి సాధనే ధ్యేయంగా సరికొత్త మధ్యప్రాచ్యానికి బాటలు పడుతున్నాయనీ భావిస్తున్న వేళ ఉరుము లేని పిడుగులా హమాస్ దాడి మొత్తం కథను మార్చేసింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ చేసిన అనివార్య యుద్ధప్రకటన కాలాన్ని వెనక్కి తిప్పేసింది. తాజా ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంతో దశాబ్దాల పాటు మధ్యప్రాచ్యంలో కొనసాగిన అశాంతి మళ్ళీ భూతమై తిరిగొచ్చింది.

ఇది యాభై ఏళ్ళ నాటి జ్ఞాపకాలను తట్టిలేపింది. అప్పట్లో 1973 అక్టోబర్ 6న యూదుల లెక్కలో పవిత్రమైన యోమ్ కిప్పూర్ రోజున ఈజిప్ట్, సిరియాలు సరిగ్గా ఇలాగే ఇజ్రాయెల్‌పై దాడి చేశాయి. 1949, 1956, 1967 తర్వాత 'నాలుగో అరబ్ – ఇజ్రాయెలీ యుద్ధం'గా పేరుబడ్డ ఆ 19 రోజుల యుద్ధంలో చివరకు ఇజ్రాయెల్ పైచేయి సాధించి, పొరుగు భూభాగాలను స్వాధీనం చేసుకుంది. దాంతో, పశ్చిమాసియాలో పరిస్థితులు ఒక్కసారిగా మారాయి. అప్పటిలానే మళ్ళీ ఇప్పుడు ఇజ్రాయెల్‌పై భయానక దాడి జరిగింది. అదీ పవిత్ర హిబ్రూ బైబిల్‌లోని తొలి అయిదు భాగాల సమాహారమైన తోరా పఠనం ప్రారంభించే రోజున జరిగింది. గూఢచర్యంలో, దాడుల్ని నిరోధించే వ్యవస్థల్లో పేరున్న ఇజ్రాయెల్ ఈసారీ ఏమరుపాటుతో ఉంది. అక్టోబర్ 7 తెల్లవారుజామున అంతా నిద్రలో ఉన్న వేళ ఆకాశ, సముద్ర, భూ మార్గాలు మూడింటి ద్వారా, ఏకకాలంలో అనేక ప్రాంతాల్లో హమాస్ తీవ్రవాదులు ఆకస్మిక దాడి జరిపి, దిగ్భ్రాంతికి గురిచేశారు. 5 నుంచి 7 వేల రాకెట్ల వర్షం కురిపించారు. ఇజ్రాయెల్ అన్నట్టు ఒక రకంగా ఇది... 2001 సెప్టెంబర్ 11న అమెరికాలో అంతర్జాతీయ వాణిజ్య కేంద్ర జంట భవనాలపై అల్–ఖైదా తీవ్రవాదుల '9/11 దాడుల'ను గుర్తుచేస్తోంది.

ప్రపంచ ప్రసిద్ధ క్షిపణి – రాకెట్ నిరోధక వ్యవస్థ 'ఐరన్ డోమ్ సిస్టమ్'ను సైతం తప్పించుకొని, వందలాది రాకెట్లు ఇజ్రాయెల్ భూభాగంలోకి చొచ్చుకొని రావడం నివ్వెరపరిచింది. ఇది నెతన్యాహూ సర్కార్ వైఫల్యాల్లో కొత్త చేరిక. తూర్పు జెరూసలేమ్‌లోని పవిత్ర అల్–అక్సా మసీదుకు వచ్చే పాలస్తీనా భక్తులపై దాడులు, మసీదులోకి యూదుల ప్రవేశం లాంటి రెచ్చగొట్టే చర్యలు పరిస్థితిని ఇక్కడి దాకా తెచ్చాయి. తాజా దాడి నుంచి ఇజ్రాయెల్ వెంటనే తేరుకొని, హమాస్ కీలక కేంద్రాలపై ప్రతిదాడులు జరిపింది. జొరబడిన హమాస్ తీవ్రవాదులను నిర్వీర్యం చేసింది. ఇప్పుడప్పుడే తెగే అవకాశం లేని ఈ యుద్ధంలో సైనిక బలిమితో చివరకు ఇజ్రాయెలే గెలవచ్చు కానీ, ఇరువైపులా జరిగే నష్టం మాటేమిటి? ఇరాన్‌ను శత్రువుగా భావిస్తూ, దాన్ని శిక్షించడానికి ఇజ్రాయెల్‌ను వాటంగా చేసుకుంటున్న అమెరికా ఈ ఒత్తిడి వ్యూహం వల్ల మధ్యప్రాచ్యంలో మంటలు చల్లారవని గ్రహించాలి.

మధ్యప్రాచ్యంలో మంటలు ఈనాటివి కావు. 1948లో ఇజ్రాయెల్ ఏర్పాటుతో లక్షలాది పాలస్తీనియన్లు నిరాశ్రయులై, సొంత గడ్డ మీదే శరణార్థులు కావాల్సి వచ్చింది. నాటి నుంచి పాలస్తీనియన్లకూ, ఇజ్రాయెల్‌కూ మధ్య పోరు సాగుతూనే ఉంది. గతంలో 2008–09లో, 2014లో ఇజ్రాయెల్‌కీ, హమాస్‌కీ మధ్య యుద్ధాలు జరిగాయి. కానీ, కథ కంచికి చేరలేదు. నిజానికి, పాలస్తీనియన్ ప్రజలందరికీ హమాస్ ప్రతినిధి అనుకోవడం కూడా పొరపాటే. ఆ తీవ్రవాద సంస్థ చేసిన చర్యలన్నిటికీ పాలస్తీనాను తప్పుబట్టలేం. కానీ, దీర్ఘకాలిక పాలస్తీనా సమస్యకు పరిష్కారానికి చర్చలు, శాంతియుత మార్గమే సాధనం. అది గ్రహించకుండా హింసకు దిగేవారిని కూడా క్షమించలేం. తీవ్రవాద దాడుల దుష్ఫలితం ఇప్పటికే ప్రతిదాడుల రూపంలో గాజా భూఖండంలో అమాయకులపై పడింది. ఈ ప్రాంతంలో దీర్ఘకాలిక శాంతి, సుస్థిరతలు కావాలంటే పాలస్తీనియన్లకూ, ఇజ్రాయెల్‌కూ మధ్య పరస్పర అంగీకారయోగ్యమైన రాజకీయ రాజీ కుదరాలి. స్వతంత్ర పాలస్తీనా దేశమనేది అసాధ్యమైన వేళ ఆచరణయోగ్య పరిష్కారం వైపు ఆలోచించాలి. పాలస్తీనా పక్షాన ఇజ్రాయెల్‌కు ఎదురొడ్డుతున్న ఇరాన్, సిరియా, లెబనాన్‌లోని హెజ్బొల్లా బృందం అది గ్రహించాలి. ఉక్రెయిన్ యుద్ధంతో అస్తుబిస్తవుతున్న ప్రపంచం మరో యుద్ధాన్ని భరించలేదు.

భారత్ సంగతికొస్తే, రక్షణ వ్యవహారాల్లో బలమైన భాగస్వామి అయిన ఇజ్రాయెల్ చేతిని విడిచిపెట్టే పరిస్థితి లేదు. అదే సమయంలో దశాబ్దాల తరబడి పాలస్తీనా అంశంలో బాధితుల గళానికి మద్దతుగా నిలిచిన చరిత్ర మనది. ఆ చారిత్రక వైఖరిని పూర్తిగా వదిలేసి, ఇరాన్‌తో పాటు వివిధ అరబ్బు దేశాలతో స్నేహానికి పీటముడి వేసుకోనూ లేము. 'ఈ కష్టకాలంలో ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటిస్తున్నాం' అని భారత ప్రధాని ప్రకటించారు. దురాక్రమణలు, తీవ్రవాద దాడులను విస్పష్టంగా ఖండించాల్సిందే. అదే సమయంలో గాజా భూఖండంపై ప్రతీకార దాడుల వల్ల ఇప్పటికే నిరాశ్రయులైన లక్షా పాతిక వేల మంది సామాన్య పౌరులపై మానవతాదృష్టి సారించాల్సిందే. అందుకు మనం ఇప్పుడు ఆచితూచి అడుగేయాలి. తటస్థంగా ఉంటూ, శాంతి స్థాపనకు కృషి చేయాలి. పాలస్తీనియన్లకు కొద్దిపాటి సడలింపులిస్తే ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలకు సిద్ధపడ్డ సౌదీ అరేబియా సైతం నిర్మాణాత్మక పాత్ర పోషించాలి. మానవాళి కోరుకోని ఈ యుద్ధం ఆగాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.ఏకాదశి ప.3.10 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.7.03 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.8.21 నుండి 10.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.03 వరకు, తదుపరి రా.10.33 నుండి 11.23 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం: 5.55
సూర్యాస్తమయం: 5.40
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

వారు బాధితులు! 'వర్కర్లు' కాదు!

అభిప్రాయం



రంగనాయకమ్మ

దేహమే బ్రతుకుదెరువుగా వుండే స్త్రీకి 'సెక్సు వర్కరు' అనే కొత్త పేరు మర్యాదగా ఇచ్చామనుకున్నారు సుప్రీంకోర్టువారు. కానీ, అది ఆమెని గతం కన్నా మరింతగా అవమానం చెయ్యడమే అవుతుంది. వ్యభిచారం అనేది, సహజమైన 'పని' కాదు. దానికి 'పని'గా పేరు పెడితే, ఆ స్త్రీ ఆ 'సెక్సు పని'తో, పది రెట్లు నీచపడవలిసిందే. కుట్టూ, నేతా, విద్యా, వైద్యం వగైరా పనులన్నీ సమాజానికి సహజమైనవి. ఇవి ఎన్ని వేల సంవత్సరాలకైనా అనవసరం అవవు. గతిలేక వ్యభిచారాన్నే బ్రతుకుతెరువుగా వున్నవారికి, సహజమైన పనుల ద్వారా సమాజం బ్రతుకుదెరువులు కల్పిస్తే, 'వ్యభిచారం' అనే నీచ 'వృత్తి', ఆ మర్నాటి నించే వుండదు. అది 'పని' కాదు కాబట్టి, మాయం అవుతుంది.

క్రిందటి నెలలో, సుప్రీం కోర్టులో, ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన, 5గురు జడ్జీల ధర్మాసనం, కొన్ని సూచనలు చేసింది. కోర్టు పత్రాలలో లాయర్లు గానీ, తీర్పులలో జడ్జీలు గానీ, స్త్రీలను ప్రస్తావించవలిసినప్పుడు, ఉపయోగించవలిసిన భాష గురించి ఆ సూచనలు. ఆ సూచనలన్నీ కలిపి 30 పేజీల పుస్తకం. ఇప్పుడు కోర్టు పత్రాలలో తరచుగా ఉపయోగిస్తున్న 'సరి కాని' ('ఇన్ కరెక్ట్') మాటల్నీ, వాటికి బదులు ఉపయోగించవలిసిన సరైన ('ప్రిఫర్డ్') మాటల్నీ సూచిస్తూ, ఆ జడ్జీల ధర్మాసనం కొన్ని పద పట్టికలను కూడా ఇచ్చింది.

స్త్రీలను పురుషాధిక్య భావాలతో, స్టీరియో టైప్‌గా చెప్పకూడదని సుప్రీం కోర్టు భావించింది. అది మంచిదే. వారు సూచించిన విషయాల్లో, ఒక్క విషయం గురించి మాత్రమే నేను ప్రత్యేకంగా ఇది రాస్తున్నాను.

'వేశ్య' అనీ, 'వ్యభిచారిణి' అనీ వాడే మాటకి బదులు, 'సెక్స్ వర్కర్' అనే మాటని వాడమని కోర్టు ధర్మాసనం వారు సూచించారు. ఈ సూచన పూర్తిగా తర్కరహితమైనదిగానూ, ఆ స్త్రీల మీద జరిగే పురుష దుర్మార్గాన్ని మరుగుపరిచేదిగానూ వుందని, నా అభిప్రాయం!

'వ్యభిచారిణి' అనే మాటకి బదులు 'సెక్స్ వర్కర్' అనే మాటని 'మంచి సూచనగా' చెప్పడం, ఆ స్త్రీకి తీవ్రమైన అన్యాయమేనని చెప్పడానికి కారణం, వారి బాధల గురించి నాకు ఎంతో కొంత తెలుసు. వ్యభిచార జీవితాల మీద, 54 ఏళ్ళ క్రిందట, నేను ''అంధకారంలో...'' అనే ఒక నవలనూ, గత 20 ఏళ్ళలో 4 వ్యాసాలనూ రాశాను.

అసలు ఒక స్త్రీ వ్యభిచారిణిగా బ్రతకడానికి మొదటి కారణం, ఆమె నిరుపేదతనం. రెండో కారణం, పురుష జనాభాలో అత్యధికులు, పేద స్త్రీలని మోసాలతో ఉపయోగించుకోవడం. వ్యభిచారిణిగా బ్రతికే స్త్రీని, ఆ పేరుతోనే అనడం వల్ల, 'ఆమె నీతిపరురాలు కాదు' అని ఆమెని అవమానించడం అవుతుందనీ; అలాగాక, ఆమెని 'సెక్సు వర్కరు' అంటే, ఇతర కార్మికుల లాగే ఆమె కూడా 'ఒక కార్మికురాలు' అనే అర్థం వల్ల ఆమెకి అవమానం అవదనీ, కోర్టువారు భావించినట్టు అర్థం వస్తోంది.

'వ్యభిచారిణి'కీ, 'సెక్సు వర్కరు'కీ, తేడాలు చూస్తే, రెండో మాటే ఆ స్త్రీని రెట్టింపుగా నీచపరిచే మాట అవుతుందని నా అభిప్రాయం!

'సెక్సు వర్కరు'అంటే? 'సెక్సు' అనే మాటకి వేరు వేరు అర్థాలు వున్నా, ఈ సందర్భానికి అయితే, 'కామ సంబంధం' అనే అర్థం. ఇక, 'వర్కరు' అంటే? 'పనిమనిషి' అని అర్థం కదా? 'సెక్సు వర్కరు' అన్నప్పుడు, ఆ మనిషి ఒక 'వర్కరు'!

సమాజంలో, యజమానుల దగ్గిర వేరు వేరు పనులు చేసే వర్కర్లు అందరూ పనిదినంలో, 8–9 గంటల సేపు ఆ పనులు చేస్తూనే వుంటారు! వర్కర్లు జీతాలు తీసుకుంటారు కాబట్టి అన్ని గంటలూ పనిచేయాలని రూలు.



కామ సంబంధాన్ని 'పని'గా భావిస్తున్నారు సుప్రీం కోర్టు వారు! వ్యభిచారిణులకు అయితే, యజమాని వున్నా, లేకపోయినా 'ఇన్ని పనిగంటలు' అని ఒక హద్దు వుండదు. వారి ఆరోగ్యం నాశనం అవడానికి మాత్రం ఒక హద్దు వుండేదే!

'సెక్సు పనిమనిషి' అంటే, ఆమె డ్యూటీ ఏమిటి? వ్యభిచార వ్యాపారాలు చేయించే ఒక రహస్య కంపెనీలో, మోసపు మాటలతో, ఆ కూపంలో పడిపోయిన ఒక నిరుపేదరాలితో, మురళీధర్ అనే ఒక జర్నలిస్టు చేసిన ఇంటర్వ్యూని చూస్తే, ఆ 'సెక్సు వర్కరు' పురుషుల చేతిలో ఎంతటి క్రూరత్వాన్ని అనుభవించిందో తెలుస్తుంది. ఇందులో అతి ముఖ్యమైన విషయం, 'పని' అంటే, ఎవ్వరైనా, రోజులో కొంత విశ్రాంతి తీసుకున్నా, పనిదినం అంతా పని చెయ్యవలిసిందే. ఈ 'సెక్సు వర్కరు' కూడా, నూటికి నూరుపాళ్ళూ అటువంటి వర్కరే! ఆమె, ప్రతీ గంటా, ప్రతీ అరగంటా వేరు వేరు పురుషుల చేతుల్లో వుండాలి. ఎప్పుడైనా, ఆమె తిరస్కరిస్తే, ఆ మొగమనిషి, 'అదెలాగ? ఇప్పుడే నేను డబ్బు ఇచ్చేసి వచ్చాను. నేను ఈ పని చూసుకుని తొందరగా పోవాలి' అంటాడని, ఆ ఇంటర్వ్యూలోని స్త్రీ చెప్పింది. రోజులో, అన్ని గంటలూ 'పని' చెయ్యాలి కాబట్టి, 10 మంది వచ్చినా, ఇంకా పెరిగినా అలాగే ఈ వర్కరు గడపాలి.

వ్యభిచారమే బ్రతుకుతెరువుగా వున్న స్త్రీ, తనూ, తన బిడ్డలూ బ్రతకడానికే, ఆ మార్గాన్ని గతిలేక ఎంచుకుందే గానీ, ఆమె కామాంధురాలూ కాదు; నీచురాలూ కాదు. ఆ నీచత్వం అంతా సమాజానిదే!

దేహమే బ్రతుకుదెరువుగా వుండే స్త్రీకి 'సెక్సు వర్కరు' అనే కొత్త పేరు మర్యాదగా ఇచ్చామనుకున్నారు కోర్టువారు. కానీ, అది ఆమెని గతం కన్నా మరింతగా అవమానం చెయ్యడమే అవుతుంది. ఎలాగంటే, వ్యభిచారం అనేది, సహజమైన 'పని' కాదు. కానీ, దానికి 'పని'గా పేరు పెడితే, ఆ స్త్రీ ఆ 'సెక్సు పని'తో, పది రెట్లు నీచ పడవలిసిందే.

అసలు, కుట్టూ, నేతా, విద్యా, వైద్యం వగైరా పనులన్నీ సమాజానికి సహజమైనవి. ఇవి ఎన్ని వేల సంవత్సరాలకైనా అనవసరం అవవు. కానీ, గతిలేక వ్యభిచారాన్నే బ్రతుకుతెరువుగా వున్నవారికి, సహజమైన పనుల ద్వారా సమాజం బ్రతుకుదెరువులు కల్పిస్తే, 'వ్యభిచారం' అనే నీచ 'వృత్తి', ఆ మర్నాటి నించే వుండదు. పోతుంది. అది 'పని' కాదు కాబట్టి, మాయం అవుతుంది.

'సెక్సు వర్కరు' అనే మాటని, ఒక మంచి సంస్కరణగా, గతంలో బూర్జువా స్త్రీ వాదులు కూడా భావించారు. కానీ, కామ సంబంధం అనేది, శరీర ధర్మం అయినా, అది 'సెక్సు వర్కరు' సంబంధంగా పేరు తెచ్చుకుంటే, 'సెక్సు వర్కరు' పేరుతో, ఆ స్త్రీ, కార్మికురాలు అవుతుందని బూర్జువా స్త్రీ సంస్కర్తలు భావించి, దాని కోసం 1997లో ఒక మేనిఫెస్టోని కూడా విడుదల చేశారు, అదేదో గొప్ప సంస్కరణ లాగ!

ఇప్పుడు, సుప్రీం కోర్టు కూడా ఇదే రకంగా, అవే పదాల్ని వాడమంటున్నది. 2022లో, సుప్రీం కోర్టు ఇచ్చిన ఒక తీర్పు కూడా, వ్యభిచారాన్ని ఒక 'వృత్తి'గా గుర్తించాలనే తీర్పు ఇచ్చింది. అదే దృష్టితో, ఇప్పుడు 'వేశ్య', 'వ్యభిచారిణి' అనే పదాలకు బదులు 'సెక్సు వర్కర్' అనే పదాన్ని వాడమని సుప్రీం కోర్టువారు సూచించారు. ఇది అన్యాయం. ఆమెను 'సెక్స్ విక్టిమ్' ('బలాత్కార బాధితురాలు') అనో, ఇంకేదైనా సరైన మాటతోనో ప్రస్తావించడం న్యాయం.

సుప్రీం కోర్టు ధర్మాసనం మరోసారి ఈ విషయమై ఆలోచించాలి. లేకపోతే, ఈ రహస్య వ్యభిచారాన్ని బహిరంగ వ్యాపారంగా నిర్వహించే వారే అభివృద్ధి చెందుతూ, పేద స్త్రీలను నిరంతరం పీడనలోకి దింపుతూ వుంటారు.

మానవ సమాజంలో, ఆకలి కన్నా, అధిక చాకిరీ కన్నా, నిరుద్యోగం కన్నా, కులమతాల కన్నా, వైద్యం చేయించుకోలేని ప్రాణాంతక వ్యాధులకన్నా, అన్ని రకాల దురంతాల కన్నా, అతి క్రూరమైన, అతి నీచమైన దురంతం వ్యభిచారం! సమాజం ఈ సమస్యని పరిష్కరించడానికి, ఈ పీడితుల్ని రక్షించే పని తక్షణమే జరగాలి.

''వ్యభిచారానికి మూలం ప్రైవేటు ఆస్తిలో వుంది కనుక, ప్రైవేటు ఆస్తి రద్దుతో పాటు అది కూడా రద్దవుతుంది''(–ఎంగెల్స్) అనే విషయాన్ని పట్టించుకోకుండా, ఒక నీచమైన సంబంధానికి ఎంతటి కొత్త కొత్త నాజూకు పేర్లుపెట్టినా, అది ఆ స్త్రీలకి విముక్తి అవదు.

వ్యాసకర్త ప్రసిద్ధ రచయిత్రి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఒక ఉదాహరణ



తాను అధికురాలిననీ, శాంతి కోసం ఇన్నాళ్లూ మౌనంగా ఉన్నాననీ కెనడాకు ఇండియా చాటుతోంది. సామ్రాజ్యవాద దేశాలతో ప్రతి ఆఫ్రికా దేశం ఇండియాలా పోరాడాలి.

– ఒనీకా నువేల్యూ, విజిటింగ్ స్కాలర్

కృత్రిమ తయారీ



అన్ని కోవిడ్ వేరియంట్లు బయో ల్యాబుల్లోనే తయారయ్యాయని జపాన్ నుంచి నిర్ధారణలు వస్తున్నాయి. దీన్ని నేను మూడేళ్ల క్రితమే చెప్పాను. మనం తీవ్రమైన మానసిక, జీవసంబంధ యుద్ధంలో ఉన్నాం.

– లిజ్ చర్చిల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

వాళ్లేం చేశారు?



పాలస్తీనియన్లు, ఇజ్రాయెలీలకు నిజంగా ఘోరమైన రోజు. ఇరు వైపులా భారీ ప్రాణ నష్టం జరుగుతోంది. తెలిసినదే అయినా విషాదకరంగా మళ్లీ చెప్పాలి – పౌరుల మీద జరిగే దాడులు ఎప్పుడూ తప్పే. అది నేరస్థుడు, బాధితుడు – ఇరువురికీ వర్తిస్తుంది.

– ఖాలీద్ ఎల్గిండీ, ఫెలో

అప్పుడు మాత్రమే...



మీరు ఫేమస్ కావాలనుకుంటే, రచయిత కావొద్దు. ధనవంతులు కావాలనుకుంటే, రచయిత కావొద్దు. కానీ నేనేమంటానంటే... మీరు రాయాలనుకుంటే, చెప్పాల్సిన విషయాలు ఉన్నాయనుకుంటే కూర్చుని మీ పని మీరు చేయండి.

– మిన్ జిన్ లీ, రచయిత్రి

అయ్యో అఫ్గాన్!



పశ్చిమ అఫ్గానిస్తాన్‌లో సంభవించిన విధ్వంసకర భూకంపపు బాధితుల గురించి ఆలోచిస్తున్నాను. 2,000 మందికి పైగా మరణించారు. చాలామంది నిరాశ్రయులయ్యారు. జీవనాధారం కోల్పోయారు. మరణాల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ నివాళి.

– ఖాలీద్ హొస్సేనీ, రచయిత

రెండు వైపులా...



కొన్నిసార్లు రెండు పనులూ చేయడం సాధ్యమే. ఇజ్రాయెలీ పౌరుల మీద హమాస్ దాడులు, దాని దారుణ కృత్యాలనూ మనం ఖండించవచ్చు; అదే విధంగా పాలస్తీనియన్ జనాలకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ తరచుగా నేరాలు చేస్తోందనీ, అది క్రూరమైన ఆక్రమణదారు అనీ అనవచ్చు.

– షాదీ హమీద్, కాలమిస్ట్

ఏం లాభం?



విమర్శకులు, ఎన్నికైన ప్రత్యర్థులు, మానవ హక్కుల న్యాయవాదులు, విద్యార్థులు – వీళ్లందరి ఐఫోన్లలోకి చొరబడే కోట్లాది రూపాయల నిఘా వ్యవస్థ పరికరాల పరిశ్రమను (ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్) నెతన్యాహూ పెంచి పోషించారు. కానీ అవి హమాస్ మీద నిఘాకు మాత్రం పనికి రాలేదు.

– ఎడ్వర్డ్ స్నోడెన్, విజిల్‌బ్లోయర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

నిరాశ్రయులను ఆదుకోవాలి!

'నిరాశ్రయులు కూడా ఈ దేశ పౌరులే. వారికి సాధారణ పౌరులకు కల్పించే అన్ని సౌకర్యాలు, రాయితీలు చట్టపరంగా అందాల్సినవి అన్నీ అందించాల'ని సుప్రీంకోర్టు ఓ సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఇందుకు కారణం వారిని ప్రభుత్వాలు అంతగా పట్టించుకోకపోవడమే. భారతదేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం నిరాశ్రయులు 20 లక్షల మంది. కానీ కోవిడ్ తదనంతర పరిస్థితుల్లో వివిధ కారణాల వల్ల కోట్లాది మంది నిరాశ్రయులు అయ్యారు. సరైన నివాస సౌకర్యం లేని వారు 5 కోట్ల మంది ఉండగా మిగిలిన వారు బ్రతుకుతెరువు కోసం నిరాశ్రయులుగా ఏదో పంచన ఉంటున్నారు. వీరిలో వలస కూలీలు, మానసిక వైకల్యం కలవారు, వికలాంగులు, వయోవృద్ధులు, కుటుంబ సభ్యుల నిర్లక్ష్యానికి గురైన వారు ఉన్నారు. వీధిబాలలు, భిక్షాటన చేసుకునేవారు, గ్రామాల నుండి ఉపాధి, ఉద్యోగాల కోసం పట్టణాలకు వచ్చిన వారు కూడా నిరాశ్రయులు గానే జీవిస్తున్నారు.

2013లో సర్వోన్నత న్యాయస్థానం భారత ప్రభుత్వం ద్వారా రాష్ట్రాల్లోని నిరాశ్రయుల కోసం వసతి గృహాలు నిర్మించాలని ఆదేశాలు జారీ చేసింది. పట్టణ నిరాశ్రయుల కేంద్రం 'జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్' కింద నిర్వహించాలని సూచించింది. అదే సంవత్సరం ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి 'కైలాస్ గంభీర్ కమిటీ' పలు రాష్ట్రాలలో పర్యటించి నిరాశ్రయుల స్థితిగతులపై సుప్రీంకోర్టుకు ఒక నివేదికను సమర్పించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని అన్ని ప్రధాన నగరాలలోనూ నిరాశ్రయుల కోసం వసతి కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి వసతి, భోజనం, సంరక్షణ బాధ్యతలు చూడాలని చెప్పింది. నిరాశ్రయుల కోసం ప్రతీ లక్ష మంది జనాభా ఉన్నచోట ఒక నైట్ షెల్టర్ ప్రారంభించాలి. వారి జీవనోపాధి కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ప్రారంభించాలి. మహిళలకు, దివ్యాంగులకు, మానసిక విధి వంచితులకు, యాచకులకు వేరువేరుగా నైట్ షెల్టర్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. పట్టణ జీవనోపాధుల పథకం ద్వారా అప్పులు ఇచ్చి, వ్యాపారాలు ప్రారంభించేలా చేసి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దే ఏర్పాటు చేయాలి.

– డా॥ గుబ్బల రాంబాబు,
ఉభయ గోదావరి జిల్లాల ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు
(నేడు ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం)

వ్యాక్సిన్‌ల సామర్థ్యం తెలిసేదెలా?!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

"ఎప్పటికప్పుడు కొత్త వ్యాక్సిన్‌ల సృష్టి జరుగుతూన్న సందర్భంగా సదరు వ్యాక్సిన్‌లు సరిగ్గా పని చేసేవా, లేదా అని తెల్సుకోవాలంటే – ముందు ఆ వ్యాక్సిన్‌లను రాజకీయ పాలకులపై ప్రయోగించి చూడాలి. ఎందుకంటే, తీసుకున్న వ్యాక్సిన్ వల్ల ఆ పాలకులు బతికి బట్టకడితే ఆ వ్యాక్సిన్ మంచిదని నిర్ధారణ చేసుకోవచ్చు. కానీ ఆ పాలకులు ఆ వ్యాక్సిన్ వల్ల స్వర్గస్థులయితే, దేశం సుఖంగా ఉన్నట్టు భావించాలి."

– ప్రసిద్ధ పోలిష్ తాత్వికులు మోనికా విర్సివా స్కా

ఈ బండ 'జోకు' వినడానికి కటువుగా ఉన్నట్టు అనిపిస్తుంది. కానీ గత పదేళ్లకు పైగా ప్రజా బాహుళ్యం ఆరోగ్య భాగ్యం కన్నా, వ్యాపార లాభాల కోసం పెక్కు ప్రయివేట్ కంపెనీలు వ్యాక్సిన్ల పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ వస్తున్నాయి. అవి సృష్టించే వ్యాక్సిన్‌లు ప్రముఖ శాస్త్రవేత్తల కొలమానాలకు అందకపోయినా, తిరస్కరిస్తున్నా మార్కెట్‌లోకి పాలక వర్గాల అండతో విడుదలవుతూండటం చూస్తున్నాం.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యథేచ్ఛగా సాగిన ఈ కుంభకోణాన్ని భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఎండకట్టి అనుక్షణం, ఈ రోజు దాకా ప్రశ్నిస్తూ వస్తున్న ప్రసిద్ధ భారత కరోనా శాస్త్రవేత్త, పరిశోధకురాలు గగన్‌దీప్ కాంగ్! వైరస్‌ల స్థాయి ఎంత తీవ్రమైనదంటే – భవిష్యత్తులో సోకగల ప్రమాదాలను కూడా ముందుగానే ఊహించి రోగ నిర్ణయానికి అవసరమైన ప్రయివేట్ స్థాయి అవకాశాలను కూడా గణించి, ప్రయివేట్ కంపెనీలను షరతులతో అదుపులో ఉంచుతూ రంగంలోకి దించాలని ఆమె పదేపదే ముందస్తుగానే సూచిస్తూ వచ్చారు. ఈ రోజు కాకపోతే రేపు అయినా పాలకులు అను మతించిన ప్రయివేట్ కంపెనీలను అదుపాజ్ఞల మధ్య వాడుకోవలసి ఉంటుందన్నారు. ప్రపంచ క్లినీషియన్ శాస్త్రవేత్తలలో భారతదేశ ఉద్దండురాలుగా ఆమెను గుర్తిస్తూ లండన్ రాయల్ సొసైటీ 'ఫెలోషిప్' ఇచ్చి గౌరవించింది. రాయవెల్లూరు మెడికల్ కాలేజీలో వైద్య శాస్త్ర పరిశోధనా కేంద్రంలో పిల్లల్లో ప్రబలుతున్న వైరల్ వ్యాధులపై ఎనలేని పరిశోధన చేశారు. అంతేకాదు, పిల్లలకు సంబంధించి పటిష్ఠమైన ఆరోగ్య జాగ్రత్తలను ప్రాథమిక దశ నుంచే తీసుకోవడం వల్ల ఉత్తరోత్తరా వాళ్లను ఆస్పత్రుల చుట్టూ తిప్పే అవసరం ఉండదనీ, ఆ జాగ్రత్త తీసుకోకపోవడం వల్లనే కనీసం వంద దేశాల్లో లక్షలాది చిన్నారులు దారుణ పరిస్థితుల్లో చనిపోవలసి వచ్చిందనీ గగన్‌దీప్ కాంగ్ ఆందోళన

రెండో మాట



వెలిబుచ్చారు. మానవాభ్యున్నతి గణింపులో గత పదిహేనేళ్లలో భారత అభివృద్ధి సూచీ 3 స్థానాలు దిగజారి పోయింది. ఈ గణింపులో చిన్నారుల మరణ శాతం కూడా పరిగణనలోకి తీసుకుంటారనేది మరువరాదు.

ప్రజల జీవన ప్రమాణాలను పెంచవలసిన పాలకులు ఎప్పటికప్పుడు అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ప్రజాస్వామ్య, లౌకిక వాద సిద్ధాంతాలను తుంగలో తొక్కుతున్నారు. మత రాజకీయాలను పెంచి పోషిస్తూ 'హిందూ జాతీయవాదాన్ని' రేకెత్తించి నియంతృత్వ పాలనను స్థాపించడానికి కావలసిన వాతావరణాన్ని సృష్టించుకొంటున్నారు. దీన్ని ఊహించే భారత రాజ్యాంగ నిర్మాత 'భారత రాజ్యాంగంలో ఆచరణకు పొందుపరచిన ప్రజాస్వామ్య సూత్రాలను ఇతరులు ప్రజాస్వామ్య విరుద్ధంగా మార్చేసే ప్రమాదం లేకపోలేదు, నియంతృత్వాన్ని ప్రవేశపెట్టే ప్రమాదమూ లేకపోలేదు' అని హెచ్చరించారు.

దక్షిణాసియాలో ముఖ్యంగా భారతదేశంలో హిందూ మత రాజకీయాల వల్ల అన్య మతస్థులకు స్థానముండదనీ, ప్రజాస్వామ్య లక్ష్యాలతో పొందుపరిచిన భారత సెక్యులర్ వ్యవస్థను అపహాస్యం చేస్తూ గాంధీజీ హంతకుడు గాడ్సే కాలం నాటి పరిస్థితులను 'సెక్యులరిజం' పేరు చాటున తాము కూడా పాలనలో కొనసాగించ దలచినట్లు 'బీజేపీ – ఆరెస్సెస్' నాయకుల ప్రస్తుత ధోరణులు కనిపిస్తున్నాయనీ 'వర్జీనియా యూనివర్సిటీ' భారతీయ ప్రొఫెసర్ నీతీ నాయర్ 'గాయపడ్డ మనస్సులు' (2021) గ్రంథంలో పేర్కొన్నారు. ప్రత్యేక 'హిందూ రాష్ట్రం' సెగ ఒక మతాన్ని కాదు – ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, దళితులు, బౌద్ధులు అందర్నీ చుట్టుముడుతుందనీ, అందుకని, మన భారత ప్రజలు ప్రత్యేక 'హిందూ రాష్ట్ర ప్రతిపత్తి'కీ లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగంలో అక్షర సత్యంగా పొందుపరిచిన 'సమగ్ర భారతదేశ' భావనకూ మధ్య వాస్తవాన్ని విధిగా ప్రేమించాలని ప్రొఫెసర్ నీతీ నాయర్ ఆ గ్రంథంలో పేర్కొన్నారు. ఇటీవల 'మహిళా రిజర్వేషన్ల' సమస్యపై బీజేపీ పాలకులు నడిపిన తంతుపై సుప్రసిద్ధ వ్యంగ్య చిత్రకారుడు మంజుల్ వేసిన పాకెట్ కార్టూన్ (23.9.2023) వీరి రాజకీయాలను పట్టిస్తుంది.

'మీ మహిళా రిజర్వేషన్ల కోటా 2039లో వస్తుంది. అయితే దాన్ని పెద్దగా ఆలస్యమైనట్టు మీరు భావించకండి. 2024లోనే మీ కోటాను మీకు కాగితం మీద కల్పిస్తాం. కానీ ఈలోగా, అంటే 2024లోనే మీ ఓటును మాకు ముందస్తు క్రెడిట్‌గా వేయండి' అని ప్రధాని ముక్తాయించడం అసలు 'చరుపు'! కానీ, ఆ 2039 నాటికి ఎవరుంటారో, ఎవరు ఊడతారో మాత్రం తెలియకపోవడం అసలు 'మర్మం'!

అందుకే అన్నాడేమో వేమన:

"కులము గలుగువారు, గోత్రంబు గలవారు
విద్య చేత విర్రవీగు వారు,
పసిడి గల్గు వాని బానిస కొడుకులు!"

abkprasad2006@yahoo.co.in

రాజకీయం గరం గరం

పూర్తిస్థాయిలో శక్తియుక్తులను కేంద్రీకరించనున్న రాజకీయ పార్టీలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడటంతో రాష్ట్రంలో రాజకీయం మరింత వేడెక్కింది. ప్రధాన రాజకీయ పక్షాలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీతో పాటు బీఎస్పీ ఇప్పటికే ఎన్నికల కోసం సిద్ధమవడం మొదలుపెట్టగా.. ఇకపై పూర్తిస్థాయిలో శక్తియుక్తులను కేంద్రీకరించనున్నాయి. అభ్యర్థుల జాబితాలు, మేనిఫెస్టోల ప్రకటన, ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, స్టార్ క్యాంపెయినర్ల ప్రచారం వంటివి ఊపందుకోనున్నాయి.

అభ్యర్థుల ప్రకటనతో బీఆర్ఎస్ దూకుడు

ఈ ఏడాది మార్చి నుంచే ఆత్మీయ సమ్మేళనాల పేరిట ఎన్నికల సన్నద్ధతను బీఆర్ఎస్ మొదలుపెట్టింది. అధికారిక కార్యక్రమాల పేరిట సీఎం కేసీఆర్, మంత్రులు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. అంతేగాకుండా 50రోజుల క్రితమే అంటే ఆగస్టు 21న అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను కూడా విడుదల చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే పెద్దపీట వేయడంపై తలెత్తిన అసంతృప్తిని వివిధ నామినేటెడ్ పదవులు, ఇతర రూపాల్లో బుజ్జగించారు. పార్టీ టికెట్ దక్కని ఎమ్మెల్యేలు రేఖానాయక్, బాపూరావు రాథోడ్, ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, తన కుమారుడికి టికెట్ ఇవ్వలేదనే కారణంతో ఎంపీ మైనంపల్లి హన్మంతరావు బీఆర్ఎస్‌ను వీడారు. మరోవైపు గడిచిన పక్షం రోజుల్లోనే మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సుమారు 70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేయడం ఎన్నికల ప్రచార సభలను తలపించింది. ఈ నెల 15న పార్టీ మేనిఫెస్టో ప్రకటన, అభ్యర్థులకు బీఫారాల పంపిణీతోపాటు ఎన్నికల ప్రచార సభలకు కేసీఆర్ శ్రీకారం చుడుతున్నారు.

గ్యారంటీలతో కాంగ్రెస్ అడుగులు

రైతు, యువత డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీ స్కీమ్‌ల ప్రకటన వంటి అంశాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. జాతీయ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశాలను హైదరాబాద్‌లో నిర్వహించడం ద్వారా పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపి, ఎన్నికల సన్నాహాలను వేగవంతం చేసింది. తుక్కుగూడ బహిరంగ సభలో పార్టీ అగ్రనేతలతో హామీలు ఇప్పించింది. ప్రస్తుతం అభ్యర్థుల ఎంపిక కసరత్తుపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించింది. ఎన్నికల మేనిఫెస్టోకు తుదిరూపునిచ్చి మరో పది రోజుల్లో విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. అయితే పార్టీ అభ్యర్థుల ఖరారుపై ఇటు హైదరాబాద్, అటు ఢిల్లీలో చర్చలు, సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతున్నా.. ఇంకా కొలిక్కి రాలేదు. 2018 ఎన్నికల్లో చివరి నిమిషం దాకా అభ్యర్థుల ప్రకటనలో జాప్యంతో నష్టం జరిగిందని.. ఈసారి వీలైనంత త్వరగా ప్రకటించాలని పార్టీ నేతలు కోరుతున్నారు. త్వరలో టీపీసీసీ నేతలు బస్సు యాత్ర ప్రారంభించనుండటంతో.. టికెట్ రానివారితో ఇబ్బందులు వస్తాయన్న భావన పార్టీలో వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో దసరా పండుగ తర్వాత అభ్యర్థుల జాబితాను విడుదల చేసే యోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్టు సమాచారం. మంగళవారం హైదరాబాద్‌లో జరిగే కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల సలహా కమిటీ (పీఏసీ) భేటీలో బస్సుయాత్ర, ఇతర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

> **గతం కన్నా వారం ముందు..**
>
> ఈసారి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గతసారితో పోలిస్తే వారం రోజులు ముందే జరగనుంది. గత ఎన్నికల్లో డిసెంబర్ 7న పోలింగ్ నిర్వహించగా.. ఈసారి నవంబర్ 30వ తేదీనే జరగనుంది. మొత్తంగా ఎన్నికల షెడ్యూల్ నాటి నుంచి పోలింగ్ వరకు 51 రోజులు మాత్రమే గడువు మిగిలింది.

అగ్రనేతలను రంగంలోకి దింపుతున్న బీజేపీ

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో బీజేపీ ప్రచారం కోసం అగ్రనేతలను రంగంలోకి దింపుతోంది. ఇప్పటికే అమిత్‌షా సహా పలువురు కేంద్ర మంత్రుల పర్యటనలు ఖరారయ్యాయి. మంగళవారం ఆదిలాబాద్‌లో బహిరంగ సభతోపాటు హైదరాబాద్‌లో వివిధ రంగాలకు చెందిన వృత్తినిపుణులు, మేధావులతో నిర్వహించే సమావేశంలో అమిత్‌షా పాల్గొంటారు. ఈ నెల 27న కూడా అమిత్‌షా మరోమారు తెలంగాణలో ఎన్నికల ప్రచారానికి రానున్నారు. ఇక ఈ నెల 14న హైదరాబాద్ శివార్లలోని శేరిలింగంపల్లితో పాటు మరో నియోజకవర్గం పరిధిలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, 15న ముషీరాబాద్‌తోపాటు మరోచోట కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి పర్యటిస్తారని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి వెల్లడించారు. ఈ నెల 16న హుజూరాబాద్, మహేశ్వరం అసెంబ్లీ స్థానాల్లో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పర్యటిస్తారని.. 19న మధిరలో కేంద్ర మంత్రి నారాయణస్వామి పర్యటిస్తారని తెలిపారు. మరోవైపు ఈ నెలాఖరులోగా ప్రధాని మోదీ, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సభలు నిర్వహించేందుకు బీజేపీ సిద్ధమవుతోంది. ఎన్నికల మేనిఫెస్టోకు ముఖ్య నేతలు తుదిమెరుగులు దిద్దుతున్నారు. ఈ నెల 15 లేదా 16 తేదీల్లో 38 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.



కమ్యూనిస్టులు, ఇతర పార్టీలూ తెరపైకి..

కమ్యూనిస్టు పార్టీలు సీపీఐ, సీపీఎం ఇటీవల కాంగ్రెస్‌తో ఎన్నికల పొత్తుకు సిద్ధమయ్యాయి. కానీ చర్చలు కొలిక్కి రాలేదు. సీపీఐ, సీపీఎం పార్టీలకు చెరో రెండు స్థానాలు ఇచ్చేందుకు జాతీయ స్థాయిలో ఒప్పందం కుదిరినట్టు ప్రచారం జరుగుతోంది. కొత్తగూడెం, మునుగోడులో సీపీఐ.. భద్రాచలం, కొత్తగూడెంలో సీపీఐకి కాంగ్రెస్ సీట్లు ఇస్తుందని అంటున్నారు. కానీ అధికారికంగా ఏదీ తేలలేదు. మరోవైపు ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలోని తెలంగాణ జనసమితి కూడా కాంగ్రెస్‌తో కలసి పోటీ చేయాలని భావిస్తున్నా.. ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. కాంగ్రెస్‌లో వైఎస్ షర్మిల నేతృత్వంలోని వైఎస్సార్ తెలంగాణ పార్టీ విలీనం అంశం కూడా మరుగున పడింది. మరోవైపు బహుజన సమాజ్ పార్టీ తొలి విడత జాబితాను ప్రకటించింది. జనసేన, టీటీడీపీ వంటి పార్టీలు కూడా తమ అభ్యర్థులను బరిలోకి దింపేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

పదేళ్ల కిందట వారెంటు.. ఇప్పుడు అరెస్టు

చీటింగ్ కేసులో నిందితుడిని పట్టుకున్న సీఐడీ

సాక్షి, హైదరాబాద్: నకిలీ ధ్రువపత్రాలు వినియోగించి రవి కుమార్ డిస్టిలరీస్ లిమిటెడ్ కంపెనీని రూ. 29 కోట్లు మోసగించిన కేసులో ఏ-12గా ఉన్న మోహన్‌రాజ్‌ను సీఐడీ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నిందితుడు మోహన్‌రాజ్ పై 2013లో నాన్‌బెయిలబుల్ వారెంటు జారీ అయింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడిని ఇన్‌స్పెక్టర్ రమేశ్ నేతృత్వంలోని సీఐడీ పోలీసుల బృందం తమిళనాడులోని కాంచీపురంలో అరెస్టు చేసినట్లు సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుడిని ఎల్బీనగర్ కోర్టులో 2వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి, జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా...

మున్సిపల్ కార్మికుల చర్చలు సఫలం

• సమ్మె ప్రతిపాదన విరమణ

సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చలు సఫలం కావడంతో మంగళవారం నుంచి తలపెట్టిన సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ప్రకటించింది. మున్సిపల్ కార్మికులకు ఏపీ తరహాలో నెలకు రూ.21 వేల వేతనం చెల్లించాలని, కొత్త కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, జీవో 69 ప్రకారం కేటగిరీలవారీగా వేతనాలు ఇవ్వాలనే పలు డిమాండ్లతో యూనియన్ సెప్టెంబర్ 25న ప్రభుత్వానికి సమ్మె నోటీస్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు సోమవారం చర్చలు జరిపారు. చర్చల్లో యూనియన్ ప్రతిపాదించిన డిమాండ్లపై సీడీఎంఏ అధికారులు సానుకూలంగా స్పందించారని, సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు సంఘం అధ్యక్షప్రధాన కార్యదర్శులు పాలడుగు భాస్కర్, జనగాం రాజమల్లు తెలిపారు.

గురుకుల అభ్యర్థులకు 16 వరకు ఆప్షన్ అవకాశం

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సొసైటీ ఎంపిక, జోనల్ ఎంపిక ఆప్షన్లు ఇచ్చేందుకు ఈనెల 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయవచ్చని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు కన్వీనర్ మల్లయ్య భట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా సొసైటీ ప్రాధాన్యతలు, జోనల్ ప్రాధాన్యతలు తప్పకుండా ఎంట్రీ చేయాలని సూచించారు.

దిల్ రాజుకు పితృవియోగం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి శ్యామ్‌సుందర్‌రెడ్డి (86) సోమవారం కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శ్యామ్‌సుందర్‌రెడ్డి అంత్యక్రియలు మంగళవారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జరగనున్నాయి. శ్యాంసుందర్‌రెడ్డికి దిల్ రాజుతో పాటు మరో ఇద్దరు కుమారులు ఉన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం రోడ్డెక్కిన పేదలు

సీఎం ఇలాకాలో లబ్ధిదారుల ఆందోళన



గజ్వేల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లో డబుల్ బెడ్రూం లబ్ధిదారులు సోమవారం రోడ్డెక్కారు. ముందుగా ఐఓసీలోని 'గడా'(గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయం వద్దకు వెళ్లిన వీరు, ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి లేకపోవడంతో.. ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకొని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని నెలల క్రితం తమను డబుల్ బెడ్రూం ఇళ్లకు ఎంపిక చేశారన్నారు. అయితే ఇప్పటికీ ఇళ్లు కేటాయించలేదని మండిపడ్డారు. అద్దె గదుల్లో జీవనం భారంగా మారుతోందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్‌లు వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఆ మార్గదర్శకాలను కాలేజీలు అమలు చేస్తున్నాయా?

• వివరాలు అందజేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
• విద్యార్థుల ఆత్మహత్యలపై దాఖలైన పిటిషన్ విచారణ

సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టేందుకు ఇంటర్మీడియట్ కళాశాలలకు ప్రభుత్వం, ఇంటర్‌బోర్డు జారీ చేసిన మార్గదర్శకాలు అమలవుతున్నాయా? ఫలితాలు ఎలా ఉన్నాయి? వంటి వివరాలు అందజేయాలని ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం, ఇంటర్ బోర్డు, కాలేజీ యాజమాన్యాలు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ ముజీబ్ కుమార్ కౌంటర్ దాఖలు చేశారు. 'ఆత్మహత్యాయత్నాలను అరికట్టేందుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలపై కళాశాలల యాజమాన్యంతో కమిటీ వేశాం. ఆ కమిటీ సిఫారసుల మేరకు రాష్ట్రంలోని ప్రతి జూనియర్ కళాశాల తప్పనిసరిగా సీనియర్ ఫ్యాకల్టీని స్టూడెంట్స్ కౌన్సెలర్‌గా నియమించాలి. అదనపు తరగతులు రోజుకు 3 గంటలకు మించకూడదు. కాలేజీ మేనేజ్‌మెంట్ అందించిన భవనాల్లో విద్యార్థులు నివాసముంటున్నట్లయితే, వారికి కనీసం 8 గంటల నిద్ర, ఉదయం ఒక గంట అల్పాహారం, సాయంత్రం ఒక గంట వినోదం, భోజనానికి 45 నిమిషాలు అనుమతించాలి. ఏ విద్యార్థి అయినా అనారోగ్యం లేదా మరేదైనా వ్యక్తిగత కారణాలతో కళాశాల నుంచి వైదొలిగినట్లయితే.. 7 రోజుల్లోపు కళాశాల ఫీజును మినహాయించి విద్యార్థుల ఫీజు సొమ్ము వెంటనే తిరిగివ్వాలి. అన్ని కళాశాలల్లో ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రెండుసార్లు వైద్యపరీక్షలు తప్పనిసరి. అన్ని జూనియర్ కాలేజీల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలి'అని కాలేజీలకు మార్గదర్శకాలను విధించినట్లు పేర్కొన్నారు. మార్గదర్శకాలను కచ్చితంగా పాటించేలా పర్యవేక్షించాలని ఇంటర్ బోర్డు అన్ని జిల్లాల విద్యాధికారులను ఆదేశించిందని జీపీ వెల్లడించారు. వాదనలు విన్న ధర్మాసనం విచారణను 3 వారాలు వాయిదా వేసింది.

ఆదర్శప్రాయుడు పీవీ: ఇంద్రకరణ్

• నిర్మల్‌లో మాజీ ప్రధాని విగ్రహావిష్కరణ

నిర్మల్‌టౌన్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అందరికీ ఆదర్శప్రాయుడని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆశయాలను కొనసాగిద్దామని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన పీవీ నరసింహారావు విగ్రహాన్ని సోమవారం మంత్రి ఆవిష్కరించారు. అంతకుముందు నిర్మల్‌కి విచ్చేసిన రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.కేశవరావుకు స్థానిక ఫారెస్ట్ గెస్ట్‌హౌస్‌లో మంత్రి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పీవీ హయాంలో 1991 నుంచి 1996 వరకు పార్లమెంట్ సభ్యుడిగా ఉండటం తన అదృష్టమన్నారు. తెలంగాణ బిడ్డ పీవీ ప్రధానమంత్రి అవుతున్నారనే ఉద్దేశంతో తనతోసహా ఏడుగురు టీడీపీ ఎంపీలం ఆయనకు మద్దతు తెలిపామని చెప్పారు. పీవీ చాణక్యనీతితో దేశాన్ని బ్రహ్మాండంగా పాలించి ప్రజల మన్ననలు పొందారని గుర్తుచేశారు. కేశవరావు మాట్లాడుతూ పీవీతో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు, మేధావులు విద్యార్థులకు, పిల్లలకు చిన్నప్పటి నుంచే ప్రముఖుల జీవిత చరిత్ర తెలియజేయాలని సూచించారు.



విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు

టీసీఆర్‌టీఐ భవనాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి

• ఎన్నికల కోడ్ నేపథ్యంలో వర్చువల్ పద్ధతిలో కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్ ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ(టీసీఆర్‌టీఐ) భవనాన్ని కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అర్జున్‌ముండా సోమవారం వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి ముందు పలు అంశాలు, డిమాండ్లను ప్రస్తావించారు. ములుగులో ఏర్పాటు చేస్తున్న సమ్మక్క-సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో 30 శాతం సీట్లు గిరిజన విద్యార్థులకే కేటాయించాలన్నారు. రాష్ట్రానికి అదనంగా 22 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లను మంజూరు చేయాలన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కార్యదర్శి అనిల్ కుమార్‌కు మంత్రి సత్యవతి వినతి పత్రాలను అందించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన ఈ భవనం ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రులు అర్జున్ ముండా, కిషన్‌రెడ్డి హాజరు కావాల్సి ఉండగా.. సోమవారం మధ్యాహ్నం కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్‌ను విడుదల చేయడం.. వెంటనే కోడ్ అమల్లోకి రావడంతో వర్చువల్‌గా కార్యక్రమాలను పూర్తి చేశారు. అలాగే అబిడ్స్‌లో రాంజీగోండ్ స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియంకు శంకుస్థాపన చేయాల్సి ఉండగా.. ఎన్నికల కోడ్ కారణంగా ఈ కార్యక్రమాన్ని రద్దు చేశారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా

• పాఠశాల సమీపంలోనే వెనుక నుంచి ఢీకొట్టిన లారీ
• 17 మంది విద్యార్థులకు గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం/ జడ్చర్ల టౌన్: ఓ ప్రైవేట్ పాఠశాల బస్సును వేగంగా వెచ్చిన లారీ ఢీకొట్టడంతో బస్సులో ఉన్న 17 మంది విద్యార్థులు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం ఉదయం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల-పాలమూరు ప్రధాన రహదారిపై జాలీహిల్స్ సమీపంలో చోటుచేసుకుంది. జడ్చర్ల నుంచి 43 మంది విద్యార్థులతో వస్తున్న బస్సు పాఠశాలకు సమీపంలో యూటర్న్ తీసుకోగా.. రోడ్డు డౌన్ ఉండటం వల్ల వెనకాల వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో బస్సు అదుపు తప్పి ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఆ సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు బోల్తా పడగానే స్థానికులు వెంటనే గాయపడిన విద్యార్థులను చికిత్స కోసం ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో 9మంది విద్యార్థుల తలల కు గాయాలు కాగా.. మరో 8 మందికి స్వల్ప గాయాల వడంతో వైద్యులు చికిత్స అందించారు. విద్యార్థులందరూ క్షేమంగానే ఉన్నారని, ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం లేదని పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్ తెలిపారు. కాగా, ప్రమాదం జరిగిన వెంటనే కొందరు లారీ డ్రైవర్‌ను చితకబాది పోలీసులకు అప్పగించారు.



బోల్తాపడిన స్కూల్ బస్సు

పరామర్శించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్

బస్సు ప్రమాదంలో గాయపడి ఎస్వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. ఘటనకు సంబంధించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా వేగ నియంత్రణ పాటించడంతో పాటు సైన్ బోర్డులు, లైనింగ్స్ పెంచేలా చూస్తామన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, సీనియర్ నాయకుడు నాగురావు నామాజీ కూడా విద్యార్థులను పరామర్శించారు.

ఇక కాషాయదళం దూకుడు

• ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో పార్టీ పనుల్లో స్పీడు
• రాష్ట్రనేతలతో భేటీకానున్న అమిత్ షా

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో బీజేపీ దూకుడు పెంచుతోంది. ఎన్నికలతో ముడిపడిన వివిధ కార్యక్రమాల నిర్వహణను వేగవంతం చేసింది. వాస్తవానికి ఎన్నికల షెడ్యూల్ వెలువడే ముందుగానే పార్టీ అగ్రనేత, కేంద్రహోంమంత్రి అమిత్‌షా హాజరయ్యే ఆదిలాబాద్‌లో బహిరంగసభ, హైదరాబాద్‌లో వివిధరంగాలకు చెందిన వృత్తినిపుణులు, మేధావులతో భేటీని ఖరారు చేశారు. ఐతే ఎన్నికల తేదీలు వెలువడడంతో అమిత్‌షా టూర్‌ను యథాతథంగా నిర్వహించడంతో పాటు హైదరాబాద్‌లో రాష్ట్రపార్టీ ముఖ్యనేతలతో ఆయన ప్రత్యేకంగా సమావేశం కానున్నట్టు సమాచారం. ఎన్నికల తయారీ, అనుసరించాల్సిన వ్యూహాలపై, అమలుచేయాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. కాగా ఆదిలాబాద్ సభలో రైతులకు బీజేపీ కల్పించే భరోసాకు సంబంధించిన అమిత్ షా కీలక ప్రకటన చేసే అవకాశాలున్నాయని పార్టీవర్గాల సమాచారం.

ఇప్పటికే కమిటీల కసరత్తు షురూ...

షెడ్యూల్‌తో పాటు అసెంబ్లీ ఎన్నికలెప్పుడు వచ్చినా సంసిద్ధంగా ఉండాలనే ఉద్దేశ్యంతో.. ఇప్పటికే ఎన్నికల ప్రచార కమిటీ, మేనిఫెస్టో కమిటీ, సభల నిర్వహణ కమిటీ, వివిధ సామాజికవర్గాల ఆశలు, కోరికలు తెలుసుకునేందుకు సోషల్ ఔట్‌రీచ్ కమిటీలను నియమించారు. రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలు, జాతీయ కార్యవర్గసభ్యుల ఆధ్వర్యంలో వేసిన ఈ కమిటీలు తమ కసరత్తును, కార్యాచరణను వేగవంతం చేశాయి.

6003 దరఖాస్తుల్లో పరిశీలనకు 2500

ఇక మొత్తం 119 అసెంబ్లీ స్థానాలకు సంబంధించి పార్టీలోని ఆశావాహుల నుంచి 6,003 దరఖాస్తులు అందిన విషయం తెలిసిందే. వీటిలో పోటీకి అంతగా సీరియస్‌గా లేనివారు, నియోజకవర్గ స్థాయి లేని గ్రామస్థాయి నాయకుల నుంచి వచ్చిన దరఖాస్తులను వడబోయగా రెండున్నర వేల దరఖాస్తులనే ప్రాథమిక పరిశీలనకు స్వీకరించినట్టు సమాచారం.

15 తర్వాత తొలిజాబితా

పార్టీ ముఖ్యనేతలకు సంబంధించి 40 సీట్ల వరకు ముందుగానే పక్కన పెట్టాలని నిర్ణయించారు. జాతీయ ఎన్నికల కమిటీ నుంచి పిలుపురాగానే ఢిల్లీ వెళ్లి ఈ జాబితాను అందజేసి, ఆమోదముద్ర వేయించుకునే అవకాశాలున్నాయి. ఈనెల 14న అమావాస్య దాటాక 15 లేదా 16వ తేదీల్లో ఈ మేరకు తొలిజాబితా ప్రకటించనున్నట్టు పార్టీనేతలు వెల్లడించారు. ఇక మిగిలిన సీట్లకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి నేతృత్వంలోని స్క్రీనింగ్ కమిటీకి అప్పగించినట్టు తెలిసింది.

ఎన్నికల కోడ్‌లోకి అమిత్ షా సభ

నేడు ఆదిలాబాద్‌కు రానున్న కేంద్ర హోంమంత్రి



ఆదిలాబాద్‌లో కేంద్ర హోంమంత్రి జనగర్జన సభ కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

సాక్షి, ఆదిలాబాద్: బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం ఆదిలాబాద్ రానున్నారు. జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొననున్నారు. జనగర్జనగా దీనికి నామకరణం చేశారు. ఇటీవలే అమిత్ షా ఆదిలాబాద్ పర్యటన ఖరారవగా ఎన్నికల షెడ్యూల్ జారీ కావడంతో ఈ సభ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) పరిధిలోకి వెళ్లనుంది. బీజేపీ అభ్యర్థి ఎవరనేది ఇంకా ఖరారు కాకపోవడంతో ఈ సభ ఖర్చు పార్టీ పరిధిలోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ టూర్ నేపథ్యంలో బీజేపీ భారీ ఏర్పాట్లు చేపట్టింది. ఆదిలాబాద్ పట్టణాన్ని కాషాయ జెండాలతో నింపేసింది. ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర రాష్ట్ర నేతల ఫొటోలతో కూడిన భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. ఎన్నికల షెడ్యూల్ జారీ అయ్యాక రాష్ట్రంలో బీజేపీ నిర్వహించనున్న తొలి బహిరంగ సభ కావడంతో ఇది ప్రాధాన్యత సంతరించుకుంది.


గాజా సిటీపై ఇజ్రాయెల్ బాంబుల దాడి దృశ్యం


షాతీ శరణార్థి శిబిరం వద్ద ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన యాసిన్ మసీదు


గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయెల్ వైపు దూసుకెళ్తున్న రాకెట్లు


ఇజ్రాయెల్ దాడిలో నేలమట్టమైన పాలస్తీనియన్ల రఫా శరణార్థి శిబిరం

గాజాపై నిప్పుల వర్షం

వైమానిక దాడులు ఉధృతం చేసిన ఇజ్రాయెల్

జెరూసలేం: ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో నెత్తుటేర్లు పారుతున్నాయి. ఇరువర్గాల మధ్య ఘర్షణ మూడు రోజులుగా కొనసాగుతూనే ఉంది. హమాస్ మిలిటెంట్ల పీచమణచడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం సోమవారం గాజాపై వైమానిక దాడులు ఉధృతం చేసింది. మిలిటెంట్ల చొరబాట్లను అడ్డుకోవడానికి సరిహద్దుల్లో యుద్ధ ట్యాంకులు, డ్రోన్లను మోహరించింది. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో వందలాది భవనాలు నేలమట్టమయ్యాయి. దక్షిణ గాజాలోని రఫాలో సోమవారం ఉదయం ఇజ్రాయెల్ దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా 19 మంది మృతిచెందారు. మరోవైపు దక్షిణ ఇజ్రాయెల్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్ జవాన్లపై కాల్పులకు దిగుతున్నారు. అడపాదడపా రాకెట్లు కూడా ప్రయోగిస్తున్నారు. ఇజ్రాయెల్ సైన్యం తిప్పికొడుతోంది. గాజాలో వెయ్యికి పైగా టార్గెట్లపై దాడి చేశామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. గాజాలో ఎక్కడ చూసినా శిథిలాలే కనిపిస్తున్నాయి. తాజా యుద్ధంలో మృతుల సంఖ్య 1,200 దాటింది. హమాస్ మిలిటెంట్ల దాడిలో ఇజ్రాయెల్‌లో 700 మందికిపైగా బలయ్యారు. ఇజ్రాయెల్ సైన్యం ఎదురుదాడిలో గాజాలో 500 మందికి పైగా మరణించారు. ఇరువైపులా వేలాది మంది క్షతగాత్రులుగా మారారు. ఇజ్రాయెల్‌లో 130 మందికిపైగా పౌరులను బందీలుగా పట్టుకున్నామని, వారంతా తమ అధీనంలో ఉన్నారని హమాస్ ప్రకటించింది. ఉత్తర ఇజ్రాయెల్‌లో లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్, ఇజ్రాయెల్ సైన్యం మధ్య కాల్పులు జరుగుతున్నాయి.

గాజా దిగ్బంధానికి ఆదేశాలు

గాజాలో హమాస్ ముష్కరులను, వారి ప్రభుత్వాన్ని తుదముట్టిస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ తేల్చిచెప్పారు. హమాస్‌ను ఇప్పటికే చాలావరకు బలహీనపర్చామని ఇజ్రాయెల్ అధికార వర్గాలు వెల్లడించాయి. గాజాను పూర్తిగా దిగ్బంధించాలని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గల్లాంట్ తమ



సైన్యాన్ని ఆదేశించారు. గాజాకు విద్యుత్, ఆహారం, ఇంధనం సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇజ్రాయెల్–గాజా సరిహద్దుల్లో 24 కాలనీలు ఉండగా, 15 కాలనీలను ఖాళీ చేయించారు. మిగిలినవాటిని 24 గంటల్లోగా ఖాళీ చేయిస్తామని ఇజ్రాయెల్ అధికారులు చెప్పారు. గాజాపై ఇప్పటిదాకా వైమానిక దాడులకే పరిమితం అయిన ఇజ్రాయెల్


దక్షిణ ఇజ్రాయెల్‌లో దగ్ధమవుతున్న కార్లు

ఇక భూ యుద్ధంపై దృష్టి పెట్టింది. నేరుగా భూమిపైనుంచే క్షిపణులు ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తోంది. యుద్ధం వల్ల గాజాలో 1,23,000 మంది నిరాశ్రయులయ్యారని, ఇళ్లు విడిచిపెట్టి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. గాజా బయట తమ పోరాటం కొనసాగుతోందని, సోమవారం ఉదయం మరికొంతమంది ఇజ్రాయెల్ పౌరులను బంధించామని హమాస్ ప్రతినిధి అబ్దెల్–లతీఫ్ అల్–ఖనౌవా చెప్పారు. ఇజ్రాయెల్ చెరలో ఉన్న పాలస్తీనా ఖైదీలందరినీ విడిపించి, స్వేచ్ఛ ప్రసాదించడమే తక్షణ లక్ష్యమని ఉద్ఘాటించారు. హమాస్ చేతిలో ఉన్న బందీలను విడిపించడానికి సహకరించాలంటూ ఇజ్రాయెల్ కోరిందని ఈజిప్టు అధికారులు చెప్పారు.

ఇజ్రాయెల్‌కు అమెరికా సాయం

మిత్రదేశం ఇజ్రాయెల్ కోసం అమెరికా రంగంలోకి దిగింది. సైనిక సాయం అందిస్తోంది. తూర్పు మధ్యదరా సముద్రానికి యుద్ధ నౌకలను పంపించింది. ఇంకా అదనపు సైనిక సాయం అందిస్తామని హామీ ఇచ్చింది.

260 మృతదేహాలు లభ్యం

దక్షిణ ఇజ్రాయెల్‌లో శనివారం సూపర్‌నోవా ఫెస్టివల్‌లో ఆనందంగా గడుపుతున్న జనంపై హమాస్ ముష్కరులు హఠాత్తుగా దాడి చేశారు. సైనిక దుస్తుల్లో వచ్చి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. 260కిపైగా మృతదేహాలను ఇజ్రాయెల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతం గాజాకు సమీపంలోనే ఉంది.

నా భార్యాబిడ్డలను అపహరించారు

యువకుడు యెనీ అషెర్ గాజా సరిహద్దుకు సమీపంలో ఇజ్రాయెల్‌లో తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. హమాస్ మిలిటెంట్లు అతడి భార్య డోరస్, కుమార్తెలు రజ్(5), అవివ్(3)ను శనివారం అపహరించారు. ఎక్కడ దాచారో తెలియడం లేదు. వారి కోసం అషెర్ గుండెలవిసేలా రోదిస్తున్నాడు. వారిని కాపాడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు.

ఫోన్‌లో మాట్లాడుతుండగానే చంపేశారు

ఇలాన్ ట్రోయెన్ అమెరికాలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుమార్తె డెబోరా మతియాస్, అల్లుడు స్కోమ్లీ మతియాస్, మనవడు ఇజ్రాయెల్‌లో ఉంటున్నారు. శనివారం ఆమె అమెరికాలో ఉన్న తన తండ్రితో ఫోన్‌లో మాట్లాడుతుండగా హమాస్ తీవ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో డెబోరా, స్కోమ్లీ దంపతులు బలయ్యారు. వారి 16 ఏళ్ల కుమారుడు గాయాలతో బయటపడ్డాడు.

హమాస్ దాడిలో కేరళ మహిళకు గాయాలు

ఇజ్రాయెల్ ఆయాగా పనిచేస్తున్న కేరళ మహిళ షీజా ఆనంద్ హమాస్ మిలిటెంట్ల దాడిలో గాయపడ్డారు. కేరళ రాష్ట్రం కన్నూర్ జిల్లా పయ్యావూర్‌కు చెందిన షీజా ఆనంద్ దక్షిణ ఇజ్రాయెల్‌లోని సముద్ర తీర నగరం అష్కెలాన్‌లో ఆయాలో పని చేస్తున్నారు. శనివారం హమాస్ మిలిటెంట్ల అష్కెలాన్‌పై రాకెట్లు ప్రయోగించంతో ఆమె గాయాలపాలయ్యారు. భారత్‌లో ఉన్న భర్త ఆనంద్‌తో వీడియో కాల్ ద్వారా మాట్లాడుతుండగా ఈ ఘటన జరిగింది. ఇజ్రాయెల్‌లోని భారత



రాయబార కార్యాలయ అధికారులు షీజా ఆనంద్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. ఆదివారం మధ్యాహ్నం షీజా భారత్‌లోని తన తల్లితో మాట్లాడారు. 'అమ్మా.. ఐయామ్ ఓకే' అని చెప్పారు.

పట్టు సాధిస్తున్న ఇజ్రాయెల్

జెరూసలేం: హమాస్ మెరుపుదాడితో బిత్తరపోయిన ఇజ్రాయెల్ గాజాపై విరుచుకుపడుతోంది. ఇప్పటిదాకా 800 పైచిలుకు ప్రాంతాలను నేలమట్టం చేసినట్టు ప్రకటించింది. ఈ క్రమంలో పలు ఇజ్రాయెలీ ప్రాంతాలను మిలిటెంట్ల చెర నుంచి సోమవారం విడిపించింది. అయితే దక్షిణాదిన పలుచోట్ల ఇంకా మిలిటెంట్లతో ఇజ్రాయెల్ సైన్యం హోరాహోరీ పోరాడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో పదుల కొద్దీ అదనపు దళాలను ఇజ్రాయెల్ రంగంలోకి దించుతోంది. ఇజ్రాయెల్‌కు అదనపు మద్దతు అందించాలన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆదేశాల నేపథ్యంలో ఆ దేశ విమాన వాహక యుద్ధ నౌకలు తదితరాలు తూర్పు మధ్యదరా సముద్రం వైపు తరలాయి. సమీప ప్రాంతాల యుద్ధ విమాన దళాలను కూడా అమెరికా హుటాహుటిన సమీకరిస్తోంది.

దాడి వెనక ఇరాన్!

ఇజ్రాయెల్‌పై దాడి వెనక ఇరాన్ హస్తం, ప్లానింగ్ ఉన్నట్టు హమాస్, హెజ్బొల్లా నేతలే స్వయంగా వెల్లడించారు. గాజా స్ట్రిప్‌లో 30 మందికి పైగా ఇజ్రాయెలీలను తాము బందీలుగా పట్టుకున్నట్టు ఇస్లామిక్ జిహాద్ సంస్థ చీఫ్ జైద్ అల్ నఖాలా చెప్పాడు.

ఖతర్ మధ్యవర్తిత్వం

దోహా: ఇజ్రాయెల్, హమాస్ మధ్య బందీల మార్పిడికి, వీలైతే పోరుకు తెర దించేందుకు ఖతర్ రంగంలోకి దిగింది. హమాస్ చెరపట్టిన మహిళలు, పిల్లలను విడిపించేందుకు ముందుకొచ్చింది. బదులుగా ఇజ్రాయెలీ జైళ్లలో బందీలుగా ఉన్న 36 మంది మహిళలు, పిల్లలను విడుదల చేయాలని ప్రతిపాదించింది. దీనిపై ఇప్పటికే హమాస్ తో మాట్లాడుతున్నట్టు ఖతర్ విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. ఈ విషయంలో అమెరికా సాయం కూడా తీసుకుంటున్నట్టు చెప్పింది. ''చర్చల్లో పురోగతి ఉంది. పోరుకు తెర పడి శాంతి నెలకొనాలని, బందీలు విడుదల కావాలని మా ప్రయత్నం'' అని వివరించింది. ఇజ్రాయెల్ మాత్రం ఈ విషయంలో ఎలాంటి సంప్రదింపులూ జరగడం లేదని పేర్కొంది.

ఇజ్రాయెల్‌లో 9 మంది అమెరికన్లు మృతి

వాషింగ్టన్: ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిలో కనీసం 9 మంది అమెరికా పౌరులు మరణించారు. మరెందరో ఆచూకీ తెలియకుండా పోయారని అమెరికా విదేశాంగ శాఖ సోమవారం ప్రకటించింది. మరోవైపు ఇజ్రాయెల్‌లో జాడ తెలియకుండా పోయిన 8 మంది ఫ్రాన్స్ దేశస్తులు కూడా హమాస్ మిలిటెంట్లకు చిక్కడమో, వారి చేతిలో మరణించడమో జరిగి ఉంటుందని చెబుతున్నారు. 10 మంది బ్రిటిష్ పౌరులు కూడా హమాస్ దాడుల్లో మరణించడమో, జాడ తెలియకుండా పోవడమో జరిగిందని చెబుతున్నారు.

జర్మనీ మహిళను నగ్నంగా ఊరేగించిన హమాస్

జెరూసలేం: ఇజ్రాయెల్‌పై మెరుపు దాడి సందర్భంగా బందీలుగా పట్టుకున్న వారిపై హమాస్ మిలిటెంట్ల అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. శని లౌక్ అనే జర్మనీ దేశస్తురాలిని శనివారం గాజా వీధుల్లో నగ్నంగా ఊరేగించి పైశాచికానందం పొందడం తెలిసిందే. ''శని క్రెడిట్ కార్డును గాజాలో పూర్తిగా వాడేశారు. తను కనీసం ప్రాణాలతోనైనా ఉందని ఆశపడుతున్నాం''అంటూ ఆమె తల్లి బావురుమంది. శనివారం ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతమైన కిబుట్జ్ సమీపంలో ఫెస్టివల్ ఆఫ్ పీస్ జరుగుతుండగా హమాస్ మిలిటెంట్లు మెరుపు దాడిచేసి పలువురిని బందీలుగా గాజాకు తరలించారు.

అఫ్గాన్ భూకంపం..2,400కు చేరిన మరణాలు

ఇస్లామాబాద్: అఫ్గానిస్తాన్‌లోని హెరాట్ ప్రావిన్స్‌లో శనివారం సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య పెరుగుతోంది. మట్టిదిబ్బల్లా మారిన ఇళ్ల శిథిలాల్లో చిక్కుకున్న వారి కోసం స్థానికులు, సహాయక సిబ్బంది తీవ్రంగా గాలిస్తున్నారు. సోమవారం మరికొన్ని మృతదేహాలు బయటపడటంతో మృతుల సంఖ్య 2,445కు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, క్షతగాత్రుల సంఖ్య గతంలో ప్రకటించిన 9,240 కాదన్నారు. 2వేల మంది మాత్రమే గాయపడ్డారన్నారు. గాసహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని చెప్పారు. హెరాట్‌లోని ఏకైక ప్రధాన ఆస్పత్రి వెలుపల బాధితుల కోసం బెడ్లు ఏర్పాటు చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. ఇక్కడ ప్రస్తుతం 500 మంది చికిత్స పొందుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) తెలిపింది. సోమవారం మరోసారి భూమి కంపించడంతో స్థానికులు భయాందోళనలకు గురై రోడ్లపైకి చేరుకున్నారు. అఫ్గాన్ ఉప ప్రధాని, ఆర్థిక మంత్రి అబ్దుల్ బరాదర్ సోమవారం హెరాట్ ప్రావిన్స్‌లో పర్యటించారు. ఇజ్రాయెల్ పరిణామాలపైనే ప్రపంచదేశాల దృష్టి కేంద్రీకృతం కావడంతో అఫ్గాన్‌లో భూకంపబాధితులకు సాయం నెమ్మదిగా అందుతోంది. దశాబ్దాలపాటు అంతర్యుద్ధంతో చితికిపోయిన అఫ్గానిస్తాన్ ప్రజలకు తాజాగా సంభవించిన భూకంపం మరింత కుంగదీసింది. అంతర్జాతీయ సమాజం స్పందించాలంటూ ప్రభుత్వేతర, స్వచ్ఛంద సంస్థలు పిలుపునిచ్చినప్పటికీ చైనా, పాకిస్తాన్ వంటి కొన్ని పొరుగుదేశాలు మాత్రమే అఫ్గాన్‌లకు సాయం అందించేందుకు ముందుకు వచ్చాయి. అఫ్గాన్ రెడ్ క్రీసెంట్ సొసైటీకి చెందిన 20 బృందాలు భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సేవలందిస్తున్నాయి. నీడ కోల్పోయిన వారికోసం తాత్కాలిక క్యాంపులను ఏర్పాటు చేసింది.


నోబెల్ పొందిన సంతోషంలో ఫోన్‌లో మాట్లాడుతున్న క్లాడియా

క్లాడియాకు ఆర్థిక నోబెల్

- అమెరికా ఆర్థికవేత్తను వరించిన పురస్కారం
- శ్రామిక శక్తిలో లైంగిక అంతరాలపై లోతుగా పరిశోధనలు

స్టాక్‌హోం: అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారం ఈ ఏడాది అమెరికాకు చెందిన ప్రఖ్యాత ఆర్థికవేత్త క్లాడియా గోల్డిన్‌ను వరించింది. నోబెల్ అవార్డులిచ్చే రాయల్ స్వీడిష్ అకాడెమీ సోమవారం ఈ మేరకు ప్రకటించింది. శ్రామిక రంగంలో లైంగిక అంతరాలపై అవగాహనను మరింతగా పెంచే దిశగా చేసిన సమగ్ర అధ్యయనాలకు గాను ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు కమిటీ పేర్కొంది. ''గ్లాడిన్ పరిశోధన నేరుగా పరిష్కారాలు చూపించేది కాదు. ఎప్పట్నుంచో ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు విధానకర్తలకు మెరుగైన మార్గాలు సూచిస్తుంది. అంతరాలకు కారణాలను పట్టిచూపుతుంది. అవి కాలాను గుణంగా ఎలా మారుతూ వస్తున్నాయో వివరిస్తుంది''అని వివరించింది. ''గడిచిన వందేళ్లలో సంపన్న దేశాల్లో మహిళల్లో సంపాదనపరులు మూడింతలైనా లైంగిక అంతరాలు అలాగే ఉన్నాయి. వీటి మూలాలు తదితరాలపై గోల్డిన్ పరిశోధనలు లోతైన వివరాలు అందించాయి''అని తెలిపింది.

లోతైన పరిశోధనలు: 77 ఏళ్ల గ్లాడిన్ గత 200 ఏళ్లలో కార్మిక రంగంలో మహిళల భాగస్వామ్యం తదితరాలపై లోతుగా పరిశోధనలు చేశారు. ఆర్థిక వృద్ధి ఎంతగా పెరుగుతున్నా మహిళల వేతనాలు పురుషుల స్థాయిలో ఎప్పుడూ పెరగలేదు. కొన్నేళ్లుగా చదువులో పురుషుల కంటే ముందుంటున్నా మహిళల విషయంలో ఈ వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉందంటారామె. ''నేనెప్పుడూ ఆశావాదినే. కానీ గణాంకాలు చూస్తుంటే నిర్వేదమే మిగులుతోంది. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం విషయంలో 1990ల్లో ప్రపంచంలోనే తొలి స్థానంలో ఉన్న అమెరికా ఇప్పుడు ఎక్కడికో దిగజారిపోయింది''అని చెప్పుకొచ్చారు. ''ఇళ్లలో జరిగేదే బయట శ్రామిక రంగంలోనూ జరుగుతుంది. మహిళలకు పనెక్కువ, ప్రతిఫలం తక్కువ''అని వివరించారు. ''అందుకే జీవిత భాగస్వాముల మధ్య సమానత్వ భావనను పెంచితే అంతిమంగా లైంగిక సమానత్వమూ పెరుగుతుంది''అంటూ ముక్తాయించారు. క్లాడియా 1946లో న్యూయార్క్‌లో పుట్టారు. షికాగో వర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. ప్రస్తుతం హార్వర్డ్ వర్సిటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

కొసమెరుపు: శ్రామిక రంగంలో లైంగిక అంతరాలపై అధ్యయనం చేసిన గ్లాడిన్, అర్థశాస్త్రంలో ఇప్పటిదాకా నోబెల్ అందుకున్న 93 మందిలో మూడో మహిళ కావడం విశేషం!

ఫైనల్‌కు ముందు..అగ్ని పరీక్ష

- మినీ సంగ్రామాన్ని తలపించనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలు
- నాలుగు రాష్ట్రాల్లో కాషాయ దళానికి, కాంగ్రెస్‌కు హోరాహోరీ
- రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లలో కాంగ్రెస్‌ను దించేందుకు బీజేపీ ప్రయత్నాలు
- మధ్యప్రదేశ్‌లో చౌహాన్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు కాంగ్రెస్ ఎత్తులు
- తెలంగాణలోనూ అధికారంలోకి వచ్చేందుకు రెండు పార్టీల తహతహ

సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల మహా సంగ్రామానికి ముందు సెమీస్‌గా భావిస్తున్న ఐదు రాష్ట్రాల ఎన్నికలు అధికార కాషాయ దళానికి, విపక్ష కాంగ్రెస్ పార్టీకి అగ్నిపరీక్షగా మారాయి. ముచ్చటగా మూడోసారి కేంద్రంలో తన అధికార పీఠాన్ని సుస్థిర పరుచుకోవాలంటే ప్రస్తుత ఎన్నికల్లో మెజార్టీ రాష్ట్రాలను దక్కించుకునేలా బీజేపీ ఇప్పటికే కదనరంగంలోకి దిగింది. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలను కాపాడుకుంటూనే మరో రెండు రాష్ట్రాల్లో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ కాలుదువ్వుతోంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్తాన్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ అధికార మార్పిడి జరుగుతుందని బీజేపీ నమ్మకంగా ఉంటే.. బీజేపీ పాలనలో ఉన్న మధ్యప్రదేశ్‌ను కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ నమ్మకంగా ఉంది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో రెండు పార్టీలు పట్టు నిలుపుకునేందుకు, మిజోరంలో నిర్ణయాత్మక శక్తిగా ఎదిగేందుకు పోరాడుతుండటంతో ఈ ఎన్నికలకు రసవత్తరంగా ఉండనున్నాయి.

పెద్ద రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో...

త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో పెద్దదైన మధ్యప్రదేశ్‌లో 230 స్థానాలకు గానూ 2018 ఎన్నికల్లో 114 స్థానాలను గెలుచుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత, ముఖ్యమంత్రి పదవి ఆశించి భంగపడ్డ జ్యోతిరాదిత్య సింధియా 2020లో సొంత పార్టీలోని 21 మంది ఎమ్మెల్యేలతో కాషాయ కండువా కప్పుకోవడంతో అక్కడ బీజేపీ అధికారంలోకి వచ్చింది. దీనిపై ప్రతీకార జ్వాలతో రగిలిపోతున్న కాంగ్రెస్ అక్కడ తిరిగి అధికారాన్ని కైవసం చేసుకునేందుకు చెమటోడ్చుతోంది. వరుసగా తొమ్మిదిసార్లు ఎంపీగా గెలిచిన కమల్‌నాథ్ ప్రస్తుతం పార్టీని ముందుండి నడిపిస్తున్నారు. కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులను బలంగా వాడుతున్నారు. బీజేపీ కూడా కేంద్ర మంత్రులు, లోక్‌సభ ఎంపీలను అసెంబ్లీ బరిలో నిలిపింది. కమల్ నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న డిసెంబర్ 2018 నుంచి మార్చి 2020 మినహా దాదాపు రెండు దశాబ్దాలుగా మధ్యప్రదేశ్‌లో బీజేపీ అధికారంలో ఉంది.

రాజస్తాన్ కీలకం

రాజస్తాన్‌లో ఏ ప్రభుత్వమూ వరుసగా రెండోసారి ఎన్నికకాని చరిత్ర ఉంది. ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు ప్రత్యర్థి పార్టీకి అవకాశం కల్పిస్తున్న నేపథ్యంలో ఈసారి ఎన్నికలను కాంగ్రెస్, బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. రాష్ట్రంలోని ఇతర వెనుకబడిన తరగతుల ఓట్లే కీలకంగా ఉండటంతో వాటిపైనే ప్రధాన పార్టీలు దృష్టి పెట్టాయి. అదే సమయంలో, కాంగ్రెస్‌కు చెందిన సీఎం గెహ్లోట్, మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్‌ల మధ్య విరోధం నివురుగప్పిన నిప్పులా ఉంది. రాజస్తాన్‌లో కాషాయ జెండా రెపరెపలాడాలని చూస్తున్న బీజేపీ అక్కడ 'ఆప్నో రాజస్తాన్'పేరిట ప్రభుత్వ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఇప్పటికే ప్రధాని మోదీ నాలుగుసార్లు, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరుమార్లు పర్యటించారు.

ఛత్తీస్‌గఢ్ ఎవరిదో?

పదిహేనేళ్ల పాలన తర్వాత 2018లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎలాగైనా ఛత్తీస్‌గఢ్‌ను తిరిగి నిలబెట్టుకునే కృతనిశ్చయంతో ఉండగా ఇక్కడ అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. 90 స్థానాలున్న రాష్ట్రంలో 68 సీట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌కు ఉన్న ఇమేజ్‌కు తోడు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు తమను తిరిగి అధికారంలోకి తేవొచ్చని కాంగ్రెస్ వర్గాలు విశ్వసిస్తోంది. రాష్ట్రంలోని కీలక రంగాల్లో జరిగిన అవినీతి తమకు లాభిస్తుందని బీజేపీ భావిస్తోంది. ఇప్పటికే ప్రధాని మూడుసార్లు ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించారు. ఇటీవలి ఇండియా టుడే–సీవోటర్ ఒపీనియన్ పోల్‌లో 90 సీట్లలో 46 శాతం ఓట్లతో 51 సీట్లు కాంగ్రెస్ గెలుచుకుంటుందన్న అంచనాలు బీజేపీకి మింగుడుపడటం లేదు.

తెలంగాణలో త్రిముఖం..

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్, తెలంగాణ తెచ్చిన బీఆర్ఎస్‌ల మధ్య ప్రధాని పోటీ ఉందనుకుంటున్న 119 సీట్లున్న తెలంగాణలో మారిన రాజకీయ పరిస్థితులతో బీజేపీ సైతం పోటీలోకి వచ్చింది. త్రిముఖ పోటీ ఉండే అవకాశాలతో తాము అధికారంలోకి వస్తామని బీజేపీ నమ్ముతుంటే, అతిపెద్ద పార్టీగా తామే అవతరిస్తామన్న గట్టి నమ్మకంతో కాంగ్రెస్ ఉంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు, పార్టీకి ఉన్న ముగ్గురు ఎంపీలు బండి సంజయ్, సోయం బాపూరావు, ధర్మపురి అరవింద్‌లతో పాటు పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణను ఎన్నికల బరిలో నిలపనుంది. గడిచిన 15 రోజుల్లోనే రెండుసార్లు తెలంగాణలో మోదీ పర్యటించారు. కర్ణాటక ఎన్నికల్లో లబ్ధి పొందిన మాదిరే ఇక్కడా 6 గ్యారెంటీ కార్డు హామీలతో కాంగ్రెస్ ముందుకు సాగుతోంది.

మిజోరంలో స్థానిక పార్టీలదే హవా

క్రైస్తవులు మెజారిటీగా ఉన్న మిజోరంలో స్థానిక పార్టీలైన మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్), జోరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) పార్టీలదే హవా నడుస్తోంది. 40 స్థానాలున్న మిజోరంలో ప్రస్తుతం అక్కడ ముఖ్యమంత్రి జోరమ్‌తంగా నేతృత్వంలోని ఎంఎన్ఎఫ్ ప్రభుత్వం 28 సీట్లతో అధికారంలో ఉండగా, జెడ్‌పీఎం 9 సీట్లు, కాంగ్రెస్ 5, బీజేపీ ఒక్క సీటు సాధించుకున్నాయి. రెండు పర్యాయాలకు ఒకమారు అధికారం మారే మిజోరంలో ఈ ఏడాది ఎంఎన్ఎఫ్‌దే విజయమని సర్వే సంస్థలు వెల్లడిస్తున్నాయి. మయన్మార్ శరణార్థులే ప్రధాన అంశంగా ప్రస్తుత ఎన్నికలు జరుగనున్నాయి.

గత ఎన్నికల్లో పార్టీలు సాధించిన సీట్లు.. ఓట్ల శాతం

మిజోరం (40 సీట్లు)

పార్టీ	2018 సీట్లు	2018 ఓట్ల శాతం	2013 సీట్లు	2013 ఓట్ల శాతం
మిజో నేషనల్ ఫ్రంట్	26	37.7	5	28.4
కాంగ్రెస్	5	29.98	34	44.3
జోరమ్ పీపుల్స్ మూవ్‌మెంట్	8	22.9	0	17.3
బీజేపీ	1	8.09	0	0.37
ఇతరులు	0	1.3	1	9

తెలంగాణ (119)

పార్టీ	2018 సీట్లు	2018 ఓట్ల శాతం	2014 సీట్లు	2014 ఓట్ల శాతం
టీఆర్ఎస్	88	46.87	63	-
కాంగ్రెస్	19	28.43	21	-
టీడీపీ	2	3.51	15	-
ఎంఐఎం	7	2.71	7	
బీజేపీ	1	6.98	5	-
ఇతరులు	1	6	5	-

మధ్యప్రదేశ్(230 సీట్లు)

పార్టీ	2018 సీట్లు	2018 ఓట్ల శాతం	2013 సీట్లు	2013 ఓట్ల శాతం
కాంగ్రెస్	114	40.89	58	36.38
బీజేపీ	109	41.02	165	44.88
బీఎస్‌పీ	2	5.01	4	6.29
ఇతరులు	5	9	3	5.4

రాజస్తాన్ (200)

పార్టీ	2018 సీట్లు	2018 ఓట్ల శాతం	2013 సీట్లు	2013 ఓట్లశాతం
కాంగ్రెస్	100	39.30	21	33.1
బీజేపీ	73	38.77	163	45.2
స్వతంత్రులు	13	9.5	7	8.2
బీఎస్‌పీ	6	4	3	3.4
ఇతరులు	8	7.1	6	5

ఛత్తీస్‌గఢ్(90)

పార్టీ	2018 సీట్లు	2018 ఓట్ల శాతం	2013 సీట్లు	2013 ఓట్లశాతం
కాంగ్రెస్	68	43	39	40.3
బీజేపీ	15	33	49	41
ఇతరులు	7	11.5	2	11.3

అధికారంలోకి రాగానే కుల గణన

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కులాల వారీగా జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. పేద వర్గాల, దళిత, బీసీల సాధికారత కోసం కుల గణన చేపట్టాలని పేర్కొంది. కుల గణన కోసం అధికార బీజేపీపై ఒత్తిడి పెంచుతామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం నిర్వహించారు. కేంద్రంలో తాము అధికారంలోకి రాగానే కుల గణన నిర్వహిస్తామని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు చేస్తామని కాంగ్రెస్ పేర్కొంది. ఈ మేరకు సీడబ్ల్యూసీ భేటీలో తీర్మానం చేశారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని వెల్లడించింది. కుల గణనకు మద్దతు ఇస్తూ సీడబ్ల్యూసీ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాహుల్ గాంధీ అన్నారు. కుల గణన అనేది ఇండియాకు ఎక్స్–రే అని అభివర్ణించారు.



బిహార్‌లో నిర్వహించిన కుల గణనను సీడబ్ల్యూసీ స్వాగతించింది. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్టీపరంగా అనుసరించాల్సిన వ్యూహాలపై వర్కింగ్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ నేతలు చర్చించారు.

ప్రభావవంతమైన వ్యూహం కావాలి: ఖర్గే

ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలంటే ప్రభావవంతమైన వ్యూహం అవసరమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా, క్రమశిక్షణతో పనిచేయాలని పార్టీ కార్యకర్తలకు సీడబ్ల్యూసీ భేటీలో పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అసలైన లబ్ధిదారులకు అందాలంటే కేంద్ర ప్రభుత్వం కుల గణన ప్రారంభించాలని అన్నారు. కుల గణనకు తాను వంద శాతం మద్దతు ఇస్తున్నానని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ సోనియా గాంధీ చెప్పారు. దానికోసం పోరాడుదామని సూచించారు. కులాల వారీగా జనాభా లెక్కలకు తమ పార్టీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

కశ్మీర్‌లో 'సరైన సమయం'లో ఎన్నికలు: ఈసీ

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకొని సరైన సమయంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రధాన ఎన్నికల కమిషన్(సీఈసీ) రాజీవ్ కుమార్ సోమవారం చెప్పారు. ఏది సరైన సమయం అని తాము భావిస్తామో అప్పుడే అసెంబ్లీ ఎన్నికలతోపాటు ఇతర ఎన్నికలు జరుగుతాయని అన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి, జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత అక్కడ ఎన్నికలను నిలిపివేసిన సంగతి తెలిసిందే. నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ స్థానాల సంఖ్య 83 నుంచి 90కి పెరిగింది.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023





పారిస్ ఒలింపిక్సే లక్ష్యం...

ప్రస్తుతం తన ధ్యానంతా రానున్న పారిస్ ఒలింపిక్స్ ఫైనేనని, అందులో బంగారు పతకమే లక్ష్యమని భారతీయ స్టార్ అథ్లెట్, జావెలిన్ త్రో క్రీడాకారుడు నీరజ్ చోప్రా పేర్కొన్నారు. -8లో



..కిసాన్ అగ్రి మాల్స్

రైతుల భాగస్వామ్యంతో దేశ వ్యాప్తంగా నాణ్యమైన ఎరువులు, మందులు అందించేందుకు కిసాన్ అగ్రిమాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల అన్నారు. -8లో

ఉప్పల్ స్టేడియంకు ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్ స్టేడియంలో మంగళవారం జరుగనున్న క్రికెట్ వరల్డ్‌కప్ మ్యాచ్ కోసం 56 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ బస్సులు ఉప్పల్ స్టేడియంకు రాకపోకలు సాగిస్తాయి. ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్, కోఠి, జీడిమెట్ల, మియాపూర్, మేడ్చల్, చార్మినార్, మెహిదీపట్నం, ఈసీఐఎల్, కొండాపూర్, వనస్థలిపురం తదితర ప్రాంతాల నుంచి ఈ బస్సులు నడుస్తాయి.

క్రికెట్ జోష్











ఉప్పల్ మైదానంలో సోమవారం న్యూజిలాండ్, నెదర్లాండ్స్ మధ్య జరిగిన వన్డే వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్‌కు మంచి స్పందన లభించింది. మూడు రోజుల క్రితం జరిగిన పాకిస్తాన్, నెదర్లాండ్స్ మ్యాచ్‌తో పోలిస్తే ఎక్కువ మంది ప్రేక్షకులు దీనికి హాజరయ్యారు. కివీస్ ఇన్నింగ్స్ ప్రారంభమైన సమయంలో పెద్దగా జనం లేకపోయినా.. ఆ తర్వాత సంఖ్య పెరిగింది. జట్లతో సంబంధం లేకుండా అభిమానులు మ్యాచ్‌ను బాగా ఎంజాయ్ చేశారు. కివీస్ ఇన్నింగ్స్‌లో వచ్చిన పది సిక్సర్లకు ప్రేక్షకులు స్టేడియాన్ని హోరెత్తించారు. న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ ఈ మ్యాచ్‌లో కూడా ఆడలేదు. అయితే సన్‌రైజర్స్ హైదరాబాద్ మాజీ ఆటగాడిగా అతనిపై అభిమానాన్ని ప్రదర్శిస్తూ 'కేన్ మామా' అంటూ పదే పదే అతని పేరును ప్రస్తావిస్తూ ఉత్సాహం చూపించారు. నెదర్లాండ్స్ తరపున ఆడుతున్న ఆంధ్రప్రదేశ్ ఆటగాడు తేజ నిడమనూరు బ్యాటింగ్ చేసినంత సేపూ అతనికి మంచి మద్దతు లభించింది. ముఖ్యంగా లాంగాన్ దిశలో అతను భారీ సిక్స్ కొట్టినప్పుడు నార్త్ స్టాండ్ మొత్తం దద్దరిల్లింది. డ్రింక్స్ విరామ సమయంలో వచ్చిన మెరుస్తూ వచ్చిన లైట్నింగ్ డ్రింక్స్ ట్రాలీ మైదానంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. -సాక్షి, హైదరాబాద్



ఇక..ఓట్లాట!

షెడ్యూలు విడుదలతో గ్రేటర్‌లో ఎలక్షన్ వార్

నగరంలో నగారా సందడి

- అమల్లోకి కోడ్.. అభివృద్ధి పనులకు బ్రేకులు
- అభ్యర్థుల ప్రకటనతో దూసుకుపోతున్న కారు
- కాంగ్రెస్, బీజేపీల్లో ఒడవని టికెట్ల కిరికిరి

గ్రేటర్ నగరంలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి వాతావరణం మారిపోయింది. చలికాలమే అయినప్పటికీ ఎన్నికల షెడ్యూలు వెలువడటంతో పొలిటికల్ హీట్ పెరిగిపోయింది. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు? ఈ వారమా..ఇంకో వారమా? అంటూ గత కొన్ని రోజులుగా సాగుతున్న చర్చలకు ఫుల్‌స్టాప్ పడింది. ఎన్నికల సంఘం ఐదు రాష్ట్రాల ఎన్నికల తేదీలను మధ్యాహ్నం ప్రకటించనుందంటూ ఉదయాన్నే వెలువడిన వార్తతో అందరూ ఆసక్తిగా తేదీల కోసం ఎదురు చూశారు. ఎన్నికల షెడ్యూలు విడుదలతోనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఎలాంటి సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొత్తగా చేయడానికి వీల్లేదు. ఇప్పటికే ప్రారంభమైన వాటిని మాత్రం కొనసాగించవచ్చు. ఏదైనా అత్యవసరం అయిన పక్షంలో ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లి అనుమతితో అమలు చేయవచ్చు. దీంతో ఇప్పటి వరకు గృహలక్ష్మి, బీసీబంధు తదితర ప్రయోజనాల కోసం ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్న ప్రజలు నిట్టూర్పులు విడిచారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు లాటరీ ద్వారా ఎంపికైన వారికి మాత్రం ప్రక్రియ కొనసాగించవచ్చునని అధికారులు పేర్కొన్నారు. ఇక రాజకీయ నేతలు ఓట్ల వేట ఎలా చేయాలోనని పథక రచనలు ప్రారంభించారు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

టాప్‌గేర్‌లో కారు..



దాదాపు రెండు నెలల ముందే బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించడంతో వారు ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లి ప్రచారం మొదలు పెట్టారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రులు ప్రారంభోత్సవాలు చేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే, మరిన్ని మేలైన పథకాలు రావాలంటే బీఆర్ఎస్‌నే తిరిగి గెలిపించాల్సిందిగా ఇప్పటికే పరోక్షంగా ప్రచారం ముమ్మరం చేశారు. వీలైనంత మందికి వీలైనన్ని సంక్షేమ పథకాలు అమలు చేశారు. నగరంలో నాంపల్లి, గోషామహల్‌లకు మాత్రం అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అలాగే మేడ్చల్‌లో అభ్యర్థిని అధికారికంగా ప్రకటించకపోయినా అధిష్టానం సంకేతాలతో మల్లారెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల బీఆర్ఎస్ అభ్యర్థులు వివిధ కార్యక్రమాల ద్వారా ఇప్పటికే ప్రజల్లోకి చొచ్చుకు వెళ్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఇటీవల జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న మున్సిపల్ మంత్రి కేటీఆర్..అక్కడి స్థానిక ఎమ్మెల్యేను చూపుతూ, నాపై ఒత్తిడి తెచ్చి మీకీ సదుపాయం కల్పించారు. మళ్లీ గెలిపిస్తే మీకు మరింత మేలు జరుగుతుంది అంటూ ఇప్పటికే పరోక్ష ప్రచారం నిర్వహించారు. మెజారిటీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇప్పటికే పార్టీ ప్రచార సామాగ్రిని సైతం సమకూర్చుకున్నారు.



కాంగ్రెస్‌లో ఇక్కట్లు.. బీజేపీలో నాన్చుడు

టికెట్లు దక్కనందున అంతో ఇంతో అసంతృప్తితో ఉన్నవారిని బుజ్జగించి ఇప్పటికే వారు పార్టీ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యేలా బీఆర్ఎస్ చేయగా, ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీల్లో ఇంకా అభ్యర్థుల ఎంపికే పూర్తి కాలేదు. కాంగ్రెస్ దాదాపు 70 మంది పేర్లు ఖరారు చేసినట్లు చెబుతుండగా, అందులో గ్రేటర్‌కు సంబంధించి సగం నియోజకవర్గాలు కూడా లేవు. అభ్యర్థుల ఖరారు కోసం 'స్క్రీనింగ్' ఇంకా జరుగుతోంది. అది పూర్తయి, పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ ఆమోదించి, ప్రకటించేందుకు ఇంకెంత సమయం పడుతుందో కచ్చితంగా చెప్పే పరిస్థితి లేదు. బీజేపీది దాదాపుగా ఇదే పరిస్థితి. అభ్యర్థుల ఎంపిక కసరత్తు పూర్తి కాలేదు. పూర్తిచేసి ఎప్పుడు వెల్లడిస్తారో స్పష్టత లేదు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీల్లోనూ అభ్యర్థుల్ని ప్రకటించాక టిక్కెట్లు రాని వారి నుంచి వెల్లువెత్తే అసమ్మతులు, ఎగురవేసే తిరుగుబాటు జెండాలను ఎలా నివారించగలుగుతారో తెలియదు. ఆ రెండు పార్టీలకు అలా ఇంటి పోరు మొదలవనుండగా, బీఆర్ఎస్ ఇక అధికారికంగానే ఎన్నికల ప్రచారాన్ని చేపట్టనుంది. కాంగ్రెస్, బీజేపీలు ఇప్పుడు ప్రచారం చేసినా, 'మా అభ్యర్థి ఈయన..ఈయననే గెలిపించండి' అని చెప్పే పరిస్థితి లేదు. ఆ పార్టీల ఆ పరిస్థితిని బీఆర్ఎస్ తనకు మరింత అనుకూలంగా మలచుకోనుంది. ఇక్కడ అభ్యర్థులు లేరు..గెలిస్తే ఎవరు సీఎం అవుతారో చెప్పే పరిస్థితి లేని ఆ పార్టీలను గెలిపిస్తే చేసేదేమీ ఉండదని చెప్పేందుకు తమకు మంచి ఆయుధం దొరికిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొందరు వ్యాఖ్యానించారు. నియోజకవర్గాలపై ఇక పూర్తి ఫోకస్ పెట్టనున్నారు. అనుచరులు, అనుయాయులు, మందీమార్బలంతో దుమ్ము దుమారం రేపేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉంది.

'కోడ్'తో బ్రేక్

- అమల్లోకి ఎన్నికల నియమావళి
- ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశాం
- జాబితాలో పేరు లేకుంటే నమోదుకు అవకాశం
- వయోవృద్ధులు, వికలాంగులకు ఇంటివద్దనే ఓటు వేసే చాన్స్
- జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచే హైదరాబాద్ జిల్లాలో ఎన్నికల నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చిందని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. కొత్త పనులు ప్రారంభించడం కుదరదని, ఇప్పటికే కొనసాగుతున్న పనులు మాత్రం ఆగవని స్పష్టం చేశారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (ఎన్నికలు)జె.శంకరయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి దాకా ఓటరు జాబితాలో పేరు లేని వారు అక్టోబర్ 30 వరకు నమోదు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. పోలింగ్ బూత్‌ల దాకా రాలేని 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, వికలాంగులు సంబంధిత ఫారం ద్వారా దరఖాస్తు చేసుకుంటే పోలింగ్ సిబ్బంది వారి ఇళ్ల వద్దకే వెళ్లి పోలింగ్ నిర్వహిస్తారన్నారు. ఎన్నికల సంఘం ఈసారి ఈ కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధంగా ఉన్నామని రిటర్నింగ్ అధికారుల నియామకం, తదితర పనులు ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. జిల్లాలో ఎలక్షన్ పాపులేషన్ రేషియో 744గా ఉందన్నారు. ప్రభుత్వ భవనాలపై ప్రచారం చేసేవారిపై డిఫేస్‌మెంట్ యాక్ట్ ప్రకారం చర్యలుంటాయని, ప్రైవేటు భవనాలకు సైతం యజమానుల అనుమతి అవసరమని స్పష్టం చేశారు. అనధికార ప్రకటనలన్నీ తొలగిస్తామన్నారు. మద్యం షాపుల వద్ద, ఆన్‌లైన్ నగదు ట్రాన్సాక్షన్లపై నిఘా ఉంటుందన్నారు. జాబితాలో పేరుందో లేదో రీచెక్ చేసుకోవాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తెలియని వారు వెబ్‌సైట్‌లో ఉన్న బీఎల్‌ఓ నెంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా కానీ, సంబంధిత అధికారుల సహకారంతో కానీ తెలుసుకోవాలని సూచించారు. కుటుంబంలోని అందరి ఓట్లు ఒకే కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉంది, రూట్, అక్కడి ఓటర్ల క్యూ , పార్కింగ్ సదుపాయం తదితరమైనవన్నీ మై జీహెచ్ఎంసీ యాప్ ద్వారా ఆన్‌లైన్ ద్వారా తెలిసే ఏర్పాట్లు చేస్తామన్నారు. పోలింగ్ శాతం పెరిగేందుకు ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈవీఎంలు, తదితర సామాగ్రి సిద్ధంగా ఉందన్నారు.



సమావేశంలో రొనాల్డ్ రాస్, సీవీ ఆనంద్ తదితరులు

సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేక చర్యలు: సీవీ ఆనంద్

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు సిబ్బందితో అవసరమైన చర్యలు తీసుకుంటామని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఉచితాలపై నిఘా ఉంటుందన్నారు. ఈసారి కొత్తగా నార్కోటిక్ కంట్రోల్‌బ్యూరో కూడా పనిచేస్తుందన్నారు. లైసెన్సులేని ఆయుధాల గుర్తింపునకు స్పెషల్‌డ్రైవ్ చేపట్టడంతో పాటు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు లైసెన్సులున్న వారు డిపాజిట్ చేసేలా చేయడం..ఇతరత్రా అంశాలకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ పనిచేస్తాయని, తనిఖీలు విస్తృతంగా ఉంటాయని, ప్రజలు సహకరించాలన్నారు. అత్యవసర పనులకు డబ్బు తరలింపు సందర్భాల్లో అవసరమైన దస్త్రాలు తప్పకుండా వెంట ఉండాలని సూచించారు. యూపీఏ ట్రాన్సాక్షన్లు అనుమానాస్పదంగా ఉంటే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. విలేకరుల సమావేశంలో ఈవీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు ఇలా..

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు: **3,986**

పోలింగ్, పోలీస్ సిబ్బంది: **34,452**

ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు : **18**

ఎన్నికల సంబంధిత ఫిర్యాదులకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు 15 ఆర్ఓల కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్స్ ఏర్పాటు

సీ–విజిల్ యాప్ అందుబాటులోకి

రాజకీయపార్టీలకు ఎన్నికల సంబంధిత అనుమతులకు సింగిల్‌విండోగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సువిధ కేంద్రం ఏర్పాటు.

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు, ఖర్చులు, మద్యం, పెద్ద మొత్తంలో నగదు తరలింపు, తదితరమైన వాటి పరిశీలనకు 90 ఫ్లయింగ్ స్క్వాడ్స్, రాజకీయపార్టీల ర్యాలీలు, తదితరమైనవి చిత్రీకరించేందుకు 15 చొప్పున వీడియో సర్వైలెన్స్, వీడియో వ్యూయింగ్ టీమ్స్ ఏర్పాటు.

నిబంధనలకు వ్యతిరేకంగా ఎన్నికల సామాగ్రి ప్రచురించే సంస్థలపై చర్యలు.

నగరంలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు: **1587**

టోల్ ఫ్రీ నెంబర్లు 1950, 1800-599-2999

నియమావళి ఉల్లంఘనల ఫిర్యాదులను సీ–విజిల్ యాప్ ద్వారా పంపితే వంద నిమిషాల్లో పరిష్కరించి తెలియజేస్తారు.

బందోబస్తు విధుల కోసం 32 కంపెనీల కేంద్ర బలగాలను కోరినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.

పోలీస్ అలర్ట్!

- ఎలక్షన్ సెల్ రెడీ.. ఇన్‌చార్జిగా అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్
- డీసీపీ ఆపై స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లు
- సమన్వయంతో పనిచేయండి: కొత్వాల్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల సైరన్ మోగడంతో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావే లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకునేందుకు కొత్వాల్ సీవీ ఆనంద్ సిద్ధమయ్యారు. ఈ ప్రక్రియలో భాగంగా నగరంలోని పరిస్థితులు బేరీజు వేడానికి, సందర్భానుసారం అవసరమైన చర్యలు తీసుకోవడానికి ప్రధాన కమిషనరేట్‌లో ప్రత్యేక ఎలక్షన్ సెల్‌ను ఏర్పాటు చేశారు. నగర అదనపు కమిషనర్ (శాంతిభద్రతలు) విక్రమ్‌సింగ్ మాన్ దీనికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈయన సోమవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా డీసీపీ ఆపై స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన సోమవారం నుంచి ఇది పూర్తి స్థాయిలో పని చేయడం ప్రారంభించింది. నగర నిఘా విభాగమైన స్పెషల్ బ్రాంచ్ సంయుక్త కమిషనర్ విశ్వప్రసాద్ సైతం ఈ సెల్‌లో కీలక భూమిక పోషిస్తున్నారు. కోడ్ అమలులో ఉన్నంత కాలం ప్రతి రోజూ ఓ డీఎస్ఆర్ (డెయిలీ సిట్యువేషన్ రిపోర్ట్) తయారు చేసి నివేదించాల్సిన బాధ్యత ఈయనపై ఉంటుంది. ఈ నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు, జోనల్ ఇన్‌చార్జిలతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవడం తదితర బాధ్యతలను మాన్ నిర్వహిస్తారు. ఎన్నికల నామినేషన్లు మొదలుకుని ఫలితాలు ప్రకటించేంత వరకు ఈ విభాగం కొనసాగుతుంది. అలాగే ఎన్నికల బందోబస్తుకు అవసరమైన అన్ని చర్యలను దీని ద్వారానే నిర్వహిస్తారు. నగరంలోని ఏడు జోన్లలో ఎన్నికల విధి నిర్వహణ, అవసరమై బలగాల కేటాయింపు, వారికి వసరులు, సౌకర్యాలను ఏర్పాటు చేయడం తదితర విధులు కూడా ఎన్నికల సెల్ నిర్వహిస్తుంది. డీజీపీ కార్యాలయంలో ఏర్పాటైన రాష్ట్ర స్థాయి ఎలక్షన్ సెల్‌కు సంబంధించిన హాట్‌లైన్ దీనికి అనుసంధానించి ఉంటుంది. జీహెచ్ఎంసీ, రెవెన్యూ సహా అన్ని విభాగాలతో సమన్వయం కూడా ఈ సెల్ విధుల్లో భాగమే.

ఎన్నికలకు సమన్వయంతో పని చేద్దాం: కొత్వాల్

నామినేషన్ల ప్రక్రియ నుంచి ఎన్నికల ప్రచారం, పోలింగ్, కౌంటింగ్ ఘట్టాలు పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటలకూ తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిందిగా హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఏమాత్రం ఏమరుపాటుకు తావిచ్చినా... కఠిన చర్యలు తీసుకుంటానని అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో ఉన్న అన్ని విభాగాలు, సమన్వయంతో పని చేయాలని సూచించారు.

భారీగా భూ మార్పిడి

- కన్జర్వేషన్ నుంచి రెసిడెన్షియల్‌కు మార్పు
- అలాగే వాణిజ్యవినియోగ స్థలాలను నివాసంలోకి...
- మాస్టర్ ప్లాన్‌లో ఈ మేరకు మార్పులు
- అభ్యంతరాలపై నోటిఫికేషన్లు విడుదల చేసిన హెచ్ఎండీఏ

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికలు సమీపించిన వేళ...గ్రేటర్‌లోని వివిధ ప్రాంతాల్లో హెచ్ఎండీఏ పెద్ద ఎత్తున భూమార్పిడికి చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి అభ్యంతరాలను స్వీకరించేందుకు నోటిఫికేషన్లను విడుదల చేసింది. హెచ్ఎండీఏ పరిధిలోని పలు జిల్లాల్లో భూ మార్పిడి కోసం (చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్) పెద్ద సంఖ్యలో గతంలోనే దరఖాస్తులు వెల్లువెత్తాయి. మాస్టర్‌ప్లాన్ ప్రకారం చాలాచోట్ల కన్జర్వేటివ్ జోన్‌లలో ఉన్న భూములను రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చును కోరుతూ భూ యజమానులు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే కొన్ని చోట్ల తయారీ రంగానికి భూములను కేటాయించగా ఇప్పుడు వాటిని నివాసయోగ్యంలోకి మార్పు చేస్తూ హెచ్ఎండీఏ నోటిఫికేషన్‌లను విడుదల చేసింది. మరోవైపు వాణిజ్య మండలాలుగా ఉన్న వాటిని నివాసంలోకి, రెసిడెన్షియల్ జోన్‌లలో ఉన్న వాటిని వాణిజ్యమండలాల్లోకి మార్పులు చేర్పులు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు మాస్టర్ ప్లాన్‌లో సవరణలు చేయనున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఖాళీ స్థలాలుగా గుర్తించిన వాటిని సైతం రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్పు చేయడం గమనార్హం. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆగమేఘాల మీద భూమార్పిడి నోటిఫికేషన్లను వెల్లడించారు. అన్ని ప్రాంతాల్లో అభ్యంతరాలను పరిశీలించేందుకు అవకాశం ఇచ్చినప్పటికీ ఎన్నికల సమయంలో హడావిడిగా నోటిఫికేషన్లు ఇవ్వడం గమనార్హం.

ఎక్కడెక్కడ ఎలా....

బోడుప్పల్‌లో గతంలో తయారీ రంగం కోసం కేటాయించిన సుమారు 2385 చదరపు మీటర్ల భూమిని ప్రస్తుతం మల్టిపుల్ యూజ్ జోన్‌లోకి మార్చేందుకు చర్యలు చేపట్టారు. అలాగే శామీర్‌పేట్ మండలం తుర్కపల్లికి చెందిన 9849.36 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న కన్జర్వేషన్ జోన్ స్థలాలను రెసిడెన్షియల్‌లోకి మార్చనున్నారు. దాంతో పాటు అదే జోన్‌లో ఉన్న మరో 9755 చదరపు మీటర్లను కూడా నివాస భూమిగా మార్పు చేసేందుకు నోటిఫికేషన్ వెలువరించారు. కీసర మండలం రాంపల్లిలో కన్జర్వేషన్ జోన్‌లో ఉన్న మరో 4.6 ఎకరాల భూమిని సైతం రెసిడెన్షియల్‌కు మార్పు చేయనున్నారు. అలాగే నార్సింగిలో ఉన్న 4584 చదరపు మీటర్ల నివాస స్థలాన్ని వాణిజ్య స్థలంగా మార్పు చేయనున్నారు. కర్మన్‌ఘాట్‌లో ఉన్న సుమారు 1441.47 చదరపు మీటర్ల స్థలం ప్రస్తుతం తయారీ రంగానికి చెంది ఉంది. దీనిని నివాస ప్రాంతంగా మార్చేందుకు చర్యలు చేపట్టారు. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ లో ఉన్న సుమారు 23,850 చదరపు మీటర్లకు పైగా ఉన్న భూమిని మాస్టర్ ప్లాన్‌లో వినోద అవసరాల కోసం లేదా ఖాళీ ప్రదేశంగా గుర్తించారు. ఇప్పుడు దానిని వాణిజ్య అవసరాల కోసం మార్పు చేయనున్నారు. అలాగే జూబ్లీహిల్స్‌లో ఉన్న సుమారు 1131.36 చదరపు మీటర్ల నివాస స్థలాన్ని వాణిజ్య స్థలంగా మార్చనున్నారు. ఉప్పల్ మండలం బండ్లగూడ పరిధిలో ఉన్న మరో 16820 చదరపు మీటర్ల ఖాళీ ప్రదేశాన్ని రెసిడెన్షియల్ జోన్‌గా మార్పు చేయనున్నారు. కాగా ప్రస్తుతం ఎన్నికల సమయంలో హడావిడిగా నోటిఫికేషన్‌లు ఇచ్చారు. ప్రజల నుంచి అభ్యంతరాలను, ఫిర్యాదులను స్వీకరించకుండానే మార్పు చర్యలు ఎలా చేపడతారని విమర్శలు వస్తున్నాయి.

పారిస్ ఒలింపిక్సే లక్ష్యం..

- ఏసియన్ క్రీడల్లో సాధించిన పతకం స్థైర్యాన్ని పెంచింది
- విజయంలో 'శిక్షణ, ఫిట్నెస్' కీలక పాత్ర...
- ప్రతీ సామాన్యుడు విజేతగా నిలవచ్చు
- నగరంలో అండర్ ఆర్మర్ స్టోర్‌ను ప్రారంభించిన ప్రపంచ ఛాంపియన్ నీరజ్ చోప్రా



సాక్షి, సిటీబ్యూరో: రానున్న రోజుల్లో అంతర్జాతీయ క్రీడా వేదికపై భారతీయ క్రీడాకారుల హవా కొనసాగనుంది, ప్రస్తుత ఆసియా క్రీడల్లో భారతీయ క్రీడాకారులు వందకు పైగా పతకాలను సాధించడం ఇందుకు నిదర్శనమని ప్రముఖ భారతీయ అథ్లెట్, ప్రపంచ ఛాంపియన్ నీరజ్ చోప్రా అన్నారు. అండర్‌డాగ్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.2 వేదికగా ఏర్పాటు చేసిన అండర్ ఆర్మర్ స్టోర్‌ను అథ్లెట్ నీరజ్ చోప్రా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ప్రతి సామాన్యుడు అసాధారణమైన విజయాలను సాధించవచ్చునని, అందుకు తానే నిదర్శనమని తెలిపారు. ఒలంపిక్స్‌లో బంగారు పతకం సాధించిన మొదటి ఏసియన్ అథ్లెట్‌గా తన ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు, మానసిక ఒత్తిడిని ఆత్మ స్థైర్యంతో ఎదుర్కొన్నానన్నారు. 'నిరంతర శ్రమ, క్రమశిక్షణతో క్రీడా శిక్షణ, మంచి ఫిట్నెస్' ఇవే విజయానికి సోపానాలని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంతో మరచిపోలేని అనుభవాలు ఉన్నాయన్నారు. నగరంలోని పుల్లెల గోపీచంద్ స్పోర్ట్స్ అకాడమీని సందర్శించానని, అక్కడి అథ్లెట్‌లు, క్రీడాకారులతో పలు అంశాలపై సలహాలు, సూచనలు కొనసాగాయన్నారు. ప్రస్తుతం దేశంలో క్రీడాకారులు రాణించడంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, కార్పొరేట్ గ్రూపులు, ప్రభుత్వ ప్రోత్సాహం కీలకమైనదని, ఇలాంటి అద్భుత ప్రోత్సాహానికి ధన్యవాదాలు తెలిపారు. అథ్లెట్, ఫిట్నెస్‌లో ప్రయాణంలో అండర్ ఆర్మర్ మరింత శక్తిసామర్థ్యాలను అందించిందన్నారు.

తదుపరి లక్ష్యం పారిస్ ఒలింపిక్స్...

ప్రస్తుతం తన ధ్యాసంతా రానున్న పారిస్ ఒలింపిక్స్ పైనేనని, అందులో బంగారు పతకమే లక్ష్యమని నీరజ్ చోప్రా పేర్కొన్నారు. ఈ సారి 90 మీటర్ల దూరాన్ని చేధించే ప్రయత్నం చేస్తున్నానన్నారు. ఇంటి ఫుడ్ అంటే అమితమైన ఇష్టం. వెజిటేరియన్ ఫుడ్ ఇష్టంగా తింటానని.., దాల్, నమ్కీన్, చుర్మా, హల్వాకీర్ ఇష్టపడతానని తెలిపారు. ఫిట్నెస్‌లో భాగంగా తీసుకునే ఆహారం చాలా ముఖ్యమైనదని, ప్రోటీన్ షేక్‌లు ఇతర సప్లిమెంట్స్ అదనపు శక్తి కోసం వాడటంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అంతర్జాతీయ క్రీడాపోటీల్లో పాల్గొనే సమయంలో అద్భుత క్రీడా నైపుణ్యాలున్న క్రీడాకారులను కలిసి స్ఫూర్తిపొందానని, భవిష్యత్‌లో కూడా తనలాంటి క్రీడాకారులను తయారు చేయడానికి కృషి చేస్తానని అన్నారు.

అత్యాధునిక టెక్నాలజీతో గ్రామీణ రహదారుల నిర్మాణం

- రోడ్ల నిర్మాణంలో కొత్త ఆవిష్కరణలు అవసరం
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఈఎన్‌సీ గణపతిరెడ్డి

రాయదుర్గం: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ రహదారుల్లో కొత్త టెక్నాలజీ వినియోగిస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో సివిల్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజినీరింగ్ డివిజన్, ఎస్కీ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోలో నూతన సాంకేతిక కార్యక్రమాలపై ఎన్‌ఆర్‌ఐడీఏ, రోడ్లు భవనాల శాఖ సంయుక్తంగా నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రహదారుల్లో అత్యాధునిక టెక్నాలజీని అమలు చేసి వాటిని పది కాలాల పాటు మన్నేలా చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉందన్నారు. రోడ్డు నిర్మాణంలో కొత్త ఆవిష్కరణల అమలుకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ రోడ్ల నిర్మాణం, సాంకేతికత, ఆవిష్కరణలు, రహదారిభద్రతపై సంబంధిత అధికారులు, ఉద్యోగులకు మరింత అవగాహన అవసరమ న్నారు. ఈ సందర్భంగా 'ఎస్కీ' అందించే వివిధ రకాల శిక్షణా కార్యక్రమాల నిర్వహణపై ఆయన అవగాహన కల్పించారు. ఈనెల 13 వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ శిక్షణలో 20 రాష్ట్రాలకు చెందిన 40 వివిధ శాఖలకు చెందిన ఇంజినీర్లు, జూనియర్ ఇంజనీర్లు, చీఫ్ ఇంజనీర్లు పాల్గొనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా 9 రాష్ట్రాల నుంచి పోలీసు, ట్రాఫిక్, మోటార్ వెహికిల్, ఆర్ అండ్ బీ, ట్రాన్స్‌పోర్ట్ శాఖల కు చెందిన వారు శిక్షణలో పాల్గొంటున్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఆర్ వెంకట్‌రెడ్డి, ఎస్కీ అధికారులు, రోడ్లు భవనాలు, ఇతర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన వారితో ఈఎన్‌సీ గణపతిరెడ్డి, ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తదితరులు

పోస్టాఫీసులకు దర్పణ్ -2.0 అప్లికేషన్



మాట్లాడుతున్న పోస్ట్ మాస్టర్ జనరల్ ప్రకాష్

సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్రంలోని పోస్టాఫీసులను అత్యాధునిక అప్లికేషన్(సాఫ్ట్‌వేర్) దర్పణ్– 2.0 కింద ఆధునికీకరించినట్లు తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కే ప్రకాష్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ డాక్ సదన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ పి.వి.ఎస్.రెడ్డి, హైదరాబాద్ హెడ్ క్వార్టర్స్ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ టి.ఎం.శ్రీలతతో కలిసి వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో సుమారు 5,441 బ్రాంచ్ పోస్టాఫీసుల్లోని పోస్ట్‌మెన్‌లకు అత్యాధునిక అప్లికేషన్ అందించడం జరిగిందన్నారు. వీటి ఆధారంగా ఆధార్ అథెంటికేషన్ పేమెంట్ సిస్టమ్ ద్వారా నగదు డ్రా, పార్శిల్ ట్రాకింగ్, పికప్, ఆర్టికల్ బుకింగ్, ట్రాకింగ్ తదితర సేవలు అందించవచ్చన్నారు. తపాలా శాఖ ద్వారా 160 సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 10 నుంచి 13 వరకు జాతీయ పోస్టల్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎగుమతుల కోసం డాక్ ఘర్ నిరయత్ కేంద్రాన్ని ప్రారంభించి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.తపాలా శాఖ అందిస్తున్న ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, కామన్ సర్వీస్ సెంటర్లు, డోర్ స్టెప్ బ్యాంకింగ్ తదితర సేవలను వినియోగించుకోవాలని కోరారు.

రైతుల భాగస్వామ్యంతో కిసాన్ అగ్రి మాల్స్

ఏజీవర్సిటీ: రైతుల భాగస్వామ్యంతో దేశ వ్యాప్తంగా నాణ్యమైన ఎరువులు, మందులు అందించేందుకు కిసాన్ అగ్రిమాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల చింతల అన్నారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజిమెంట్(మేనేజ్)లో కిసాన్ అగ్రిమాల్స్ ఫ్రాంచైజ్‌ను మేనేజ్ డైరెక్టర్ జనరల్ చంద్రశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో కిసాన్ అగ్రిమాల్స్ ప్రారంభించడం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటి వరకు 2 లక్షల మంది రైతులకు భాగస్వాములను చేస్తూ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు మేలైన మందులు, ఎరువులు అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడమే మాల్స్ ఉద్దేశమన్నారు. రైతులకు మరింత చేరువయ్యేందుకు భవిష్యత్తులో అవుట్ పుట్ లింకేజ్, ఇ-కామర్స్ వ్యాపారాన్ని పెంచుకోవడానికి ఇవి దోహదపడతాయన్నారు. దీంతో పాటు కిసాన్ ఈ మార్ట్, కిసాన్ వారిధి మార్కెటింగ్ ఛానల్‌ల ద్వారా వ్యవసాయ సమస్యలకు పరిష్కారాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేనేజ్ వ్యవసాయ విస్తరణ అధికారి డాక్టర్ శరవణన్ రాజ్ ,కిసాన్ అగ్రి మాల్స్ డైరెక్టర్ వెంకటస్వామి రెడ్డి,సయ్యద్ దస్తగిరి పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఏసీబీ విచారణకు ఇన్‌స్పెక్టర్ నరేందర్

- ఎస్సై నవీన్‌రెడ్డి, హోంగార్డు హరి సైతం హాజరు
- పలు అంశాలపై వివరణ కోరిన అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: మామూళ్ల కోసం పబ్ యజమాన్యాన్ని వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బంజారాహిల్స్ ఠాణా మాజీ ఇన్‌స్పెక్టర్ ఎం.నరేందర్ సోమవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల ఎదుట హాజరయ్యారు. ఈయనతో పాటు ఎస్సై నవీన్‌రెడ్డి, హోంగార్డు హరి కూడా నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి వచ్చారు. ఈ ముగ్గురినీ ఏసీబీ అధికారులు శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు ప్రశ్నించిన విషయం విదితమే. ఠాణాలోని పలు రికార్డులు, సీసీ కెమెరా ఫుటేజీలతో పాటు ఆ ముగ్గురి ఫోన్, వాట్సాప్ కాల్స్ వివరాలను ఏసీబీ బృందం పరిశీలించింది. వీరిని శనివారం ఉదయం వరకు సుదీర్ఘంగా విచారించిన అధికారులు సీఆర్పీసీ 41 ఏ నోటీసులు జారీ చేశారు. వీటిలో సోమవారం తమ కార్యాలయంలో హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే ముగ్గురూ సోమవారం కేసు విచారణ అధికారి ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. పబ్ యాజమాన్యంపై కేసు నమోదులో ఇన్‌స్పెక్టర్, ఎస్సై పాత్రలపై ప్రశ్నించారు. వీరికి వివిధ ప్రశ్నలతో కూడిన ఎనిమిది పేజీల నోటీసులు జారీ చేసిన అధికారులు ఈ నెల 16న మరోసారి విచారణకు హాజరై వాటికి సమాధానం ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఏసీబీ వలలో జిల్లా కోర్టు ఉద్యోగులు

ఇద్దరు నజారత్ ఫీల్డ్ అసిస్టెంట్ల అరెస్ట్

రంగారెడ్డి కోర్టులు: లంచం తీసుకుంటున్న జిల్లా కోర్టు నజారత్ విభాగం ఫీల్డ్ అసిస్టెంట్‌లను అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా కోర్టు ఆవరణలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్ ద్వారా మరో ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ, ఓ మహిళా న్యాయవాది నుండి రూ. 11 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ అధికారుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 1వ అదనపు సీనియర్ సివిల్ న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను అమలు పరిచి దానికి సంబంధించిన నివేదిక కోర్టులో దాఖలు చేసేందుకుగాను న్యాయవాది శారద కోర్టు ఉద్యోగులు వెంకటేశ్వర్, రామకృష్ణలను సంప్రదించారు. ఇందుకుగాను వారు రూ.11 వేలు డిమాండ్ చేశారు. దీంతో ఆమె ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారి సూచన మేరకు సోమవారం ఆమె కోర్టు ఉద్యోగి రామకృష్ణకు రూ.11 వేలు అందజేస్తుండగా దాడి చేసిన ఏసీబీ అధికారులు అతడితో పాటు వెంకటేశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై విమర్శలొద్దు



జి.కరుణాకర్‌రెడ్డి

ముషీరాబాద్: అగ్రవర్ణ పేదలకు కేంద్ర ప్రభుత్వం కల్పించిన పదిశాతం విద్య, ఉద్యోగ రిజర్వేషన్‌పై కొన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఆక్రోశం వెలిబుచ్చడం తగదని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన పోలీస్ కానిస్టేబుల్ నియామకంలో ఈడబ్ల్యుఎస్ వర్గాలకు తక్కువ మార్కులకు ఉద్యోగాల ఎంపిక య్యారని ఆరోపిస్తూ.. విమర్శించడం సరికాదన్నారు. గత 70 ఏళ్ల నుంచి 90 మార్కులు సాధించిన విద్య, ఉద్యోగ అవకాశాలు రాని నేపథ్యంలో ఏనాడు ఇతర వర్గాలను ఓసీలు నిందించలేదన్నారు. ఇతర వర్గాల రిజర్వేషన్లకు నష్టం కలగకుండా కేవలం అగ్రవర్ణాల్లోని పేదలకు ఉద్యోగ అవకాశాలు వస్తే ఇతర వర్గాలకు ఏమి నష్టమో స్పష్టం చేయాలని ఆయన పేర్కొన్నారు. సామాజిక వివక్షత అంతరించి ఆర్థిక వివక్షత కొనసాగుతున్న నేపథ్యంలో ఆర్థిక వెనుకబాటు ఆధారంగా రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించిన ఈ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని ఆయన తెలిపారు. మేజర్ జనరల్ సిన్హా నివేదిక ఆధారంగా పార్లమెంటులో చట్టం ద్వారా కల్పించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను వ్యతిరేకిస్తే సమాజంలో సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

బీజేపీలోకి కొత్త మనోహర్‌రెడ్డి ..?

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ బహిష్కృత నేత కొత్త మనోహర్‌రెడ్డి బీజేపీలో చేరనున్నారా? అంటే అవుననే అంటున్నారు సన్నిహితులు. ఇప్పటికే బీజేపీకి చెందిన కొంత మంది పెద్దలు ఆయన్ను సంప్రదించినట్లు తెలిసింది. ఇందుకు ఆయన సుముఖతను వ్యక్తం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇటీవల ఆయన బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేశారనే ఆరోపణలపై ఆయన్ను ఆ పార్టీ నుంచి బహిష్కరించారు. ప్రస్తుతం ఆయన బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

భర్త చేతిలో భార్య హతం

మద్యం మత్తులో దారుణం



యాదగిరి, రేణుక దంపతులు (ఫైల్)

జవహర్‌నగర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి భార్యపై విచక్షణరహితంగా దాడి చేసి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంబేడ్కర్‌నగర్‌లో నివాసం ఉంటున్న సద్దుల రేణుక (30), సద్దుల యాదగిరి 20 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న యాదగిరి తరచూ ఆమెతో గొడవ పడుతుండటంతో వారి పిల్లలు వారి అమ్మమ్మ ఇంటికి వెళ్లిపోయారు. ఈ నెల 8న రాత్రి గొడవ జరగడంతో మద్యం మత్తులో ఉన్న యాదగిరి సుత్తికర్రతో రేణుకపై తీవ్రంగా దాడి చేయడంతో ఆమె అపస్మారకస్థితికి చేరుకుంది. ఉదయం వరకు ఆమె లేవకపోవడంతో యాదగిరి తన కుమారుడు విష్ణుకు సమాచారం అందించాడు. దీంతో వారు రేణుకను గాంధీ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హైజాక్ కలకలం

- టేకాఫ్‌కు అరగంట ముందు దుబాయ్ విమానాన్ని హైజాక్ చేస్తున్నట్లు మెయిల్
- అధికారుల తనిఖీలు.. విమానం రద్దు
- ప్రత్యామ్నాయ విమానాల్లో ప్రయాణికుల తరలింపు
- ముగ్గురిని పోలీసులకు అప్పగించిన ఎయిర్‌పోర్టు అధికారులు
- ఓ మహిళ పంపిన తప్పుడు సందేశంగా గుర్తించినట్లు సమాచారం

శంషాబాద్: ఓ తప్పుడు ఈ మెయిల్ సందేశంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కలకలం రేగింది. మరి కొద్ది నిమిషాల్లో టేకాఫ్ తీసుకునే విమానం సైతం రద్దు కావడంతో ప్రయాణికులు ఇక్కట్ల పాలయ్యారు.. వివరాల్లోకి వెళితే.. ఆదివారం రాత్రి 8 గంటలకు ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ-951 విమానం 111 మంది ప్రయాణికులతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్లేందుకు సిద్ధమైంది. మరికాసేపట్లో టేకాఫ్ తీసుకునే సమయంలో ఎయిర్‌పోర్టుకు ఈ మెయిల్‌లో ఓ సందేశం వచ్చింది. అందులో బాదినేని తిరుపతయ్య అనే వ్యక్తి ఐఎస్ఐకు ఇన్‌ఫార్మర్‌గా ఉన్నాడని అతడు కాసేపట్లో విమానాన్ని హైజాక్ చేయనున్నాడని సాధ్యమైతే వెంటనే అతడిని ఆపాలని పేర్కొన్నారు. అంతేకాకుండా అతడికి సహకరించే వ్యక్తులు కూడా ఉన్నట్లు తెలిపారు. దీంతో అప్రమత్తమైన భద్రతాధికారులు వెంటనే బాంబ్ స్క్వాడ్ బృందంతో విమానంలోకి వెళ్లి ప్రయాణికులందరి తనిఖీ చేశారు. ప్రయాణికులను అందులోంచి దించి వేసి, విమానాన్ని రద్దు చేసినట్లు ప్రకటించారు. మెయిల్‌లో పేర్కొన్న తిరుపతయ్యతో పాటు వినోద్‌కుమార్, రాకేష్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరు ముగ్గురు నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. దుబాయ్ మీదుగా వీరు ఇరాక్ వెళుతున్నట్లు సమాచారం. తిరుపతయ్యతో సన్నిహితంగా ఉండే ఓ మహిళే అతడి ప్రయాణాన్ని అడ్డుకునేందుకు మెయిల్ పంపినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. మొత్తం మీద మెయిల్ ఉన్న సమాచారం నిజం కాదని నిర్ధారించుకున్నారు. ఎక్కడి నుంచి వచ్చింది...? ఎవరు పంపారు..? అనే దానిపై దర్యాప్తు చేపడుతున్నారు. మెయిల్ పంపిన వ్యక్తులను అరెస్ట్ చేసేందుకు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ రాంచందర్‌రావు తెలిపారు.

కోడ్‌తో కూల్‌గా..

- ఊపిరి పీల్చుకున్న పోలీసు అధికారులు
- ఇప్పటి వరకు వెంటాడిన 'బదిలీ' భయం

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల నగారా మోగిందంటే సాధారణంగా పోలీసు విభాగానికి పని భారం పెరుగుతుంది. అయితే ఈసారి మాత్రం ఎలక్షన్ కోడ్ అమలులోకి రావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అనేక మందిని వెంటాడుతున్న 'రాజకీయ బదిలీ'ల భయమే దీనికి కారణం. అయితే మరోపక్క ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అడ్డుపెట్టుకుని జరిగిన బదిలీల వ్యవహారంపై ఎన్నికల సంఘం (ఈసీ) ఎలా స్పందిస్తుందనే అంశంపై మరికొందరిలో టెన్షన్ నెలకొంది. ఈసారి ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఒకే పోస్టులో నిర్ణీత కాలం కంటే ఎక్కువ పని చేయడంతో పాటు పదోన్నతుల కారణంగా భారీ స్థాయిలో పోలీసుల బదిలీలు జరిగాయి. స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా ఉండే ఎస్ఐ, ఇన్‌స్పెక్టర్ పోస్టుల నుంచి నాన్-కేడర్ ఎస్పీల వరకు అన్నింటిలోనూ రాజకీయ నాయకుల ప్రమేయం అనివార్యంగా మారింది. స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు ఇచ్చిన సిఫార్సు లేఖలు, వారి ప్రోద్బలంతోనే క్షేత్రస్థాయి అధికారులకు పోస్టింగ్స్ లభించాయి. ఇంత వరకు బాగానే ఉన్నా..ఈ తర్వాత అనూహ్యంగా కొన్ని పరిణామాలు చోటు చేసుకున్నాయి. అధికార పార్టీ అభ్యర్థుల ప్రకటన తర్వాత ఎప్పటిలాగే అసంతృప్తులు తయారయ్యారు. బుజ్జగింపుల పర్వం బెడిసికొట్టిన ప్రాంతాల్లోని నాయకులు పార్టీలు మారడం తదితరాలు చోటు చేసుకున్నాయి. సాధారణంగా ఈ ప్రభావం ఆయా కార్యకర్తలపై ఉండాలి. అయితే ఈసారి పోలీసులపై తీవ్ర ప్రభావం చూపింది. ఎవరి సిఫార్సు, ప్రోద్బలంతో ఓ అధికారికి పోస్టింగ్ వచ్చిందో... వాళ్ళు పార్టీ మారడంతో సదరు అధికారికీ మార్పిడి తప్పలేదు. రాజధానిలోని రాచకొండ కమిషనరేట్‌లో ఇద్దరు ఏసీపీలు, కొందరు ఇన్‌స్పెక్టర్లపై ఈ తరహా వేటులే పడ్డాయి. కేవలం పార్టీ మారడమే కాదు... ఓ నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి మారి ప్రస్తుత ఎమ్మెల్యేకి కాకుండా మరొకరికి టిక్కెట్ వచ్చింది. అక్కడి ఓ ఠాణాలో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్ సిట్టింగ్ ఎమ్మెల్యే సిఫార్సుతో వచ్చారని, ఆయనకే వత్తాసు పలుకుతారని ప్రస్తుతం అభ్యర్థి భావించారు. దీంతో ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి మరీ ఇన్‌స్పెక్టర్‌ను బదిలీ చేయించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఎప్పుడు అమలులోకి వస్తుందా అని పోలీసులే ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

కారణం ఉంటేనే బదిలీ..

కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో సోమవారం నుంచి కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో ఏ అధికారిని అయినా బదిలీ చేయాలంటే దానికి స్పష్టమైన కారణం ఉండాల్సిందే. ఎన్నికల సంఘం అనుమతి తీసుకున్న తర్వాతే వారిని బదిలీ చేయాల్సి ఉంటుంది. దీంతో చాలా మంది క్షేత్ర స్థాయి అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా... కోడ్ అమలులోకి వచ్చి, అడ్మినిస్ట్రేషన్ దాదాపుగా ఈసీ చేతుల్లోకి వెళ్ళిపోవడంతో సిఫార్సులు, సామాజిక వర్గం కోణం, రాజకీయ నాయకులకు విధేయత ప్రాధాన్యంగా సాగిన పోలీసు బదిలీలపై స్పందన ఎలా ఉంటుందనే టెన్షన్ మరికొందరు అధికారుల్లో నెలకొంది. ఇలా కొత్త స్థానాల్లోకి వచ్చిన అధికారులతో ఎన్నికల ప్రక్రియ పాదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించడం సాధ్యం కాదని ఈసీ భావిస్తే ప్రక్షాళన తప్పదని.. అప్పుడు ఎవరిపై ఎలాంటి చర్యలు ఉంటాయో అనే టెన్షన్ వీరిలో కనిపిస్తోంది.

క్లుప్తంగా...

బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా సతీష్



సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్ ఠాణా స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఇన్‌స్పెక్టర్‌గా పోలిశెట్టి సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు కొత్వాల్ సీవీ ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయనతో పాటు మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లుకు పోస్టింగ్ ఇచ్చారు. 15 నెలలుగా బంజారాహిల్స్‌లో విధులు నిర్వర్తించిన ఎం.నరేందర్ ×మామూళ్ల కేసు× ఏసీబీకి చిక్కారు. ఆ విభాగం నుంచి అందిన నివేదిక ఆధారంగా కమిషనర్ నరేందర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. నగర నిఘా విభాగమైన స్పెషల్ బ్రాంచ్‌లోని పాస్‌పోర్ట్స్ వెరిఫికేషన్ సెల్‌లో విధులు నిర్వర్తిస్తున్న సతీష్ గతంలో చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. ఎస్ఐగా నిజామాబాద్ రేంజ్‌లోని ఎనిమిది ఠాణాలకు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. మరోపక్క ఇటీవల రిపోర్ట్ చేసిన ఎం.రవికుమార్‌కు ఎస్బీలో పోస్టింగ్ ఇచ్చిన ఆనంద్, షేక్ అన్వర్ పాషాను సైదాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

సర్కిల్-19 డీసీగా సేవా ఇస్లావత్



వెంగళరావునగర్: జీహెచ్ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్‌గా సేవా ఇస్లావత్ నియమతులయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సర్కిల్-19 డీఎంసీగా ఎ.రమేష్ అత్యధిక కాలం విధులను నిర్వహించారు. ఆయన బదిలీపై కూకట్‌పల్లి సర్కిల్‌కు వెళ్లారు. రెండు నెలల కిందట ఇదే సర్కిల్‌కు ఉప కమిషనర్‌గా చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆయనను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నిజామాబాద్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన సేవా ఇస్లావత్‌ను సర్కిల్-19కు ఉప కమిషనర్‌గా నియమించారు. నూతనంగా డీఎంసీగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆయనను జీహెచ్ఎంసీ సర్కిల్‌లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అభినందించారు.

బతుకమ్మ చీరల పంపిణీ



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 11లోని గౌరీశంకర్ కాలనీ కమ్యూనిటీ హాల్ సోమవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు.

కాంగ్రెస్ భరోసా కార్డుల పంపిణీ



బంజారాహిల్స్: గురుబ్రహ్మ నగర్ బస్తీలో సోమవారం ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఇంటి ఇంటికి భరోసా కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడే కాటూరి రమేష్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు అశోక్ కుమార్, నేతలు అంజి, పాపయ్య, సత్యనారాయణ మంగమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వెంగళరావునగర్: మానసిక పరిస్థితి సరిగా లేని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... డి.నిరంజన్‌రెడ్డి(59) అనే వ్యక్తి మధురానగర్‌కాలనీ జి-66 విష్ణుకృష్ణ క్లాసిక్ అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్నాడు. ఇతని మానసికస్థితి సరిగా లేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం బాత్రూంకు వెళ్లి లోపల గడియ పెట్టుకున్నాడు. అనుమానించిన భార్య వసుధ తలుపు తట్టినా సమాధానం లేదు. సెక్యూరిటీ గార్డుతో పాటు చుట్టుపక్కల వారిని పిలిచి బాత్రూం తలుపు గడియ పగలకొట్టి చూడగా అప్పటికే నిరంజన్‌రెడ్డి ఆయన టవల్‌తో ఎగ్జాస్ట్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉన్నాడు. సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించడంతో పరీక్షించిన వైద్యులు నిరంజన్‌రెడ్డి మృతిచెందినట్టు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

పంజగుట్ట: రాష్ట్ర వ్యాప్తంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధీనంలో ఉన్న పోస్ట్ మెట్రిక్ (హయ్యర్ ఎడ్యుకేషన్) కాలేజీల్లోని హాస్టల్స్‌లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్సీ స్టూడెంట్స్ హాస్టల్ ఆర్గనైజేషన్ విజ్ఞప్తి చేసింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ముప్పరీ కుమార్, అడ్వైజరీ కమిటీ చైర్మన్ మల్లేశంలు మాట్లాడుతూ... ఎస్సీ హాస్టల్స్‌లో విద్యార్థులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా డైట్ చార్జీలు విడుదల చెయ్యకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల జియోట్యాగ్!

ఎన్నికల షెడ్యూల్ విడుదలతో అప్రమత్తం

తెలంగాణ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఉదయం ప్రకటించింది. ఆ క్షణం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. నవంబర్ 30వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని, డిసెంబర్ 3న ఫలితాలు వెలువడిస్తున్నట్లు షెడ్యూల్‌లో తెలిపారు. దీంతో ఎన్నికలకు అధికారులు సమాయాత్తం అవుతున్నారు. ఇప్పటికే జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లను, పోలింగ్ స్టేషన్లకు దారితీసే ప్రాంతాల రూట్‌మ్యాప్‌ను ఎన్నికల అధికారులు జియోట్యాగ్ చేశారు.

బంజారాహిల్స్: ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏ నియోజకవర్గం పోలింగ్ స్టేషన్లు ఎన్ని వస్తాయి.. ఆ ప్రాంతాల్లో గత పోలింగ్ రోజున జరిగిన ఘటనలను నివేదిక రూపంలో సమర్పించారని పోలీసులకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో పోలింగ్ స్టేషన్ల వద్ద గత ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న ఘటనలను పోలీసులు ఆరా తీస్తున్నారు. మరోవైపు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు.

- మరోవైపు పలు రాజకీయ పార్టీల్లో ఎన్నికల సందడి మొదలైంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రధానంగా ఈ నియోజకవర్గాల్లో పోటీ పడుతున్నాయి. బీఆర్ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా గత రెండు నెలలుగా ఆ పార్టీ అభ్యర్థులు జనంలోకి దూసుకెళ్లి ప్రభుత్వ పథకాలను ముమ్మరంగా ప్రచారం చేసుకున్నారు.

ఖైరతాబాద్ నియోజకవర్గం...

ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్ హిమాయత్‌నగర్ తదితర ఆరు డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 245 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి.

- ప్రస్తుతం నియోజకవర్గ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి దానం నాగేందర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన అభ్యర్థిత్వాన్ని సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఇప్పటికే ప్రకటించారు.
- ఇంకా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఆయా పార్టీలు ప్రకటించలేదు. కాంగ్రెస్ నుంచి ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి, పి. విజయారెడ్డి పోటీ పడుతున్నారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి టిక్కెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

ఖైరతాబాద్ ముఖచిత్రం..



మొత్తం ఓటర్లు	2,89,558
పురుషులు	1,50,892
మహిళలు	1,38,639
థర్డ్ జెండర్	27
ఎన్ఆర్ఐ ఓటర్లు	90
పురుషులు	59
మహిళలు	31
సర్వీస్ ఓటర్లు	22
పురుషులు	19
మహిళలు	3
దివ్యాంగులు	1508
పురుషులు	880
మహిళలు	628

- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో రాజకీయ సందడి షురూ
- తక్షణమే అమల్లోకి ఎన్నికల కోడ్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం...

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధి కిందకు షేక్‌పేట, ఎర్రగడ్డ, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, బోరబండ, వెంగళరావునగర్ తదితర ఆరు డివిజన్లు వస్తాయి. వీటి పరిధిలో 329 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. నియోజకవర్గం ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపీనాథ్ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన అభ్యర్థిత్వాన్ని సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఆ పార్టీలు ఇంకా ప్రకటించలేదు. కాంగ్రెస్ టిక్కెట్ కోసం మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, టీమ్ ఇండియా మాజీ కెప్టెన్, టీపీసీసీ ముఖ్యనేత మహ్మద్ అజహరుద్దీన్, మాజీ కార్పొరేటర్ మురళీగౌడ్ పోటీ పడుతున్నారు. బీజేపీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ డాక్టర్ వీరపనేని పద్మ, జూటూరి కీర్తిరెడ్డి, ఆలపాటి లక్ష్మీనారాయణ, లంకల దీపక్‌రెడ్డి, కుంబాల గంగరాజు పోటీ పడుతున్నారు.

జూబ్లీహిల్స్ ముఖచిత్రం



మొత్తం ఓటర్లు	3,75,430
పురుషులు	1,98,204
మహిళలు	1,77,207
ఇతరులు	19
ఎన్ఆర్ఐ ఓటర్లు	87
పురుషులు	70
మహిళలు	17
సర్వీసు ఓటర్లు	22
పురుషులు	18
మహిళలు	4
దివ్యాంగులు	1994
పురుషులు	1153
మహిళలు	841

'కోడ్' కూయకముందే శంకుస్థాపనలు



వినాయకనగర్‌లో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దానం, కార్పొరేటర్ వెంకటేష్

- ఎమ్మెల్యే దానం సుడిగాలి పర్యటన
- రూ. 3 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం

ఫిలింనగర్: మరికొద్దిసేపట్లో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందనగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ బస్తీల్లో రూ. 3 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సోమవారం ఉదయం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో కలిసి ఫిలింనగర్‌లోని గౌతంనగర్ బస్తీ నుంచి పాదయాత్ర నిర్వహించి బాల్‌రెడ్డినగర్, వినాయకనగర్, దుర్గా భవానీనగర్, భగత్‌సింగ్‌కాలనీ, జ్ఞానిజైల్‌సింగ్‌నగర్, రోడ్ నెం 9 అంబేద్కర్ నగర్, బసవతారకంనగర్, జూబ్లీహిల్స్ రోడ్ నెం. 46 అంబేద్కర్ నగర్ బస్తీల్లో సీవరేజి, మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే నాలుగు బోట్ల పవర్‌బోర్‌వెల్‌నిర్మాణ పనులకు కూడా ఆయన శంకుస్థాపన చేశారు. కోడ్ కొద్దిసేపట్లో అమల్లోకి వస్తుందనగానే ఆయన హడావుడిగా ఈ అభివృద్ధి పనులను ప్రారంభించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు.

శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులివే...

ఫిలింనగర్ బస్తీల్లో ఎన్నో ఏళ్లుగా స్థానికులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యకు చెక్ పెట్టేందుకు భారీగా నిధులు మంజూరు చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సోమవారం ఈ పనులకు శంకుస్థాపన చేశారు. వినాయకనగర్ బస్తీలో రూ. 15.50 లక్షల వ్యయంతో సీవరేజి పైప్‌లైన్, స్వామి వివేకానందనగర్ బస్తీలో రూ. 11.95 లక్షల వ్యయంతో మంచినీటి పైప్‌లైన్, బీజేఆర్‌నగర్‌లో రూ. 14 లక్షల వ్యయంతో సీవరేజి పైప్‌లైన్, అంబేద్కర్‌నగర్‌లో రూ. 14 లక్షల వ్యయంతో మంచినీటి పైప్‌లైన్, రూ. 12.20 లక్షల వ్యయంతో సీవరేజి పైప్‌లైన్లు, దుర్గా భవానీనగర్‌లో రూ. 12 లక్షల వ్యయంతో సీవరేజి పైప్‌లైన్ పనులకు, బసవతారకంనగర్‌లో రూ. 14 లక్షల వ్యయంతో సీవరేజి పైప్‌లైన్ పనులకు జ్ఞానిజైల్‌సింగ్ నగర్‌లో రూ. 13.30 లక్షల వ్యయంతో సీవరేజి పైప్‌లైన్ పనులకు, భగత్‌సింగ్ కాలనీలో రూ. 19 లక్షల వ్యయంతో సీవరేజి పైప్‌లైన్ పనులకు, బండారు బాల్‌రెడ్డి నగర్‌లో రూ. 5.70 లక్షల వ్యయంతో సీవరేజి పైప్‌లైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ ప్రారంభం



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపీనాథ్

రహమత్‌నగర్: పేదలు శుభకార్యాలు చేసుకోవడానికి కమ్యూనిటీ హాల్ ఎంతో ఉపయోగపడుతుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. రహమత్‌నగర్ డివిజన్ హబీబ్‌ఫాతీమా నగర్ ఫేజ్-2లో రూ. 3.25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ... పేదలు అత్యధికంగా నివాసం ఉండే ఎస్పీఆర్‌హిల్స్‌లో కమ్యూనిటీ హాల్ లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఏసీ సదుపాయం ఉన్న ఈ కమ్యూనిటీ హాల్‌లో అన్నిరకాల శుభకార్యాలను పేదలు ఉచితంగా నిర్వహించుకోవచ్చన్నారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నజీర్, ఫయాజ్, జాఫర్ హుస్సేన్, గనీ, రాకేష్, నాగరాజు, అరుణ్‌కుమార్, శ్రీనివాస్,సయ్యద్ బషీర్, వేముల జగన్, షేక్‌చోటు, విలియమ్స్, జబ్బార్, సమీనా, ధనూజ, స్రవంతి, విజయ్‌కిరణ్, గోపీచంద్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



మానస

వెంగళరావునగర్: తాను డ్యూటీకి వెళ్లగానే భార్య ఇంటి నుంచి అదృశ్యమైందని ఓ వ్యక్తి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల సమాచారం మేరకు... జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా చింతల్‌పల్లి గ్రామానికి చెందిన నాగుల రాజ్‌కుమార్, చిట్యాలకు చెందిన మానస దంపతులు. వారు జవహర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 8న ఉదయం 11.30 గంటల సమయంలో తాను షాపింగ్‌కు వెళ్లాలని, డబ్బులు కావాలని మానస తన భర్తను అడిగింది. దాంతో రాజ్‌కుమార్ ఆమెకు రూ. 3500 ఇచ్చి మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లాడు. రాత్రి 9.30 గంటల సమయంలో తన పక్కింట్లో ఉంటున్న వ్యక్తి తన భార్య ఇంటికి తాళం వేసి వెళ్లిపోయిందని అతనికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. దాంతో హుటాహుటిన ఇంటికి వచ్చి చూడగా ఆమె తనకు చెందిన లగేజీతో వెళ్లిపోయినట్టుగా గ్రహించాడు. వెంటనే ఆమెకు ఫోన్ చేయగా అది స్విచ్ ఆఫ్ వస్తుంది. అతను విచారించి సీసీ టీవీలో పరిశీలించగా సాయంత్రం దాదాపు 5.19 గంటల సమయంలో తన భార్య ఇంటి నుంచి వెళ్లిపోయినట్టుగా గ్రహించాడు. అంతగాకుండా 5.30 సమయంలో పక్క ఇంట్లో ఉండే సంతోషి అనే మహిళకు తన భార్య వేరే నెంబర్ నుంచి ఫోన్ చేసినట్టుగా తెలుసుకున్నాడు. ఈ మేరకు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అంతర్గత రహదారుల్లో తొలగించని ఫ్లెక్సీలు





ఎన్టీఆర్‌నగర్‌లో కనిపిస్తున్న రాజకీయ నేతలు ఫ్లెక్సీలు

బంజారాహిల్స్: ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే రాజకీయ పార్టీల నేతలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు గోడ పత్రికలను జీహెచ్ఎంసీ తొలగించాల్సి ఉంటుంది.

సోమవారం ఉదయం కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత కూడా జీహెచ్ఎంసీ అధికారులు మేల్కొనలేదు. గత కొంత కాలంగా రోడ్లకు రెండువైపులా ప్రధాన చౌరస్తాల్లో వివిధ పార్టీల ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. కనీసం షెడ్యూల్ విడుదలైన తర్వాత కూడా వీటిని తొలగించాలన్న సోయి అధికారుల్లో కరువైంది. జీహెచ్ఎంసీతో పాటు ఈవీడీఎం, డీఆర్‌ఎఫ్‌లో నెలకొన్న నిర్లక్ష్యం ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఉంది.

సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం: చింతల




చింతలబస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే చింతల

ఖైరతాబాద్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు పూర్తిగా విఫలమయ్యారని తెలంగాణ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం బూత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా చింతలబస్తీలో ఆయన పర్యటించారు.

ఎమ్మెల్యే, కార్పొరేటర్లు గెలిచిన తరువాత ఒక్కసారి కూడా తమ సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు ఆవేదన్య వ్యక్తం చేశారని తెలిపారు. రోడ్డు సౌకర్యం సరిగా లేక, మరో పక్క దోమలు, ఈగలతో రాత్రిళ్లు ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొటున్నారని అన్నారు. కనీసం దోమల మందు ఫాగింగ్ కూడా చేయడం లేదని చింతల రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఆదర్శ్, వీణామాధురి, రామ్మోహన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సిటీలో సేజ్ బ్రూక్ అకాడమీ



బంజారాహిల్స్: లండన్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక విట్‌గిఫ్ట్ స్కూల్ భాగస్వామ్యంతో నగరానికి చెందిన సింబిక్వెస్ట్ ఎడ్యుకేషన్ సంస్థ ఇక్కడ సేజ్‌బ్రూక్ అకాడమీని స్థాపించేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. సోమవారం పార్క్ హయత్ హోటల్‌లో ఇరు పక్షాల ప్రతినిధులు అధికారికంగా భాగస్వామ్య ఒప్పందంపై సంతకాలు చేశారు. అలాగే లోగో ఆవిష్కరించారు. అద్భుతమైన విద్యా ప్రయాణానికి పునాది వేసిన ఈ కార్యక్రమంలో సేజ్‌బ్రూక్ అకాడమీ వ్యవస్థాపక-డైరెక్టర్ ప్రవీణ్ రాజు, బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, విట్ గిఫ్ట్ స్కూల్ ముఖ్య సభ్యులు హెడ్‌మాస్టర్ క్రిస్ రామ్‌సే, ఇంటర్నేషనల్ సబ్-కమిటీ చైర్‌పర్సన్ ఆసిఫ్ పటేల్, ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డేవిడ్ బేట్స్ మరియు గ్లిట్ ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ అడ్వైజర్ విపుల్ భార్గవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రాజు మాట్లాడుతూ... సేజ్‌బ్రూక్ అకాడమీ కేవలం పాఠశాల విద్య కంటే నైపుణ్యానికి ఎక్కువ ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. కొల్లూరు/వెలిమెలలో ఈ పాఠశాల ఆగస్టు 2025లో ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమీషనర్ గారెత్ విన్ ఓవెన్ మాట్లాడుతూ యూకే, భారత్ మధ్య విద్యా భాగస్వామ్యం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్..

వివాహిత అదృశ్యం



తస్లీమా

ఫిలింనగర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... షేక్‌పేట సమీపంలోని మారుతినగర్‌లో నివసించే తస్లీమా(23) ఈ నెల 7వ తేదీన తెల్లవారుజామున ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. భర్త షేక్ సయ్యద్ హుస్సేన్ అన్ని ప్రాంతాలు గాలించినా ఫలితం లేకపోవడంతో తన భార్య కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87126 61497లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని గాలింపు చేపట్టారు.

బంగారం దుకాణంలో చోరీ

బంజారాహిల్స్: తాము పని చేస్తున్న బంగారం దుకాణంలో చోరీకి పాల్పడ్డ ముగ్గురు సిబ్బందిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు... బంజారాహిల్స్ రోడ్ నెం. 3లో ఉన్న మలబార్ గోల్డ్ దుకాణంలో కొంత కాలంగా అమిత్ మాలిక్, చిపాల్ తృతీసాయి కిరణ్, తపాస్ మాలిక్‌లు గోల్డ్ స్మిత్‌లుగా పని చేస్తున్నారు. కొంత కాలంగా ఈ ముగ్గురూ విధులకు హాజరుకాకపోవడంతో అనుమానం వచ్చిన యశ్‌పాల్ ఈ ముగ్గురి సామగ్రి, ఆభరణాలకు సంబంధించిన బాక్సులను తెరిపించారు. అందులో 64 గ్రాముల బంగారం తక్కువగా ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ రూ. 2.20 లక్షలు ఉంటుందని ఈ ముగ్గురే బంగారం చోరీ చేశారని చర్యలు తీసుకోవాలంటూ ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ దగ్ధం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లో ఓ బైక్ దగ్ధమైంది. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నివసించే బి. రమేష్ ఎఫ్‌సీఐలో ఉద్యోగి. సోమవారం ఉదయం మాదాపూర్ నుంచి జూబ్లీహిల్స్ వైపు తన పల్సర్ బైక్ (ఏపీ 26ఏఆర్ 0847)పై వస్తుండగా పెట్రోల్ ట్యాంకు నుంచి మంటలు వచ్చాయి. ఆందోళన చెందిన ఆయన వెంటనే బైక్‌ను పక్కన పార్కింగ్ చేసిన కొద్దిసేపటికీ ఒక్కసారిగా మంటల్లో బైక్ దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది వచ్చేసరికే బైక్ పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డైరెక్టర్ క్రిష్ ఆఫీస్‌లో సామగ్రి ధ్వంసం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని మిథిలానగర్‌లో ఉన్న సినీ దర్శకుడు క్రిష్ ఆఫీస్ ఎదుట టీఎస్ 01ఈజీ 0009 కారు గత కొంత కాలంగా అక్రమంగా పార్కింగ్ చేసి ఉంది. రెండు రోజుల క్రితం ఈ కారు టైర్ పంక్చర్ కావడంతో కారు యజమాని తామే ఈ కారు టైర్ పంక్చర్ చేశామని ఆరోపిస్తూ అసభ్యంగా దూషించాడని డైరెక్టర్ క్రిష్ ఆఫీస్ మేనేజర్ తాళ్లపల్లి రాజు బంజారాహిల్స్ పోలీసులకు పిర్యాదు చేశారు. ఆదివారం సాయంత్రం కూడా ఈ కారు యజమానురాలు తమ ఆఫీస్‌లోకి వచ్చి సిబ్బందిని అసభ్యంగా దూషిస్తూ పూల కుండీలు పగలగొట్టి కిటికీలు ధ్వంసం చేసి రాళ్లతో దాడి చేసి న్యూసెన్స్ చేశారని, తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతూ ఇష్టానుసారంగా ప్రవర్తించారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ కారు యజమానురాలిపై బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ సెక్షన్ 427, 448 కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాతృభాషలో నేర్చుకుంటే మరింత పరిజ్ఞానం

హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ



మాట్లాడుతున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

పంజగుట్ట: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నూతన విద్యావిధానం తీసుకొచ్చి ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యను కూడా మాతృభాషలో చదువుకునే అవకాశం కల్పించారని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మాతృభాషలో నేర్చుకుంటే పరిజ్ఞానం ఇంకా పెంపొందించుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రజాడైరీ 23వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సమాజంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి సన్మానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన దత్తాత్రేయ మాట్లాడుతూ... సమాజహితం కోరే వారిని సన్మానించడం ఎంతో సంతోషకరమన్నారు. రాజకీయం అంటే కేవలం పరిపాలనే కాదని మిగతా అన్ని రంగాలు కలిస్తేనే సంపూర్ణ సమాజంగా పరిగణిస్తుందన్నారు. రాజకీయ నాయకులు ఇచ్చే ప్రతి పథకం వారి జేబుల్లోంచి ఇస్తున్నది కాదని, ప్రతి పైసా సంమాజంలోని అన్ని వర్గాల వారి నుంచి వసూలు చేస్తున్న పన్నుల వల్లే ఇస్తున్నారనే విషయాన్ని గ్రహించాలన్నారు. ప్రముఖ సినీ నటుడు శివాజీరాజా మాట్లాడుతూ... అన్ని రంగాల్లో 100 శాతం పరిపూర్ణత సాధించిన వ్యక్తి బండారు దత్తాత్రేయ అన్నారు. ఈ సందర్భంగా ప్రజాడైరీ ఎడిటర్ సురేష్‌తో కలిసి ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో ప్రముఖుడిగా పేరొందిన డేవిడ్ రాజును సన్మానించారు. కార్యక్రమంలో సినీనటుడు చంద్రకాంత్, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పర శ్రీనివాస్‌గుప్తా, తిరుమల బ్యాంక్ చైర్మన్ చంద్రశేఖర్, స్వర్ణలత, ముఖేష్, సైంటిస్ట్ రమేష్, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.




విజయవాడలో జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన ప్రతినిధులకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

మన పొత్తు ప్రజలతోనే..

వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభలో ముఖ్యమంత్రి జగన్

- పొత్తుల కోసం విపక్షాల వెంపర్లాట.. సున్నాలు ఎన్ని కలిసినా ఫలితం సున్నానే
- విశ్వసనీయత లేని చంద్రబాబు జనంలో ఉన్నా జైల్లో ఉన్నా ఒకటే
- పార్టీ పెట్టి 15 ఏళ్లవుతున్నా బాబును భుజాన మోయడమే పార్ట్‌నర్ జీవితం

సాక్షి, అమరావతి: ఎన్నికల సంగ్రామంలో తమ పొత్తు ప్రజలతోనేనని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. పొత్తుల కోసం ప్రతిపక్షాలు వెంపర్లాడుతున్నాయని.. రెండు సున్నాలు కలిసినా, నాలుగు సున్నాలు కలిసినా వచ్చే ఫలితం సున్నానేనంటూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై వ్యంగ్యోక్తులు విసిరారు. 'మీ బిడ్డ పొత్తుల మీద ఆధారపడడు. దేవుడ్ని.. ఆ తర్వాత ప్రజలనే నమ్ముకుంటాడు. కాబట్టి మన పొత్తు నేరుగా ప్రజలతోనే' అని పేర్కొన్నారు. దేవుడి దయతో ప్రజలకు మనం చేసిన మంచే మన బలమని.. మన ధైర్యం.. మన ఆత్మవిశ్వాసమని స్పష్టం చేశారు. సోమవారం విజయవాడలోని మునిసిపల్ స్టేడియంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభలో సీఎం జగన్ ప్రసంగించారు.

ఇంటింటికీ వెళ్లిన పార్టీ మనదే..

ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన 99 శాతం వాగ్దానాలను అమలు చేసిన ప్రభుత్వం మనది. సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించిన ప్రభుత్వం మనది. ఇదే మన ధైర్యం. దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో రాష్ట్రంలో 87 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించిన ప్రభుత్వం మనది. ఇలాంటివన్నీ సాధ్యపడతాయని ఎవరైనా కలలోనైనా అనుకున్నారా? ఎక్కడా లంచాలు, వివక్షకు తావు లేకుండా, అర్హతే ప్రామాణికంగా మీ బిడ్డ బటన్ నొక్కగానే ఆర్థిక సహాయం అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి నేరుగా వస్తుందని ఎవరైనా అనుకున్నారా? అలాంటి విప్లవాత్మక చర్యలు మన సొంతం. నవరత్నాల్లోని ప్రతి సంక్షేమ పథకం అమలూ ఒక విప్లవమే. ఎన్నికల మేనిఫెస్టోను వెంటబెట్టుకుని ఇంటింటికీ వెళ్లి ఇదిగో వీటిని అమలు చేశామంటూ ప్రజల ఆశీర్వాదాన్ని తీసుకున్న పార్టీ దేశ చరిత్రలో ఏదైనా ఉందంటే.. అది వైఎస్సార్ సీపీనే.

చంద్రబాబు అనే వ్యక్తి ప్రజల్లో ఉన్నా జైల్లో ఉన్నా పెద్ద తేడా ఏమీ ఉండదు. ఆయనకు విశ్వసనీయత లేదు. అలాంటి వ్యక్తి ఎక్కడున్నా ఒకటే. చంద్రబాబును, ఆయన పార్టీని చూసినప్పుడు పేదవాడికి, ప్రజలకు గుర్తుకొచ్చేది ఒక్కటే.. మోసాలు, వెన్నుపోట్లు, అబద్ధాలు, వంచనలే.

> "ప్రతిపక్షాలన్నీ పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాయి. రెండు సున్నాలు కలిసినా.. నాలుగు సున్నాలు కలిసినా ఫలితం సున్నానే. ఎన్ని సున్నాలు కలిసినా వచ్చేది పెద్ద సున్నాయే. ఒకరైతే పార్టీ స్థాపించి 15 ఏళ్లవుతున్నా ఇవ్వాళ్టికీ ప్రతి నియోజకవర్గానికి అభ్యర్థి లేడు. ప్రతి గ్రామంలో జెండా మోసే కార్యకర్త లేడు. ఆయన జీవితమంతా చంద్రబాబును భుజానికెత్తుకుని మోయడమే. చంద్రబాబు దోచుకున్నది పంచుకోవడంలో ఆయన పార్ట్‌నర్. వారిద్దరూ కలిసి ప్రజలను ఎలా మోసం చేయాలని ఆలోచిస్తారు. ప్రజలకు మంచి చేయాలనే మనస్తత్వం వారికి లేదు"
>
> – వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభలో సీఎం జగన్

సెక్షన్ 17ఏ నిందితులకు కాదేమో!

ఆ సెక్షన్ నేరం జరిగిన తేదీకి వర్తిస్తుంది

చంద్రబాబు పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు సందేహం

- అవినీతిని నిరోధించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యం
- చట్టం లక్ష్యాన్ని భంగపరిచే వివరణ స్వీకరించలేం
- 17ఏ అనేది నేరం జరిగిన తేదీకే కానీ నిందితులకు కాదు
- విచారణ సందర్భంగా న్యాయమూర్తుల వ్యాఖ్యలు
- సుదీర్ఘ వాదనలు వినిపించిన చంద్రబాబు న్యాయవాది
- బాబు న్యాయవాదికి పలు ప్రశ్నలు సంధించిన ధర్మాసనం
- విచారణ నేటికి వాయిదా
- వాదనలు వినిపించనున్న సీఐడీ న్యాయవాది


సాక్షి, న్యూఢిల్లీ: 'అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్)లోని సెక్షన్ 17ఏ అనేది నేరం జరిగిన తేదీకి వర్తిస్తుంది కానీ నిందితులకు కాదేమో' అని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. చట్టం చేసిన ఉద్దేశాన్ని అర్థం చేసుకోవాలే తప్ప, దానిని తప్పుగా అన్వయించుకోవడానికి వీల్లేదని వ్యాఖ్యానించింది. సవరణలు వచ్చినప్పుడల్లా కొత్తగా మార్పులు వస్తున్నాయని, సెక్షన్ 17ఏ చంద్రబాబు కేసుకు వర్తిస్తుందా అని న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ధర్మాసనం సందేహం వ్యక్తం చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో తనపై సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

సోమవారం చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే వాదనలు వినిపించారు. హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో 2021లో ఎఫ్ఐఆర్ నమోదైందని సీఐడీ పేర్కొందని, అందువల్ల ఈ కేసుకు సెక్షన్ 17ఏ వర్తిస్తుందని ఆయన తెలిపారు. 2018కి ముందే విచారణ ప్రారంభమైందన్న రాష్ట్ర ప్రభుత్వ వాదన సరికాదన్నారు. గతంలో కొంత విచారణ జరిగినట్లు కనిపిస్తున్నా, ఈ ఎఫ్ఐఆర్‌కు, దానికి సంబంధం లేదన్నారు. ప్రభుత్వాలు మారిన తర్వాత వ్యక్తుల్ని లక్ష్యంగా చేసుకొని పెట్టే కేసులను నిరోధించడానికి సెక్షన్ 17ఏను తీసుకొచ్చారన్నారు. 2018 కన్నా ముందే దర్యాప్తు జరిగిందని రుజువు చేసే డాక్యుమెంట్లను ప్రభుత్వం సమర్పించలేదని, ఏసీబీ కోర్టు ముందు కూడా ఉంచలేదని తెలిపారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. మీరు రిమాండ్ రిపోర్టును సవాలు చేస్తున్నారా అని ప్రశ్నించగా.. అవునని సాల్వే బదులిచ్చారు. సీఐడీ సమర్పించిన డాక్యుమెంట్ ద్వారానే దర్యాప్తు మొదలైందని లేదా ఎఫ్ఐఆర్ నమోదైందని భావిస్తే ఆ డాక్యుమెంటును కోర్టు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పీసీ చట్టంలోని 17ఏ పై కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) ప్రకారం ప్రతి దశలోనూ గవర్నర్ అనుమతి తప్పనిసరి అని అన్నారు. ఈ ఎస్వోపీ కోర్టు సమీక్షకు లోబడి ఉండదని, సెక్షన్ 17ఏ ను అర్థం చేసుకోవడానికి సహకరిస్తుందన్నారు. ఈ దశలో జస్టిస్ బేలా ఎం త్రివేది జోక్యం చేసుకొని.. చట్టం లక్ష్యాన్ని భంగపరిచే వివరణలు కోర్టు స్వీకరించదని స్పష్టం చేశారు. ఎస్వోపీని మూడేళ్ల కిందట ప్రకటించారని, అంతకు ముందు సంగతేమిటని, ప్రభుత్వం మారిన తర్వాత రాజకీయ కక్ష అని ఎవరన్నారని జస్టిస్ త్రివేది ప్రశ్నించారు. కేసును పరిశీలిస్తే ఫిర్యాదులో అంశాలు చంద్రబాబుకు వర్తించవన్నారు. ఈ కేసు మొత్తం సీమెన్స్, డిజైన్‌టెక్‌లకు సంబంధించిందన్నారు. డిజైన్‌టెక్ కంపెనీ స్కిల్ టెక్ కంపెనీ నుంచి జీఎస్టీ క్రెడిట్‌లు పొందిందని, దానికి సంబంధించిందే 2021 సెప్టెంబరులోని ఫిర్యాదు అని సాల్వే తెలిపారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ, డిజైన్‌టెక్ ఒప్పందం ఎవరితో చేసుకుందని ప్రశ్నించగా... అప్పటి రాష్ట్ర ప్రభుత్వంతో అని సాల్వే తెలిపారు. దర్యాప్తు ఎప్పుడు ప్రారంభమైందని ధర్మాసనం ప్రశ్నించగా.. 2021 సెప్టెంబరు 7న అని అన్నారు. ఏ ఆధారంతో చెబుతున్నారని ధర్మాసనం తిరిగి ప్రశ్నించింది. అవినీతిని నిరోధించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యమని, చట్టం లక్ష్యాన్ని భంగపరిచే వివరణ స్వీకరించలేమని జస్టిస్ బేలాఎం త్రివేది వ్యాఖ్యానించారు. వాదనలు అయ్యాక దీనికి సంబంధించి ఏవైనా డాక్యుమెంట్లు సమర్పిస్తే వాటిని కౌంటర్ చేసే అవకాశం ఉండదని, అప్పుడు మెరిట్స్ జోలికి వెళ్లకుండా తిప్పి పంపుతామని సాల్వేనుద్దేశించి జస్టిస్ త్రివేది అన్నారు. సెక్షన్ 17ఏ నేరం జరిగిన తేదీతో సంబంధమని హైకోర్టు న్యాయమూర్తి చెప్పినందున తిప్పి పంపటం వల్ల ఎలాంటి ఉపయోగం ఉండదని సాల్వే తెలిపారు. హైకోర్టులో వాదనల తర్వాత ప్రభుత్వం డాక్యుమెంట్లు సమర్పించిందన్నదే పిటిషనర్ వాదన అని, అసలు ఏమీ వినకుండానే కేసు కొట్టేస్తారా అని జస్టిస్ త్రివేది ప్రశ్నించారు.

హైకోర్టులో వాదనలు పూర్తయిన తర్వాత డాక్యుమెంటు సమర్పించామన్న సాల్వే వాదనలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి తప్పుపట్టారు. కేసు రిమాండ్‌లోనే మొత్తం విషయం ఉందని తెలిపారు. ఈ కేసులో రెండు అంశాలు పరిశీలిస్తున్నామని.. ఒకటి హైకోర్టు ముందు సీఐడీ దాఖలు చేసిన డాక్యుమెంట్.. 2018 జులై 5న దర్యాప్తు ప్రారంభమైందని చెప్పే డాక్యుమెంట్ అని జస్టిస్ బోస్ పేర్కొన్నారు. ఇక రెండోది.. హైకోర్టు ముందు వాదన వినిపించడానికి పిటిషనర్ అవకాశం కోల్పోయారా అనే అంశమని జస్టిస్ బోస్ వ్యాఖ్యానించారు. దర్యాప్తు పేరుతో ఒక వ్యక్తిని ఇబ్బంది పెట్టడం చట్టం ఉద్దేశం కాదని సాల్వే అన్నారు. సెక్షన్ 17ఏ సవరణను అవినీతి నిరోధక చట్టం ఉద్దేశంతో చూడాలని, దాని ప్రకారం పబ్లిక్ సర్వెంట్లు అక్రమాలకు పాల్పడకూడదని జస్టిస్ త్రివేది చెప్పారు. చట్టం ప్రధాన ఉద్దేశాన్ని పక్కనపెట్టి ఓ వ్యక్తికి మేలు జరిగేలా చట్టాన్ని విశ్లేషించుకోవడం ద్వారా చట్టం లక్ష్యాన్నే దెబ్బతీస్తుందని జస్టిస్ త్రివేది వ్యాఖ్యానించారు.

ఈ కేసులో చంద్రబాబు పేరు సెప్టెంబరు 2023న చేర్చారని, 37వ నిందితుడుగా ఉన్న చంద్రబాబును ఏ1 అంటున్నారని సాల్వే ఆరోపించారు. దర్యాప్తు అధికారి ప్రకారం ఏ 37 (చంద్రబాబు) సూచనల మేరకు ఏ 36 నేరానికి పాల్పడ్డారని, ఇది అవినీతి నిరోధక చట్టానికి వర్తిస్తుందని చెప్పారని, అదే సమయంలో గవర్నర్ అనుమతి తీసుకొని ఉండాల్సిందని సాల్వే తెలిపారు. సెక్షన్ 17 ఏ సవరణను ఎలాగైనా చూడొచ్చని, అంతకు ముందు జరిగిన నేరాల సంగతేమిటని జస్టిస్ త్రివేది ప్రశ్నించారు. 17ఏ అనేది నేరం జరిగిన తేదీకే కానీ నిందితులకు కాదు కదా అని జస్టిస్ బోస్ ప్రశ్నించారు. సెక్షన్ 6ఏ ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టుపై ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం చెప్పిన అంశాలు చూడాలని, ఇది కూడా 17ఏ సవరణ తరహాలో ఉందని జస్టిస్ త్రివేది వ్యాఖ్యానించారు. ఒక ప్రజా ప్రతినిధి సైకిలు దొంగతనం చేస్తే దాంట్లో జరిగిన అక్రమం తనకు కేటాయించిన విధులకు సంబంధించినదై ఉండాలని, అవినీతి నిరోధక చట్టం వర్తించరాదని సాల్వే పేర్కొన్నారు. అంటే సెక్షన్ పూర్తిగా కాకుండా పైపైన వర్తిస్తుందా అని జస్టిస్ బోస్ ప్రశ్నించారు. ఈ కేసులో పరిపాలన పరమైన అంశాలు ఉన్నాయని, అభియోగాలు చూస్తే పది శాతం అడ్వాన్స్ నిధులు ముందే విడుదల చేశారని ఉందని జస్టిస్ బోస్ పేర్కొన్నారు. అరెస్టు చేసిన విధానం సరికాదు కాబట్టే సెక్షన్ 17ఏ పైనే వాదన చేస్తున్నామని సాల్వే పేర్కొన్నారు. మంగళవారం సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించనున్నారు.

> అవినీతి నిరోధక చట్టానికి చేసిన 17ఏ సవరణను ఏ ఉద్దేశంతో తీసుకొచ్చారో చూడాలి. దీని ప్రకారం పబ్లిక్ సర్వెంట్లు అక్రమాలకు పాల్పడకూడదు. చట్టంలోని ప్రధాన ఉద్దేశాన్ని పక్కనపెట్టి ఓ వ్యక్తికి మేలు జరిగేలా ఈ చట్టాన్ని అన్వయించుకోకూడదు. అది చట్టం లక్ష్యాన్నే దెబ్బతీస్తుంది
>
> – సుప్రీంకోర్టు



బాబుకు నో బెయిల్

ఫైబర్‌గ్రిడ్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

- టెరాసాఫ్ట్‌తో బాబుకున్న సాన్నిహిత్యంపై హైకోర్టుకు సీఐడీ ఆధారాలిచ్చింది
- ఆ సంస్థకు అనుకూలంగా ఆయన ఎలా వ్యవహరించారో వివరించింది
- దానిని బ్లాక్‌లిస్ట్ నుంచి తొలగించేందుకు ఏం చేశారో కూడా చెప్పింది
- అభ్యంతరం చెప్పిన అధికారిని బదిలీ చేసిన విషయం కూడా కోర్టు దృష్టికి..
- మొత్తం మీద ఆ సంస్థకు రూ.114.53 కోట్ల మేర లబ్ధి
- అంతిమంగా నిధులు ఎక్కడికెళ్లాయన్న దానిపై దర్యాప్తు జరగాలి
- అందువల్ల ఈ దశలో దర్యాప్తునకు ఎలాంటి భంగం కలగరాదు
- కాబట్టి ఈ దశలో ఆయనకు ముందస్తు బెయిల్ సాధ్యంకాదు
- తేల్చిచెప్పిన న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేశ్‌రెడ్డి

'ఇన్నర్'లోనూ చుక్కెదురు

బెయిల్ మంజూరు కోసం దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత

- ఈ కేసులో డీమ్డ్ కస్టడీ ఉన్నట్లు భావించాలన్న ఏ-1 చంద్రబాబు వాదన తిరస్కృతి
- స్కిల్ స్కాం కేసు వేరు.. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు వేరు
- రెండింటిలో దర్యాప్తు అధికారులు కూడా వేర్వేరు
- విచారించిన సాక్షులు.. సేకరించిన సాక్ష్యాలు సైతం వేరు
- అందువల్ల డీమ్డ్ కస్టడీగా భావించడం సాధ్యంకాదు
- చంద్రబాబు ఇన్నేళ్లు నిద్రపోయి, ఇప్పుడు పోలీసులను నిందిస్తున్నారు
- సరెండర్ పిటిషన్‌గా భావించాలన్న అభ్యర్థనా తిరస్కృతి

అంగళ్లు కేసులోనూ ఎదురుదెబ్బ

- చంద్రబాబు బెయిల్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు
- డీమ్డ్ కస్టడీగా భావించాలన్న ఆయన అభ్యర్థన తిరస్కృతి
- తేల్చిచెప్పిన న్యాయమూర్తి జస్టిస్ సురేశ్‌రెడ్డి

వివరాల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

విప్లవాత్మక పాలన

- చేసిన మంచే మన బలం.. ధైర్యం: పార్టీ ప్రతినిధుల సదస్సులో సీఎం జగన్ దిశానిర్దేశం
- విప్లవాత్మక మార్పులతో 52 నెలలుగా సుపరిపాలన
- మేనిఫెస్టోలో 99 శాతం వాగ్దానాలను అమలు చేశాం
- అలాంటప్పుడు వై నాట్ 175?.. అదే లక్ష్యంతో ప్రజల్లోకి వెళ్దాం

సాక్షి, అమరావతి: రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా విప్లవాత్మక మార్పులతో 52 నెలలుగా సుపరిపాలన అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గత పాలకులకు భిన్నంగా మేనిఫెస్టోలో పొందుపరిచిన 99 శాతం వాగ్దానాలను అమలు చేయడం ద్వారా జగన్ చెప్పాడంటే చేస్తాడని.. మాట నిలబెట్టుకుంటాడని.. కష్టమైన, నష్టమైనా అండగా ఉంటాడనే మంచి పేరును దేవుడి దయతో తెచ్చుకోగలిగామన్నారు. సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా ప్రజలకు మన ప్రభుత్వం చేసిన మంచే మన ధైర్యం.. మన బలం .. మన ఆత్మవిశ్వాసమని పార్టీ ప్రతినిధులకు ఉద్బోధించారు. సోమవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సదస్సులో గత 52 నెలలుగా అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా ప్రజలకు చేసిన మంచిని వివరిస్తూ సీఎం జగన్ సుదీర్ఘంగా ప్రసంగించారు. మనం చేసిన మంచితో ప్రతి ఇంట్లో.. ప్రతి గ్రామంలో.. ప్రతి నియోజకవర్గంలో మార్పులు కళ్లెదుటే కనిపిస్తున్నప్పుడు 175కు 175 శాసనసభ స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా అడుగులు వేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులను సమన్వయం చేసుకుంటూ ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రతి ఇంటికీ వెళ్లి మనం చేసిన మంచిని వివరిస్తూ ప్రతిపక్షాల తీరును ఎండగట్టి అక్కచెల్లెమ్మల ఆశీస్సులు తీసుకుంటూ అడుగులు ముందుకు వేయించాల్సిన బాధ్యత మీ భుజస్కందాలపై పెడుతున్నానని మార్గనిర్దేశం చేశారు. బహుశా మార్చి, ఏప్రిల్‌లో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. టీడీపీ, జనసేన సహా విపక్షాల తీరుపై సీఎం జగన్ పదునైన విమర్శలతో విరుచుకుపడ్డారు. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేస్తూ ప్రజలతో మరింతగా మమేకమయ్యేందుకు చేపట్టనున్న ఎనిమిది కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ప్రకటించారు. అవి 1. జగనన్న ఆరోగ్య సురక్ష, 2. ''వై ఏపీ నీడ్స్ జగన్..'', 3. బస్సు యాత్రలు, 4. ఆడుదాం ఆంధ్రా.., 5. జనవరి 1 నుంచి పెన్షన్ పెంపు., 6. జనవరి 10 నుంచి వైఎస్ఆర్ చేయూత, 7. జనవరి 20 నుంచి వైఎస్సార్ ఆసరా.. 8. మళ్లీ జగనన్ననే తెచ్చుకుందాం కార్యక్రమాలు అని వివరించారు. సదస్సులో సీఎం జగన్ ఏమన్నారంటే..

అధికారం మనకు బాధ్యత మాత్రమే..

దేవుడి దయతో ప్రజలిచ్చిన అధికారం అన్నది మనకి బాధ్యతను మాత్రమే నేర్పిందని తెలియచేస్తూ వారికి తొలి సేవకుడిగా మీ ముందు మాట్లాడుతున్నా. అలా బాధ్యతగా వ్యవహరించాం కాబట్టే ఈ 52 నెలల్లో పౌరసేవల డెలివరీ విధానం, డీబీటీ ద్వారా విప్లవాత్మక మార్పులు తెచ్చాం. మూడు ప్రాంతాల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ మూడు రాజధానులను ప్రకటించే నిర్ణయం తీసుకున్నాం. 26 జిల్లాలను ఏర్పాటు చేశాం. ఎప్పుడూ చూడని విధంగా గ్రామ స్థాయిలో సచివాలయ వ్యవస్థ, ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ వ్యవస్థను తేగలిగాం. ప్రభుత్వ పథకాలను అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ అందించగలుగుతామా? ఇది సాధ్యమేనా? అనుకునే పరిస్థితుల నుంచి ఎక్కడా లంచాలు, వివక్షకు తావులేకుండా పారదర్శకంగా అందించే విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టగలిగాం.

ఇక మరింతగా ప్రజల్లోకి..

ఇప్పుడు అక్టోబరులో ఉన్నాం. బహుశా ఎన్నికలు మార్చి, ఏప్రిల్‌లో జరుగుతాయి. ఇన్ని అడుగులు మనం వేశాం. రాబోయే నెలల్లో వేసే అడుగుల గురించి మీ అందరితో నా ఆలోచనలను ఇవాళ పంచుకుంటా. వాటిని మీరు గ్రామస్థాయిలోకి తీసుకెళ్లి కచ్చితంగా, బాగా అమలయ్యేలా మీరు పర్యవేక్షించాలి. ఈ బాధ్యతను మీరు తీసుకోవాలి. గ్రామ స్థాయిలో సమావేశాలను నిర్వహించి గొప్పగా అడుగులు పడేలా చర్యలు తీసుకోవాలి.

బాబుకు మళ్లీ భంగపాటు

- స్కిల్ స్కాంలో బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన ఏసీబీ కోర్టు
- సీఐడీ కస్టడీ పిటిషన్ కూడా తిరస్కరణ

సాక్షి, అమరావతి : చంద్రబాబుకు ఏసీబీ కోర్టులో మరోసారి చుక్కెదురైంది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధుల కుంభకోణం కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం తిరస్కరించింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నందున చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను బెదిరించి దర్యాప్తును ప్రభావితం చేస్తారనే సీఐడీ వాదనతో న్యాయస్థానం ఏకీభవించిన ఏసీబీ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. సర్వత్రా తీవ్ర ఆసక్తి కలిగించిన ఈ కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు న్యాయమూర్తి వెల్లడించారు. ఈ కేసులో చంద్రబాబు గత నెల 10 నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. మరోవైపు.. ఆయన బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను సీఐడీ తీవ్రంగా వ్యతిరేకించింది.

మళ్లీ కస్టడీకి నిరాకరణ..

మరోవైపు.. చంద్రబాబును మరోసారి విచారించేందుకు కస్టడీకి అనుమతించాలన్న సీఐడీ పిటిషన్‌ను కూడా న్యాయమూర్తి తిరస్కరించారు. గతంలో ఇచ్చిన రెండు రోజుల కస్టడీలో విచారణకు సహకరించలేదు కాబట్టి ఆయన్ని మరోసారి విచారించేందుకు మూడ్రోజుల కస్టడీకి అనుమతించాలని సీఐడీ కోరింది. జ్యుడీషియల్ కస్టడీ 15 రోజుల గడువు ముగిసినందున మరోసారి కస్టడీకి ఇవ్వొద్దని చంద్రబాబు తరఫు న్యాయవాదులు వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం చంద్రబాబును కస్టడీకి అప్పగించాలన్న పిటిషన్‌ను తిరస్కరించింది.

ప్రపంచంతో పోటీ పడండి

- మీ బతుకులను మార్చుకోండి
- పెద్ద పెద్ద కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి
- దీనికి చదువు ఒక్కటే మార్గం
- అమెరికా వెళ్లొచ్చిన ప్రభుత్వ విద్యార్థులతో సీఎం వైఎస్ జగన్
- జీఆర్ఈ, జీమ్యాట్‌లకు కూడా ఉచిత శిక్షణ ఇవ్వాలని అధికారులకు ఆదేశం
- మీ గొప్ప విజన్ వల్లే అమెరికా వెళ్లగలిగామని విద్యార్థుల కృతజ్ఞతలు



సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు

సాక్షి, అమరావతి: ప్రపంచంతో పోటీ పడితేనే మన బతుకులు మారతాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. పేదరికం సమసిపోవాలంటే దానికి విద్య ఒక్కటే మార్గమని తెలిపారు. ఐక్యరాజ్యసమితి సదస్సులో పాల్గొనడానికి 10 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గత నెలలో 15 రోజుల పాటు అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వారంతా సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. 'అమెరికా పర్యటన ద్వారా గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పైకి వెళ్లడానికి మీకు ఆ అనుభవాలు ఉపయోగపడతాయి. ప్రపంచస్థాయికి ఎదగాలన్న కోరిక మీకు మరింత గట్టిపడుతుంది. ఈ పర్యటన మీ మనసులో ఒక ముద్ర వేస్తుంది. ప్రపంచం ఎలా ఉంది? మనం ఎక్కడ ఉన్నాం? ఎంత వెనుకబడి ఉన్నాం? అనేది అర్థమవుతుంది. ప్రపంచం వేగంగా పరుగులు తీస్తోంది. మనం చాలా వెనుకబడి ఉన్నాం.. ప్రపంచంతో మనం పోటీపడి నిలబడాలి. అప్పుడే మన బతుకులు మారుతాయి. ఇందుకు చదువు ఒక్కటే సాధనం' అని విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. విద్య అనే సాధనం ద్వారా పెద్ద పెద్ద కలలను కనాలని సూచించారు. ఆ కలల నుంచే వాస్తవాలు సాకారం అవుతాయన్నారు.

ఇప్పటి నుంచే తెలుసుకోవాలి..: విద్యార్థులు చూసిన కొలంబియా యూనివర్సిటీ లాంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 350 కాలేజీల్లో 21 కోర్సుల్లో సీటు సాధిస్తే ప్రభుత్వమే చదివిస్తుందని సీఎం వైఎస్ జగన్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. సంబంధిత కాలేజీల్లో ఫీజులు రూ.80 లక్షల నుంచి రూ.1 కోటి వరకూ ఉంటాయన్నారు. వీటిలో సీటు తెచ్చుకుంటే జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా రూ.1.25 కోట్ల వరకు ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. టోఫెల్‌కు ఎలా తీసుకువచ్చామో.. అలాగే జీఆర్ఈ, జీమ్యాట్‌లకు కూడా మెటీరియల్, ఉచిత శిక్షణను విద్యార్థులకు అందించాలని సీఎం వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. సీఎం గొప్ప ఆలోచన వల్లే ఇదంతా సాధ్యమైందని విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలలో 13 కాటేజీల పునర్నిర్మాణం

- వరాహస్వామి కాటేజీ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు నాలుగు లేన్ల రహదారి
- పారిశుధ్య కార్మికుల వేతనాల పెంపు
- టీటీడీ ధర్మకర్తల మండలి కీలక నిర్ణయాలు



టీటీడీ పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా పనిచేసే కార్మికులకు లబ్ధి కలిగించేందుకు టీటీడీ ధర్మకర్తల మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. ధర్మకర్తల మండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో మండలి సమావేశం జరిగింది. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, కమిషనర్ సత్యనారాయణ, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

కీలక నిర్ణయాలివీ

- తిరుమలలో 63 ఏళ్ల క్రితం నిర్మించిన గాయత్రీ సదన్, శ్రీవారి కుటీర్, టీబీసీ-53, టీబీసీ-64 తదితర 13 విశ్రాంతి గృహాలను కాటేజీ డొనేషన్ స్కీమ్ కింద పునర్నిర్మాణం.
- రూ.10.80 కోట్లతో వరాహస్వామి విశ్రాంతి గృహం నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు నాలుగు లేన్ల రోడ్డు, ఫుట్‌పాత్, డ్రెయిన్లు నిర్మాణం.
- తిరుమల మొదటి ఘాట్ రోడ్‌లో శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి మోకాలి మెట్టు వరకు రోడ్డు పక్కన నడిచే భక్తులు ఎండకు, వర్షానికి ఇబ్బందులు కలగకుండా రూ.2.81 కోట్లతో నడక దారి షెల్టర్లు నిర్మాణానికి టెండర్లు ఆమోదం.
- అన్నమయ్య భవనం, నారాయణగిరి క్యాంటీన్లలో భక్తులకు భోజనం తక్కువ ధరకే ఇచ్చేందుకు రూ.2.93 కోట్లతో నారాయణగిరి క్యాంటీన్‌లో మూడో అంతస్తు నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేయడానికి టెండర్ ఆమోదం.
- అలిపిరి వద్ద సప్త గోప్రదక్షిణ మందిరంలో నిత్యం విశేష హోమం నిర్వహించాలని నిర్ణయం.
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల కింద ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న దాదాపు 5 వేల మంది పారిశుద్య కార్మికులు, ఎఫ్ఎంఎస్ పారిశుద్య కార్మికుల వేతనాన్ని రూ.12 వేల నుంచి రూ.17 వేలకు పైగా పెంచేందుకు ఆమోదం.



ఊరంతా మా కుటుంబమే!



● కలిసికట్టుగా ప్రగతిని సాధిద్దాం

విధుల్లో ఉత్తమసేవలు అందించినందుకుగాను జాతీయ స్థాయి ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా తెలంగాణలోని సూర్యాపేట జిల్లా, చివ్వెంల మండలం, ఖాసింపేట గ్రామం, రేగట్టె వెంకట రమణ ఎంపికయ్యారు. నేడు న్యూఢిల్లీలో కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నుంచి పురస్కారం అందుకోనున్నారు. ఈ సందర్భంగా రేగట్టె వెంకటరమణను పలకరిస్తే తన ఇరవై మూడేళ్ల కృషిని వివరించారు.



● పౌష్టికాహారం.. పంచుతూ...

''పై అధికారులు చెప్పిన పనిని సమయాను కూలంగా నూటికి నూరు శాతం పూర్తి చేస్తూ రావడం వల్లే ఈ రోజు ఈ పురస్కారం లభించింది. ఎనిమిదవ తరగతి పూర్తవుతూనే పెళ్లయ్యింది. ఇరవై మూడేళ్ల క్రితం అత్తింటిలో అడుగుపెడుతూనే అంగన్‌వాడీ టీచర్‌గానూ చేరాను. ఆ తర్వాత మా వారు భద్రయ్య, ఇతర కుటుంబ సభ్యుల సహకారంతో డిగ్రీ వరకు చదువుకున్నాను. నాకు ఇద్దరు కూతుళ్లు. మా ఇంటినే కాదు ఊరు బాగోగులు చూసుకునే అవకాశం కూడా దక్కడం అదృష్టంగా భావిస్తాను. అందుకే, నాకు మా ఊరే కుటుంబం అయ్యింది. ఎవరికి ఏ సమస్య వచ్చినా అందరికీ తెలిసిపోతుంది. అందరూ అందరి కోసం అన్నట్టుగా ఎన్నో కార్యక్రమాలను జరుపుతుంటాం. ఇవన్నీ ఊళ్లో అందరినీ సంఘటితం చేస్తున్నాయి. ప్రీ స్కూల్, ఆరోగ్యలక్ష్మి, ఇంటింటి అంగన్‌వాడీ హోమ్ విజిట్స్, పౌష్టికాహార, తల్లిపాల వారోత్సవాలు, మిల్లెట్స్ మాసం, పిల్లల చదువుకు సంబంధించి.. ఇలా ప్రతిదీ తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తాం. ఏ కార్యక్రమం చేసినా నూరు శాతం సక్సెస్ అవుతుంది.

ఇంటింటి ప్రోగ్రామ్..

గర్భిణులపై ఎక్కువ ఫోకస్ పెడుతుంటాం. వారి ఆరోగ్యం, పౌష్టికాహారం.. ఇంటి నుంచి ఆసుపత్రికి వెళ్లేవరకు ఎలా చూసుకోవాలో ఇంటిల్లిపాదికీ కౌన్సెలింగ్ ఇస్తాం. అలాగే పిల్లలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చెబుతుంటాం.

మేం మా డైరీలో సక్సెస్ స్టోరీలు కూడా నోట్ చేస్తాం. ఒకసారి ఒక గర్భిణి పౌష్టికాహారం గురించి, తీసుకోవలసిన ఇతర జాగ్రత్తల గురించీ మేం ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఇచ్చిన పౌష్టికాహారం తీసుకోలేదు. ఆమెకు డెలివరీ అయి బరువు తక్కువతో పాప పుట్టి, చనిపోయింది. అయినా ఆమెను మళ్ళీ మళ్లీ కలుస్తూనే, విషయాలన్నీ చెబుతూ ఆమె తిరిగి కోలుకునేలా చేశాం. ఆమె మళ్లీ ప్రెగ్నెంట్ అయినప్పుడు మేం చెప్పిన జాగ్రత్తలన్నీ పాటించింది. ఈసారి ఆరోగ్యకరమైన పాపకు తల్లి అయ్యింది. ఆ తర్వాత ఆమెనే ఊళ్లో ఎవరు ప్రెగ్నెంట్ అయినా తనలా అశ్రద్ధ చేయద్దని సూచనలు చేస్తుంటుంది. చంటి పిల్లల విషయంలోనూ తల్లులు ఒకరిద్వారా మరొకరు సూచనలు చేసుకునేలా కౌన్సెలింగ్ చేస్తుంటాం.

అందరూ మా వాళ్లే..

గర్భిణులకు సీమంతాలు, స్కూల్ డే, చిల్డ్రన్ డే వంటి కార్యక్రమాలకు గ్రామపెద్దలు డబ్బులు పోగేసి మరీ చేస్తుంటారు. ర్యాలీలు, వారోత్సవాలకు సంబంధించిన కార్యక్రమాలన్నింటికీ గ్రామపెద్దలను కలిసి చెబుతాను. దీనివల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో వివరిస్తాను. వాళ్లు మిగతా అందరినీ కూడగట్టుకొని, మాకు మద్దతు ఇస్తారు. దీంతో ఊరంతా ఆరోగ్యంగా ఉండేలా సరైన కృషి జరుగుతోంది. కార్యక్రమాల్లో ఊరంతా ఒక్కటవుతుంది. ఆ రోజు ఎవరూ పనులకు కూడా వెళ్లరు. కార్యక్రమాలను ఓ పండగలా జరుపుతుంటారు. నేను చెప్పిన విషయాలను వినడంలోనూ, ఆచరించడంలోనూ మా ఊరంతా నాకు సహకరించడం వల్లే ఇది సాధ్యమైంది. కరోనా సమయంలోనూ తీసుకున్న జాగ్రత్తలకు రాష్ట్రస్థాయి అధికారుల నుంచి ప్రశంసలు లభించాయి.

బెస్ట్ అవార్డీగా...

మండల, ప్రాజెక్ట్, జిల్లా స్థాయుల్లోనూ.. బెస్ట్ అంగన్‌వాడీ టీచర్‌గా అవార్డులు అందుకున్నాను. ఈ యేడాది జాతీయ స్థాయికి ఎన్నికైనందుకు చాలా ఆనందంగా ఉంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మిల్లెట్స్‌తో ఐటమ్స్ తయారుచేసి, డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్‌లో స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటాం. వాటి ప్రయోజనాలను వివరిస్తాం. దీనివల్ల ఇతర మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తుంటాయి. మా అంగన్‌వాడీ టీచర్స్‌కి నెలలో రెండు సమావేశాలు జరుగుతుంటాయి. వాటిలో ఊళ్లలో చేపట్టే కార్యక్రమాల వివరాలు పంచుకోవడం, ముందస్తు ప్రణాళికల గురించి చర్చించుకోవడం, నిర్ణయాల అమలుకు కృషి చేయడం మాకున్న పెద్ద బాధ్యత. దీనిని సక్రమంగా నిర్వర్తించడమే ఈ రోజు మీ అందరి ముందు నిలిపింది'' అని ఆనందంగా వివరించింది వెంకటరమణ.

– నిర్మలా రెడ్డి

పాకశాస్త్రం

నచ్చేలా మెచ్చేలా ఘనంగా గరిట పట్టేలా

'తినడం కోసం బతకడం కాదు. బతకడం కోసం తినాలి' అని కాస్త గంభీరంగా అనుకున్నాసరే, 'వంటల రుచుల కోసం కూడా బతకవచ్చు సుమీ!' అనిపిస్తుంది కొన్నిసార్లు. పసందైన వంటకాలు జీవనోత్సాహాన్ని కలిగిస్తాయి. చురుకుదనాన్ని నింపుతాయి. ఇట్టి విషయాన్ని దృష్టిలో పెట్టుకొని లండన్‌లో చేస్తున్న కార్పొరేట్ ఉద్యోగాన్ని వదులుకొని చెఫ్‌గా మారి ప్రవాస భారతీయులకు అపూర్వమైన భారతీయ వంటకాలను పరిచయం చేయడంతో పాటు, వాటిని ఇంట్లోనే సులభంగా ఎలా తయారు చేసుకోవచ్చు అనేదానిపై పుస్తకాలు రాస్తోంది మౌనికా గోవర్ధన్...




● మౌనికా గోవర్ధన్

ముంబైలోని దాదర్ ప్రాంతంలో పుట్టి పెరిగిన మౌనిక ప్రస్తుతం లండన్‌లో ఉంటోంది. చెఫ్‌గా సంప్రదాయ భారతీయ వంటకాల రుచులను విదేశీయులకు పరిచయం చేస్తుంది. 'సులభంగా చేసుకునేలా... ఆరోగ్యంగా ఉండేలా...' అనేది ఆమె వంటల పాలసీ. ప్రతి కుటుంబానికి తరతరాలుగా తమవైన ప్రత్యేక వంటకాలు ఉంటాయి. కొన్నిసార్లు కాలంతోపాటు అవి కనుమరుగు అవుతుంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని మౌనిక తమ కుటుంబంలో ఎన్నో తరాల విలువైన వంటకాలను సేకరించింది.

పుస్తకాలు, టీవీ కార్యక్రమాలు, లైవ్ ఈవెంట్స్, సోషల్ మీడియా ద్వారా మన వంటకాలకు విదేశాల్లో ప్రాచుర్యం కల్పిస్తోంది. లండన్‌లో ఉంటున్నప్పటికీ మౌనికకు మన దేశంలోని పాతతరం వంటకాలపై ఆసక్తి తగ్గలేదు. ఏమాత్రం సమయం దొరికినా మన దేశానికి వచ్చి మధ్య ప్రదేశ్ నుంచి మణిపుర్ వరకు ఎన్నో ప్రాంతాలకు వెళుతుంటుంది.

'అందరిలాగే అమ్మ వంటకాలు అంటే నాకు ఇష్టం. అయితే కేవలం ఇష్టానికి పరిమితం కాకుండా అమ్మ చేసే వంటకాలను ఓపిగ్గా నేర్చుకున్నాను. నేను చేసే వంటకాలు కూడా అమ్మకు బాగా నచ్చేవి' గతాన్ని గుర్తు చేసుకుంది మౌనిక. ఆమె అమెరికాలాంటి దేశాలకు వెళ్లినప్పుడు ప్రవాస భారతీయులతో మాట్లాడుతున్న సందర్భంగా మన వంటకాలను గుర్తు చేస్తున్నప్పుడు వారి నోట్లో నీళ్లు ఊరేవి. ప్రతివ్యక్తికి 'సోల్ ఫుడ్' అనేది ఒకటి ఉంటుంది అని చెబుతుంటుంది మౌనిక.



మౌనిక తాజాపుస్తకం 'తందూరీ హోమ్ కుకింగ్' అద్భుత విజయాన్ని సాధించింది. ఈ పుస్తకంలో రకరకాల రుచికరమైన తందూరీ వంటకాలతో పాటు ఆయా వంటకాల చరిత్రను ఆసక్తికరంగా వివరిస్తుంది మౌనిక. ఇదంతా సరే, కార్పొరేట్ ఉద్యోగాన్ని వదులుకొని మరీ మౌనిక ఎందుకు చెఫ్‌గా మారింది? ఆమె మాటల్లోనే...

'లండన్‌లో ఉద్యోగం చేస్తున్న రోజుల్లో స్నేహితుల కోసం సరదాగా వంటలు చేసి పెట్టేదాన్ని. ఆ వంటకాలు వారికి విపరీతంగా నచ్చేవి. ఆ రుచుల మైమరుపులో ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం కూడా మరచి పోయేవారు. కుకింగ్‌ను ప్రొఫెషనల్‌గా తీసుకుంటే తిరుగులేని విజయం సాధిస్తావు అని చెప్పేవాళ్లు. నేను ఆ మాటలను పెద్దగా సీరియస్‌గా తీసుకునేదాన్ని కాదు. అయితే పదే పదే ఇలాంటి మాటలు వినిపించడంతో ఒకసారి ట్రై చేద్దామని కార్పొరేట్ జాబ్‌ను వదులుకొని కుకింగ్‌ను ఫుల్–టైమ్ జాబ్ చేసుకున్నాను. అయితే ఇది మా కుటుంబ సభ్యులకు నచ్చలేదు. కొందరైతే లండన్‌కు వెళ్లింది వంటలు చేయడానికా? అని వెక్కిరించారు. దీనికి కారణం కుకింగ్ అనేది వారికి ఒక ప్రొఫెషన్‌గా కనిపించకపోవడమే. కుకింగ్ అంటే ఇంట్లో ఆడవాళ్లు చేసే పని మాత్రమే అనేది వారి అభిప్రాయం. కుకింగ్‌కు సంబంధించిన రోల్‌మోడల్స్ గురించి కూడా వారికి తెలియదు. అయితే తరువాత మాత్రం వారిలో మార్పు వచ్చింది' అంటుంది మౌనిక.

మౌనిక ఇంట్లో ఆ రోజుల్లో ఒకే ఒక వంటల పుస్తకం కనిపించేది. ఆ పుస్తకాన్నే పదేపదే తిరగేసేది అమ్మ. ఈ పుస్తకాలు కూడా కొన్ని వంటకాలకు సంబంధించినవే ఉండేవి. దీన్ని దృష్టిలో పెట్టుకొని వంటలు ఎలా చేయాలో నేర్పించడం కోసం పుస్తకాలు కూడా రాయాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగా వెబ్‌సైట్‌ను మొదలుపెట్టింది. ఆ తరువాత 'ది న్యూయార్క్ టైమ్స్' 'ది డెయిలీ మెయిల్'లో మన వంటకాలను ప్రపంచానికి పరిచయం చేసేది.

వంటకాల తయారీలో రెండు దశాబ్దాల అనుభవం ఉన్న మౌనిక ఇండియన్ కిచెన్, థాలీ, తందూరీ హోమ్ కుకింగ్ అనే మూడు పుస్తకాలు రాసింది. 'వంటలు చేసే సమయంలో నా దృష్టి మొత్తం తయారీ ప్రక్రియపైనే ఉంటుంది. ఆ సమయంలో వేరే విషయాల గురించి ఆలోచించడం తాలూకు ప్రభావం రుచిపై పడుతుంది. అందుకే వంటగదిలోకి వెళ్లినప్పుడు ఒక కొత్త ప్రపంచంలోకి వెళ్లినట్లుగా భావిస్తాను' అంటుంది మౌనిక.

మౌనిక లండన్‌లో చదువుకునే రోజుల్లో 'అన్ని భారతీయ వంటకాలకు ఒకటే రెస్టారెంట్' అన్నట్లుగా ఉండేది. ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. ఒకప్పుడు కొత్తిమీర దొరకడం గగనంగా ఉండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. 'మన వంటకాల కోసం రెస్టారెంట్‌లపై మాత్రమే ఆధారపడడం ఎందుకు? ఆడుతూ పాడుతూ మన ఇంట్లో చేసుకోవచ్చు కదా' అనుకునే ప్రవాస భారతీయులకు మౌనిక గోవర్ధన్ పుస్తకాలు అపురూపంగా మారాయి. చెఫ్‌గా మౌనికా గోవర్ధన్ అపూర్వ విజయానికి కారణం అయ్యాయి.

నాన్‌బీటీ సేంద్రియ పత్తికి పునరుజ్జీవం!

● తెలంగాణ, ఏపీ సహా ఆరు రాష్ట్రాల్లో నాన్‌బీటీ సేంద్రియ పత్తి విత్తనోత్పత్తికి స్వతంత్ర పరిశోధనా సంస్థల శ్రీకారం
● వచ్చే ఖరీఫ్ నాటికి తెలుగు రాష్ట్రాల్లో 3 వేల ఎకరాలకు నాన్ బీటీ సేంద్రియ పత్తి విత్తనాల సరఫరా లక్ష్యం

మన దేశంలో పత్తి సాగులో వాడుతున్నది 95% వరకు జన్యుమార్పిడి చేసిన పత్తి విత్తనాలే. నాన్‌బీటీ దేశీ పత్తి రకాలు దాదాపు పూర్తిగా కనుమరుగైపోయాయి. ఈ నేపథ్యంలో నాన్‌బీటీ దేశీ, అమెరికన్ పత్తి రకాలను తిరిగి రైతులకు అందించే కృషికి అంతర్జాతీయ సేంద్రియ వ్యవసాయ స్వతంత్ర పరిశోధనా సంస్థలు శ్రీకారం చుట్టాయి. వచ్చే ఖరీఫ్ నుంచే తెలుగు రాష్ట్రాల్లో 3 వేల ఎకరాల్లో రైతులకు ఈ విత్తనాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచ పత్తి దినోత్సవం (అక్టోబర్ 7) సందర్భంగా ప్రత్యేక కథనం...



● జోగులాంబ గద్వాల్ జిల్లా రాజోలిలో నాన్ బీటీ హైబ్రిడ్ సేంద్రియ పత్తి విత్తనోత్పత్తి క్షేత్రంలో మహిళా రైతు



సేంద్రియ పత్తి సాగు వల్ల భూతాపం పెరుగుదలను దీటుగా ఎదుర్కోవటం, ఆరోగ్యదాయకమైన దూది ఉత్పత్తిని పెంపొందించటం వంటి ప్రయోజనాలెన్నో ఉన్నాయి. సేంద్రియ పత్తి విస్తీర్ణాన్ని పెంపొందించాలంటే మొదట జన్యుమార్పిడి చేయని (నాన్ బీటీ) దేశీ, హైబ్రిడ్ రకాల పత్తి విత్తనాలను తొలుత స్థానికంగా రైతులకు అందుబాటులోకి తేవాలి. ఈ అవసరాన్ని గుర్తించిన అనేక అంతర్జాతీయ సేంద్రియ వ్యవసాయ స్వతంత్ర పరిశోధనా సంస్థలు స్థానిక వాతావరణ పరిస్థితులకు అనువైన నాన్ బీటీ సేంద్రియ పత్తి విత్తనోత్పత్తి కార్యక్రమాలను ఈ సంస్థలు ప్రోత్సహిస్తున్నాయి. ఈ క్రమంలోనే మన దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా ఆరు రాష్ట్రాల్లో నాన్ బీటీ సేంద్రియ పత్తి విత్తనోత్పత్తి కార్యక్రమాన్ని నెదర్లాండ్స్‌కు చెందిన ఆర్గానిక్ కాటన్ యాక్సలరేటర్(ఒసిఎ), స్విట్జర్లాండ్‌కు చెందిన స్వతంత్ర సేంద్రియ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఎఫ్ఐబిఎల్) శ్రీకారం చుట్టాయి.

ఈ సంస్థల తోడ్పాటుతో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ సుస్థిర వ్యవసాయ కేంద్రం (సిఎస్ఎ) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో నాన్‌బీటీ సేంద్రియ పత్తి విత్తనోత్పత్తికి ఈ ఖరీఫ్ నుంచి కృషి ప్రారంభించింది.



● నూజివీడు సమీపంలోని కొండపర్వలో 30 రకాల నాన్‌బీటీ పత్తి రకాల సేంద్రియ ప్రదర్శన క్షేత్రంలో పంటను పరిశీలిస్తున్న ఎఫ్ఐబిఎల్, సిఎస్ఎ శాస్త్రవేత్తలు



30 నాన్ బీటీ పత్తి రకాల ప్రయోగాత్మక సాగు

మన దేశంలో నాన్ బీటీ సేంద్రియ పత్తి విత్తనోత్పత్తికి సంబంధించి గత ఆరేళ్లుగా క్షేత్రస్థాయిలో వంగడాల ఎంపిక ప్రక్రియ స్వచ్ఛంద సంస్థల పర్యవేక్షణలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పిఓ)ల స్థాయిలో సాగుతోంది. ఈ క్రమంలో 30 నాన్ బీటీ రకాలు రైతులకు నచ్చే విధంగా ఫలితాలనిస్తున్నాయని గుర్తించారు. వీటిలో దేశీ పత్తి సూటి రకాలు, అమెరికన్ పత్తి సూటి రకాలతో పాటు అమెరికన్ హైబ్రిడ్ పత్తి రకాలు ఉన్నాయి. అయితే, ఈ 30 నాన్ బీటీ సూటి/హైబ్రిడ్ రకాల్లో ఏయే రకాలు ఏయే రాష్ట్రాల్లో ఉత్తమ ఫలితాలనిస్తున్నాయన్న క్షేత్ర స్థాయి అధ్యయనం ఈ ఖరీఫ్‌లో ప్రధానంగా పత్తి సాగయ్యే ఆరు రాష్ట్రాల్లో చేపట్టారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిషా, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా ప్రత్యేక జాగ్రత్తలతో సాగు చేస్తున్నారు. తెలంగాణలోని యాదాద్రి జిల్లా వెలమజాల గ్రామంలో నేలతల్లి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఒక ఎకరంలో 30 రకాల నాన్‌బీటీ పత్తి రకాలను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తోంది. అదేవిధంగా, ఏపీలో నూజివీడుకు సమీపంలోని కొండపర్వలో గల కృష్ణ సుధ అకాడమీ ఫర్ ఆగ్రోఎకాలజీ ఆవరణలో ఒక ఎకరంలో 30 నాన్ బీటీ పత్తి రకాలను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. జన్యుస్వచ్ఛత కోసం ఒక్కో రకానికి మధ్య జొన్న వరుసలు విత్తారు. ఈ రెండు క్షేత్రాలను సిఎస్ఎ శాస్త్రవేత్తలు పర్యవేక్షిస్తున్నారు. ఈ 30 రకాల్లో ఏ రకాలు మెరుగైన ఫలితాలనిస్తాయో పరిశీలించి, వచ్చే సంవత్సరాల్లో ఆయా రకాలను విస్తృతంగా సాగులోకి తెచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ప్రోత్సహించనున్నాయని సిఎస్ఎ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, సీనియర్ శాస్త్రవేత్త డా. జి. రాజశేఖర్ చెప్పారు.

ప్రపంచ పత్తి దినోత్సవం
మంచి కోసం పత్తి

వచ్చే ఖరీఫ్ నాటికి 3 వేల ఎకరాలకు అందుబాటులోకి నాన్‌బీటీ పత్తి విత్తనాలు

ఇదిలా ఉండగా, 5 రకాల నాన్‌బీటీ పత్తి రకాల విత్తనోత్పత్తి ఆరు రాష్ట్రాల్లో రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా ఈ ఖరీఫ్‌లో మొత్తం 25 ఎకరాల్లో ప్రారంభమైంది. ఇందులో భాగంగా, తెలంగాణలోని రెండు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు 5 నాన్ బీటీ పత్తి రకాల విత్తనోత్పత్తిని 5 ఎకరాల్లో చేపట్టాయి. వీటిల్లో ఆర్‌విజెకె–ఎస్‌జిఎఫ్1 అనే దేశీ పత్తి (అర్బోరియం) సూటి రకం ఒకటి. ఆర్‌విజెకె–ఎస్‌జిఎఫ్2, ఎన్‌డిఎల్‌హెచ్, సురక్ష అనే 3 రకాల అమెరికన్ (హిర్సుటం) సూటి రకాలతోపాటు.. వసుధ గోల్డ్ అనే హైబ్రిడ్ పత్తి రకాలను ఒక్కో రకాన్ని ఒక్కో ఎకరంలో జోగులాంబ గద్వాల్ జిల్లా రాజోలిలోని రాజోలి ఎఫ్‌పిఓ, జనగామ జిల్లాలోని ఆరద్య ఎనబావి ఎఫ్‌పిఓలు సాగు చేస్తున్నాయి. ఈ విత్తనోత్పత్తి కార్యక్రమాన్ని సిఎస్ఎ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, సీనియర్ శాస్త్రవేత్త డా. జి. రాజశేఖర్ పర్యవేక్షిస్తున్నారు.

రైతులకు నచ్చే లక్షణాలతో పాటు మేలైన దిగుబడినిచ్చే ఈ నాన్ బీటీ రకాల సామర్థ్యాన్ని రైతులకు ప్రత్యక్షంగా చూపించే లక్ష్యంతో పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నామని, వచ్చే ఖరీఫ్‌కు 3 వేల ఎకరాల్లో సాగుకు ఈ విత్తనాలు అందుబాటులోకి తెస్తామన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఈ నాన్ బీటీ పత్తి రకాలను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసే ఆసక్తి ఉన్న రైతులు ఈ విత్తన క్షేత్రాలను దసరా తర్వాత కాయ దశలో స్వయంగా సందర్శించి, విత్తనాలను బుక్ చేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు తనను సంప్రదించాలని డా. రాజశేఖర్ (83329 45368) తెలిపారు.

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్

సాగుబడి
చిత్త కార్తె: అక్టోబర్ 11 నుంచి

ఒకటికి పది గ్రాసాలు.. పాడి రైతుకు పది మేళ్లు..

'మేపు లోనే సేపు' అని నానుడి. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి పూర్తి సామర్థ్యం పొందాలంటే మేలైన, నాణ్యమైన పశుగ్రాసాలను పచ్చిమేతగా అందించాలి. దాణా కన్నా పచ్చని పశుగ్రాసాలను మేతగా అందిస్తే అధిక పాల దిగుబడి సాధించడంతోపాటు పాడి పశువుల్లో రోగ నిరోధక శక్తిని పెంచినవారమవుతాం. పాడి పరిశ్రమ లాభసాటి కావాలంటే ఖర్చు తగ్గాలి. ఇది తగ్గాలంటే మేలు జాతి పశుగ్రాసాలను పశువులకు మేతగా అందించాలి. దీనితో 40–50 శాతం ఖర్చు తగ్గటంతోపాటు పాల దిగుబడి 20 శాతం పెరుగుతోంది.

రైతులు పశుగ్రాసాల్లో ఏదో ఒకటి లేదా రెండు రకాలను పెంచి పాడి పశువులకు మేపుతుంటారు. అలా కాకుండా కొన్ని రకాల పశుగ్రాసాలను పెంచి పశువులకు క్రమపద్ధతిలో మేపితే మరింత మేలు జరుగుతోంది. ఈ విధానాన్ని అమలాపురం ఏరియా పశు వైద్యశాల అధికారులు ప్రయోగాత్మకంగా అమలు చేసి చూపిస్తున్నారు. ఏరియా పశు వైద్యశాల వెనుక నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని చదును చేసి పదిహేను సెంట్ల స్థలంలో పది రకాల పశుగ్రాసాలను పెంచుతున్నారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎల్.విజయ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనా క్షేత్రంలో సూపర్ నేపియర్, గిని గడ్డి, కసుమ గడ్డి, రెడ్ నేపియర్, గిని గ్రాస్, మోని, చంగల్ గడ్డి, బొబ్బర గడ్డి, సీవో4, సీవో 5 రకాల గడ్డిని పెంచుతున్నారు. ఔత్సాహికులైన పాడి రైతులకు పశుగ్రాసాల పెంపక విధానాన్ని వివరిస్తున్నారు. ప్రతి గడ్డిలో వైవిధ్యభరితమైన పోషకాలు ఉండటంతో అన్ని రకాలు మేపితే మంచి ఫలితాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. కేవలం పేరా గ్రాస్ (ఇంగ్లీష్ గడ్డి) మాత్రమే మేపితే పశువుల్లో కాల్షియం లోపించే అవకాశముంది. చెంగల్ గడ్డి 'రాగి సంగటి'తో సమానం. సూపర్ నేపియర్ ఐదేళ్ల పాటు మేత అందుతోంది. కాండం మెత్తగా ఉండడంతోపాటు ఇందులో అధిక పోషకాలుంటాయి. రెడ్ నేపియర్‌లో ప్రొటీన్, గినీ గడ్డిలో శక్తినిచ్చే పోషకాలు ఎక్కువ. వీటిని కలిపి అందించడం వల్ల అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా అందుతాయి. దీని వల్ల పాల దిగుబడి పెరగడంతోపాటు పశువులు బలంగా ఉంటాయి.



● వెటర్నరీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ ఏడీ ఎల్.విజయ్ రెడ్డి



● పశుగ్రాసాల క్షేత్రంలో పాడి రైతులకు అవగాహన

శాస్త్రీయ పద్ధతిలో పశు పోషణలో భాగంగా వివిధ పోషకాలున్న పశుగ్రాసాలను పరిచయం చేయటంతో పాటు వివిధ రకాల నేలలకు అనువైన పశుగ్రాసాల రకాల పెంపకంపై శిక్షణ ఇస్తున్నారు. గడ్డి విత్తనాలు, కనుపులను ఉచితంగా అందజేస్తున్నారు. రైతులతోపాటు వెటర్నరీ విద్యార్థులకూ అవగాహన కల్పిస్తున్నారు.

పదిహేను సెంట్లలో ఏడాదికి సగటున 2.5 టన్నుల పశు గ్రాసాన్ని రైతులు పొందనున్నారు. ఒక ఎకరం భూమిలో ఈ విధంగా పశు గ్రాసాలు పెంచితే 5 నుంచి 6 పాడి పశువులకు ఏడాది పొడవునా మేత అందించవచ్చు. వీటితోపాటు కలబంద, నల్లేరు, పసుపు, రణపాల, తులసి, తిప్పతీగ, ఇన్సులిన్ మొక్క వంటి ఔషధ మొక్కలను కూడా పెంచుతూ, సంప్రదాయ వైద్యంలో వాటి ఉపయోగాల గురించి రైతులకు తెలియజేస్తున్నారు. ఒకటికి పది రకాల పశుగ్రాసాల పెంపకం వల్ల పాడి రైతుల ఆదాయం పెరుగుతోందంటున్నారు విజయ్‌రెడ్డి (98663 27067).

– నిమ్మకాయల సతీష్ బాబు, సాక్షి, అమలాపురం

13 నుంచి సింహపురి సేంద్రియ మేళా

గో–ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, సింహపురి సేంద్రియ వ్యవసాయదారుల సంఘం, మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 15 వరకు నెల్లూరులోని వి.ఆర్ కాలేజి గ్రౌండ్స్‌లో సేంద్రియ ఉత్పత్తులతో పాటు చేపలు, రొయ్యలు, పీతల ప్రదర్శన–అమ్మకం మేళా జరగనుంది. ఇతర వివరాలకు.. 81436 32488.

15,16 తేదీల్లో సేంద్రియ సేద్యంపై శిక్షణ

ఆదిగురు భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనగాంలోని బానపురంలో గోపాల్ గోశాలలో ఈ నెల 15, 16 తేదీల్లో సేంద్రియ, గోఆధారిత వ్యవసాయంపై శిక్షణ ఉంటుంది. ద్రావణాలు, కషాయాలు, గానుగ నునెలు, నెయ్యి, ధూప్ స్టిక్‌లు తదితర ఉత్పత్తుల తయారీపై నిపుణులు శిక్షణ ఇస్తారు. వివరాలకు.. 70953 14226.



అఫ్గానిస్తాన్‌తో మ్యాచ్‌కూ శుబ్‌మన్ గిల్ దూరం

సొంతగడ్డపై జరుగుతున్న వన్డే ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో భారత జట్టు ఓపెనర్ శుబ్‌మన్ గిల్ వరుసగా రెండో మ్యాచ్‌కూ దూరమయ్యాడు. బుధవారం అఫ్గానిస్తాన్ జట్టుతో మ్యాచ్ ఆడేందుకు ఢిల్లీ బయలుదేరిన భారత జట్టు వెంట గిల్ వెళ్లలేదు. డెంగీ జ్వరం బారిన పడ్డ గిల్ ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదని, చెన్నైలో వైద్యుల పర్యవేక్షణలో అతను చికిత్స తీసుకుంటున్నాడని బీసీసీఐ తెలిపింది. ఆస్ట్రేలియాతో ఆదివారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లోనూ గిల్ ఆడలేదు.



ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

షాంఘై ఓపెన్ ఏటీపీ మాస్టర్స్-1000 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ శుభారంభం చేసింది. చైనాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-4, 6-3తో మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్)-ఆండ్రియా మీస్ (జర్మనీ) జంటపై గెలిచింది. 85 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ నాలుగు ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. మరోవైపు భారత నంబర్ వన్ సుమిత్ నగాల్ పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు.

వెర్‌స్టాపెన్ 'హ్యాట్రిక్'

- వరుసగా మూడో ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ సొంతం
- ఈ సీజన్‌లో 14వ విజయం



దోహా: వేదిక మారినా ఫలితం మారలేదు. ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ 14వ విజయం నమోదు చేసుకున్నాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఖతర్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ చాంపియన్‌గా నిలిచాడు. నిర్ణీత 57 ల్యాప్‌లను వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంటా 27 నిమిషాల 39.168 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఆస్కార్ పియస్ట్రీ (మెక్‌లారెన్) రెండో స్థానంలో, లాండో నోరిస్ (మెక్‌లారెన్) మూడో స్థానంలో నిలిచారు. ప్రపంచ మాజీ చాంపియన్ లూయిస్ హామిల్టన్ (మెర్సిడెస్), కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) తొలి ల్యాప్‌లోనే వెనుదిరిగారు. ఈ ఫలితంతో వెర్‌స్టాపెన్ ఈ సీజన్‌లో మరో ఐదు రేసులు మిగిలి ఉండగానే 433 పాయింట్లతో ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. 22 రేసుల ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 17 రేసులు ముగిశాయి. ఇందులో 14 రేసుల్లో వెర్‌స్టాపెన్, రెండు రేసుల్లో పెరెజ్ (రెడ్‌బుల్), మరో రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. 2021, 2022లలో కూడా వెర్‌స్టాపెన్ ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సాధించాడు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు యూఎస్‌ఏ గ్రాండ్‌ప్రి ఈనెల 22న జరుగుతుంది.

'ధర్మశాల' అవుట్ ఫీల్డ్‌పై బట్లర్ అసంతృప్తి





ధర్మశాల: వన్డే ప్రపంచకప్‌లో భాగంగా నేడు ఇంగ్లండ్, బంగ్లాదేశ్ జట్లు తలపడనున్నాయి. అయితే ఇంగ్లండ్ సారథి బట్లర్ ధర్మశాల స్టేడియంపై తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చాడు. మీడియాతో మాట్లాడుతూ 'ఈ మైదానం పేలవంగా ఉంది. అవుట్‌ఫీల్డ్ ఆటగాళ్లకు ప్రమాదకరం. క్యాచ్‌లు పట్టేటపుడు, డైవింగ్ చేసేటపుడు ఫీల్డర్లు జాగ్రత్తగా వ్యవహరించాలి. పరుగు ఆపేందుకు డైవ్ చేస్తే గాయాల బారిన పడొచ్చు. ఐపీఎల్‌లో ఆడినప్పటిలా ఈ అవుట్‌ఫీల్డ్ లేదు. ఇది క్రికెటర్లకు ఇబ్బందికరం' అని బట్లర్ అన్నాడు. బౌలర్లకు ప్రత్యేకించి పేసర్లు రనప్ ఏరియాను ఓ కంట కనిపెడుతూనే బౌలింగ్ చేయాల్సి ఉంటుందని చెప్పాడు. ఈ వేదికపై అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్‌ల మధ్య శనివారం జరిగిన మ్యాచ్ సమయంలో ఇరు జట్ల ఆటగాళ్లు బంతిని అందుకునే క్రమంలో పదేపదే జారి పడ్డారు. దీంతో అఫ్గాన్ కోచ్ జొనాథన్ ట్రాట్ అవుట్‌ఫీల్డ్ చెత్తగా ఉందన్నాడు.

లాస్ ఏంజెలిస్-2028 ఒలింపిక్స్‌లో క్రికెట్!

ఐఓసీ ఆమోదమే తరువాయి

దుబాయ్: లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్ మ్యాచ్‌లకు టాస్ పడే అవకాశాలు మెరుగయ్యాయి. 2028లో అమెరికాలో జరిగే ఈ విశ్వక్రీడల కోసం నిర్వాహకులు క్రికెట్ క్రీడను చేర్చేందుకు సిఫారసు చేశారు. దీనిపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) హర్షం వ్యక్తం చేసింది. ఒలింపిక్స్‌లో క్రికెట్ నిర్వహణ కోసం ఐసీసీ... లాస్ ఏంజెలిస్ నిర్వాహక కమిటీతో కొంతకాలంగా సంప్రదింపులు జరుపుతోంది. మొత్తానికి కమిటీ సిఫారసు చేయడంతో ఇక అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఆమోదమే మిగిలుంది. ఐఓసీ ఓకే అంటే అమెరికాలో క్రికెట్ ఆటకు రంగం సిద్ధమవుతుంది. ఈనెల 15 నుంచి 17 వరకు ముంబైలో జరిగే ఐఓసీ సమావేశంలో క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో క్రీడాంశంగా చేర్చాలా వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకుంటారు.

కివీస్ గెలుపు జోరు...

ప్రపంచకప్‌లో మరో ఏకపక్ష విజయం... గత టోర్నీ రన్నరప్ న్యూజిలాండ్ సమష్టి ప్రదర్శన ముందు అసోసియేట్ టీమ్ నెదర్లాండ్స్ నిలవలేకపోయింది... బ్యాటింగ్ పిచ్‌పై ముందుగా భారీ స్కోరు నమోదు చేసిన న్యూజిలాండ్ విసిరిన సవాల్‌కు పసికూన నెదర్లాండ్స్ వద్ద జవాబు లేకపోయింది... ఫలితంగా కివీస్ ఖాతాలో వరుసగా రెండో విజయం చేరగా... హైదరాబాద్ వేదికగా ఆడిన రెండు మ్యాచుల్లోనూ డచ్ బృందానికి ఓటమే ఎదురైంది. బ్యాటింగ్‌లో విల్ యంగ్, లాథమ్, రచిన్ రవీంద్ర, బౌలింగ్‌లో సాన్‌ట్నర్ న్యూజిలాండ్ విజయసారథులుగా నిలిచారు.

- న్యూజిలాండ్‌కు రెండో విజయం
- 99 పరుగులతో నెదర్లాండ్స్‌పై గెలుపు
- రాణించిన యంగ్, సాన్‌ట్నర్



సాన్‌ట్నర్



యంగ్



రచిన్



లాథమ్

సాక్షి, హైదరాబాద్: న్యూజిలాండ్ జట్టు తమపై ఉన్న అంచనాలను నిలబెట్టుకుంటూ మళ్లీ సత్తా చాటింది. విడిగా చూస్తే విధ్వంసక ప్రదర్శనలు లేకపోయినా... ప్రతీ ఒక్కరూ రాణించడంతో క్వాలిఫయర్ జట్టు నెదర్లాండ్స్‌పై కివీస్ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. సోమవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన పోరులో న్యూజిలాండ్ 99 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. విల్ యంగ్ (80 బంతుల్లో 70; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), టామ్ లాథమ్ (46 బంతుల్లో 53; 6 ఫోర్లు, 1 సిక్స్), రచిన్ రవీంద్ర (51 బంతుల్లో 51; 3 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించగా... డరైల్ మిచెల్ (47 బంతుల్లో 48; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం నెదర్లాండ్స్ 46.3 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కొలిన్ అకెర్‌మన్ (73 బంతుల్లో 69; 5 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ సాన్‌ట్నర్ (5/59) ఉప్పల్ స్టేడియంలో వన్డేల్లో ఐదు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా నిలిచాడు.

సమష్టి బ్యాటింగ్‌తో...

ఆశ్చర్యకర రీతిలో న్యూజిలాండ్ ఇన్నింగ్స్ బాగా నెమ్మదిగా ప్రారంభమైంది. తొలి మూడు ఓవర్లూ ఒక్క పరుగు లేకుండా మెయిడిన్లుగా ముగియడం విశేషం. అయితే ఆ తర్వాత జట్టు ధాటిని పెంచింది. కాన్వే (40 బంతుల్లో 32; 5 ఫోర్లు, 1 సిక్స్), యంగ్ చక్కటి బ్యాటింగ్‌తో తర్వాతి 7 ఓవర్లలో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 63 పరుగులు రాబట్టారు. ఈ జోడీ విడిపోయిన తర్వాత వచ్చిన రచిన్ తన ఫామ్‌ను కొనసాగించాడు. 59 బంతుల్లో యంగ్ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, రచిన్‌కు హాఫ్ సెంచరీ కోసం 50 బంతులే సరిపోయాయి. మరో ఎండ్‌లో మిచెల్ కూడా జోరు ప్రదర్శించాడు. కానీ ఈ దశలో డచ్ బౌలర్లు ప్రత్యర్థిని కొద్దిసేపు నిలువరించారు. 16 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు తీసి దెబ్బ కొట్టారు. అయితే మరోవైపు లాథమ్ దూకుడు కివీస్ స్కోరును 300 వందలు దాటించింది. సాన్‌ట్నర్ (17 బంతుల్లో 36 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా చెలరేగడంతో చివర్లో భారీ స్కోరు చేయడంలో న్యూజిలాండ్ సఫలమైంది. ఆఖరి 10 ఓవర్లలో 84 పరుగులు సాధించిన న్యూజిలాండ్ వీటిలో చివరి 3 ఓవర్లలోనే 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 50 పరుగులు రాబట్టడం విశేషం.

అకెర్‌మన్ మినహా...

భారీ లక్ష్యాన్ని ఛేదించే ప్రయత్నంలో ఏ దశలోనూ నెదర్లాండ్స్ ఇన్నింగ్స్ వేగంగా సాగలేదు. పాక్‌తో మ్యాచ్‌తో పోలిస్తే జట్టు బ్యాటింగ్ ఈ సారి పేలవంగా కనిపించింది. ఓపెనర్లు విక్రమ్‌జిత్ (12), డౌడ్ (16) విఫలం కాగా, అకెర్‌మన్ ఒక్కడే పోరాడగలిగాడు. అకెర్‌మన్, తేజ నిడమనూరు (26 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) మధ్య నమోదైన 50 పరుగుల భాగస్వామ్యమే ఈ ఇన్నింగ్స్‌లో పెద్దది. క్రీజ్‌లో నిలదొక్కుకొని చక్కటి షాట్లతో జోరు పెంచిన దశలో తేజ లేని రెండో పరుగు కోసం అనవసరంగా ప్రయత్నించాడు. అకెర్‌మన్‌తో సమన్వయ లోపంతో అతను రనౌటయ్యాడు. 55 బంతుల్లో అకెర్‌మన్ అర్ధ సెంచరీ పూర్తయింది. చివర్లో స్కాట్ ఎడ్వర్డ్స్ (27 బంతుల్లో 30; 2 ఫోర్లు, 1 సిక్స్), సైబ్రాండ్ (34 బంతుల్లో 29; 3 ఫోర్లు) కొంత వరకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. లక్ష్యానికి చాలా దూరంలో నెదర్లాండ్స్ ఇన్నింగ్స్ ముగిసింది.

ప్రపంచకప్‌లో నేడు

ఇంగ్లండ్ X బంగ్లాదేశ్
వేదిక: ధర్మశాల
ఉదయం గం. 10:30 నుంచి

పాకిస్తాన్ X శ్రీలంక
వేదిక: హైదరాబాద్

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) డి లీడ్ (బి) వాండర్ మెర్వ్ 32; యంగ్ (సి) డి లీడ్ (బి) మీకెరెన్ 70; రచిన్ (సి) ఎడ్వర్డ్స్ (బి) వాండర్ మెర్వ్ 51; మిచెల్ (బి) మీకెరెన్ 48; లాథమ్ (స్టంప్డ్) ఎడ్వర్డ్స్ (బి) దత్ 53; ఫిలిప్స్ (సి) ఎడ్వర్డ్స్ (బి) డి లీడ్ 4; చాప్‌మన్ (సి) వాండర్ మెర్వ్ (బి) దత్ 5; సాన్‌ట్నర్ (నాటౌట్) 36; హెన్రీ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 322. వికెట్ల పతనం:** 1-67, 2-144, 3-185, 4-238, 5-247, 6-254, 7-293. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 10-2-62-2, ర్యాన్ క్లీన్ 7-1-41-0, మీకెరెన్ 9-0-59-2, వాండర్ మెర్వ్ 9-0-56-2, అకెర్‌మన్ 4-0-28-0, డి లీడ్ 10-0-64-1, విక్రమ్‌జిత్ 1-0-9-0.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జిత్ (బి) హెన్రీ 12; డౌడ్ (ఎల్బీ) (బి) సాన్‌ట్నర్ 16; అకెర్‌మన్ (సి) హెన్రీ (బి) సాన్‌ట్నర్ 69; డి లీడ్ (సి) బౌల్ట్ (బి) రచిన్ 18; తేజ (రనౌట్) 21; ఎడ్వర్డ్స్ (సి అండ్ బి) సాన్‌ట్నర్ 30; సైబ్రాండ్ (సి) కాన్వే (బి) హెన్రీ 29; వాండర్‌మెర్వ్ (సి) హెన్రీ (బి) సాన్‌ట్నర్ 1; క్లీన్ (ఎల్బీ) (బి) సాన్‌ట్నర్ 8; ఆర్యన్ దత్ (బి) హెన్రీ 11; మీకెరెన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (46.3 ఓవర్లలో ఆలౌట్) 223. వికెట్ల పతనం:** 1-21, 2-43, 3-67, 4-117, 5-157, 6-174, 7-180, 8-198, 9-218, 10-223. **బౌలింగ్:** బౌల్ట్ 8-0-34-0, హెన్రీ 8.3-0-40-3, సాన్‌ట్నర్ 10-0-59-5, ఫెర్గూసన్ 8-0-32-0, రచిన్ రవీంద్ర 10-0-46-1, ఫిలిప్స్ 2-0-11-0.

సినిమా

కథ విన్నారా?



● నాగార్జున

హీరో నాగార్జున, తమిళ దర్శకుడు నవీన్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనుందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఇటీవల నాగార్జునను కలిసి, ఓ కథ వినిపించారట నవీన్. స్క్రిప్ట్ నచ్చడంతో నాగార్జున గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ప్రస్తుతం ఈ స్క్రిప్ట్‌కు పూర్తిస్థాయిలో మెరుగులుదిద్దే పనిలో నవీన్ ఉన్నారనే ప్రచారం ఫిల్మ్‌నగర్‌లో జోరుగా సాగుతోంది. అంతేకాదు.. నాగార్జున కెరీర్‌లో ఇది వందో చిత్రమట. మరోవైపు ప్రస్తుతం 'నా సామిరంగ' సినిమా చేస్తున్నారు నాగార్జున. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాకు శ్రీనివాసా చిట్టూరి నిర్మాత. సంక్రాంతి సందర్భంగా జనవరిలో 'నా సామిరంగ' విడుదల కానుంది.


మార్చిలో మొదలు?



● మహేశ్ బాబు

'గుంటూరుకారం' సినిమాతో బిజీగా ఉన్నారు హీరో మహేశ్ బాబు. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత దర్శకుడు త్రివిక్రమ్‌తో మహేశ్ చేస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలున్నాయి. ఈ సినిమా జనవరి 12న విడుదల కానుంది. అయితే దర్శకుడు రాజమౌళితో మహేశ్ బాబుకు ఓ సినిమా కమిట్‌మెంట్ ఉన్న సంగతి తెలిసిందే. ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామాగా రూపొందనున్న ఈ సినిమాకు విజయేంద్ర ప్రసాద్ కథ సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ కథ ఓ కొలిక్కి వచ్చిందని, మార్చిలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను మొదలు పెట్టేలా రాజమౌళి అండ్ కో ప్రణాళికలు రచిస్తున్నారని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది.

ఒక్కటి గుర్తు పెట్టుకోండి!



● జీవా, మమ్ముట్టి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర నేపథ్యంలో దర్శకుడు మహి వి.రాఘవ్ తెరకెక్కించిన చిత్రం 'యాత్ర'. వైఎస్ఆర్ పాత్రలో మమ్ముట్టి నటించారు. 2019 ఫిబ్రవరి 8న విడుదలైన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'యాత్ర 2' మూవీని తెరకెక్కిస్తున్నారు మహి వి.రాఘవ్. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జీవితంలోని కొన్ని ఘటనల నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ మూవీలో వైఎస్ జగన్ పాత్రలో తమిళ హీరో జీవా నటిస్తున్నారు. 'యాత్ర'లో వైఎస్ఆర్ పాత్ర పోషించిన మమ్ముట్టి 'యాత్ర 2' లోనూ అదే పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాలోని వైఎస్ రాజశేఖర రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'నేనెవరో ఇంకా ఈ ప్రపంచానికి తెలియక పోవచ్చు. కానీ, ఒక్కటి గుర్తు పెట్టుకోండి... నేను వైఎస్ రాజశేఖర రెడ్డి కొడుకుని' అనే అనే డైలాగ్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఉన్నాయి. మహి వి.రాఘవ్ మాట్లాడుతూ– ''వైఎస్ జగన్‌గారు ప్రజా నాయకుడిగా ఎదిగిన తీరు, 2009 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ ఘటనల నేపథ్యంలో 'యాత్ర 2' రూపొందుతోంది. ఈ సినిమాని 2024 ఫిబ్రవరి 8న రిలీజ్ చేస్తాం'' అన్నారు. త్రీ ఆటమ్ లీవ్స్, వీ సెల్యులాయిడ్‌పై శివ మేక నిర్మిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మధి, సంగీతం: సంతోష్ నారాయణన్.



● రెజీనా

మరికాస్త ముందుకు ఎక్స్‌ట్రా



● నితిన్

అనుకున్న సమయానికంటే ముందుగానే థియేటర్స్‌కు వస్తున్నారు హీరో నితిన్. వక్కంతం వంశీ దర్శకత్వంలో నితిన్ హీరోగా 'ఎక్స్‌ట్రా: ఆర్డినరీ మేన్' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్య మూవీస్ అండ్ ఎంటర్‌టైన్మెంట్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాను తొలుత డిసెంబరు 23న విడుదల చేయాలనుకున్నారు. అయితే ఆ సమయానికి ప్రభాస్ హీరోగా నటించిన 'సలార్:సీజ్‌ఫైర్' చిత్రం రిలీజ్‌కు సిద్ధం కావడంతో 'ఎక్స్‌ట్రా'ని కాస్త ముందుగానే డిసెంబరు 8న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు హారిస్ జైరాజ్ స్వరకర్త.

నాకూ అలా అనిపిస్తోంది - విశ్వక్ సేన్



● విశ్వక్ సేన్, ఆనంది, రోహిత్

''విధి' నిర్మాత రంజిత్ నాకు మంచి స్నేహితుడు. ప్రొడక్షన్‌లో సాయం చేసేందుకు, సపోర్ట్‌గా నిలిచేందుకు నాకూ ఓ బ్రదర్ ఉంటే బాగుండని ఈ దర్శకుల్ని(శ్రీకాంత్, శ్రీనాథ్) చూస్తుంటే అనిపిస్తోంది. 'విధి' టీజర్ బాగుంది.. సినిమా పెద్ద హిట్ కావాలి.. నిర్మాతకు మంచి లాభాలు రావాలి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. రోహిత్ నందా, ఆనంది జంటగా శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్ దర్శకద్వయం తెరకెక్కించిన చిత్రం 'విధి'. రంజిత్ ఎస్ నిర్మించిన ఈ సినిమా నవంబర్ 3న విడుదలకానుంది. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ చిత్రం టీజర్‌ను ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వక్ సేన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రంజిత్ ఎస్ మాట్లాడుతూ–''మా సినిమా కథ చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. కథ, కథనాలను ప్రేక్షకులు ముందుగా ఊహించలేరు'' అన్నారు. ''మనం మాట్లాడటం కంటే.. మనం తీసే సినిమానే మాట్లాడాలనుకుంటున్నాం'' అన్నారు శ్రీకాంత్ రంగనాథన్, శ్రీనాథ్ రంగనాథన్. ''మా సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి'' అన్నారు రోహిత్ నందా, ఆనంది.

వినోదాల ప్రేమ



● కార్తీక్ రత్నం

కార్తీక్ రత్నం, సుప్యర్థ సింగ్ జంటగా ఆనంద్ బడా దర్శకత్వంలో రూపొందిన రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ 'లింగొచ్చా..'. 'గేమ్ ఆఫ్ లవ్' అనేది ఉపశీర్షిక. జె.నీలిమ సమర్పణలో యాదగిరి రాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు ఆనంద్ బడా మాట్లాడుతూ– ''హైదరాబాద్ నేపథ్యంలో సాగే లవ్ అండ్ రొమాంటిక్ కామెడీ డ్రామా 'లింగొచ్చా..'' అన్నారు. ఈ సినిమాకు సంగీతం: బికాజ్ రాజ్, సహ నిర్మాత: మల్లేష్ కంజర్ల.

యూత్‌ఫుల్ కిస్మత్



● అభినవ్, విశ్వ, నరేష్

నరేష్ అగస్త్య, అభినవ్ గోమఠం, అవసరాల శ్రీనివాస్, విశ్వ దేవ్, రియా సుమన్ ప్రధాన పాత్రల్లో నటించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'కిస్మత్'. శ్రీనాథ్ బాదినేని దర్శకత్వంలో రాజు నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను హీరో సత్యదేవ్ విడుదల చేశారు. ''బెస్ట్ బడ్డీస్ కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఫన్ రైడ్ 'కిస్మత్'. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: మార్క్ కె. రాబిన్, కెమెరా: వేదరామన్ శంకరన్, సహ నిర్మాత: సీహెచ్ భానుప్రసాద్ రెడ్డి.

చదువు గొప్పదనం నేపథ్యంలో...



● అభయ్ నవీన్, కుశాలిని

''**రా**క్షస కావ్యం' బడ్జెట్ పరంగా చిన్న సినిమా. కానీ, కథ పరంగా పెద్ద సినిమా. పురాణాల్లోని జయవిజయ పాత్రల్ని స్ఫూర్తిగా తీసుకుని, కలియుగంలో వారు జన్మిస్తే ఎలా ఉంటుంది? అనే ఊహతో 'రాక్షస కావ్యం' తీశా'' అని డైరెక్టర్ శ్రీమాన్ కీర్తి అన్నారు. అభయ్ నవీన్, అన్వేష్ మైఖేల్, పవన్ రమేష్, దయానంద్ రెడ్డి, కుశాలిని, రోహిణి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాక్షస కావ్యం'. దాము రెడ్డి, శింగనమల కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో దామురెడ్డి మాట్లాడుతూ–''ఇదొక వైవిధ్యమైన ప్రయోగాత్మక చిత్రం. ఈ మూవీలో ఫ్యామిలీ డ్రామా, భావోద్వేగాలతో పాటు చదువు గొప్పదనాన్ని చెబుతున్నాం'' అన్నారు. ''ఇటీవల వేసిన ప్రీమియర్స్‌కి మంచి స్పందన వచ్చింది'' అన్నారు అభయ్ నవీన్. నటీనటులు కుశాలిని, దయానంద్ రెడ్డి, యాదమ్మ రాజు, అన్వేష్ మైఖేల్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: నవీన్ రెడ్డి, వసుంధరా దేవి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఉమేష్ చిక్కు.

లక్కీ చాన్స్

దక్షిణాది ప్రేక్షకులకు హీరోయిన్ రెజీనా సుపరిచితురాలే. కానీ ఇటీవల కాలంలో ఈ బ్యూటీకి చెప్పుకోదగ్గ హిట్ దక్కలేదు. ఇలాంటి సమయంలో రెజీనాకు ఓ లక్కీచాన్స్ లభించిందని కోలీవుడ్ టాక్. అజిత్ హీరోగా మగిళ తిరుమేణి దర్శకత్వంలో 'విడాముయార్చి' అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిష నటిస్తున్నారని సమాచారం. అలాగే కథ రీత్యా ఈ సినిమాలో మరో హీరోయిన్‌కు చాన్స్ ఉందని, ఈ అవకాశం రెజీనా తలుపు తట్టిందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. మరి.. ఈ మూవీలో రెజీనా నటి స్తారా? లేదా? వేచి చూడాలి. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ విదేశాల్లో జరుగుతోంది. వచ్చే ఏడాది ఈ సినిమాని విడుదల చేయాలనుకుంటున్నారు.


అంబాజీపేట బ్యాండు



● సుహాస్, శివాని

సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు'. దుశ్యంత్ కటికినేని దర్శకుడు. జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్‌పై నిర్మించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ విడుదలలో దర్శకులు మారుతి, హను రాఘవపూడి, శైలేష్ కొలను, సాయి రాజేశ్, సందీప్ రాజ్, ప్రశాంత్, మెహర్ రమేశ్, భరత్ కమ్మ, నిర్మాతలు ఎస్‌కేఎన్, శరత్ అతిథులుగా పాల్గొన్నారు. ''నాలాంటి కొత్త డైరెక్టర్‌కు చాన్స్ ఇచ్చిన అల్లు అరవింద్, 'బన్ని' వాసు, వెంకటేష్ మహాగార్లకు, సుహాస్‌కి థ్యాంక్స్'' అన్నారు దుశ్యంత్ కటికినేని. ''నా కెరీర్‌లో ఈ మూవీ మైలురాయిగా నిలుస్తుంది'' అన్నారు సుహాస్. సినిమాటోగ్రాఫర్ వాజిద్ బేగ్, మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర మాట్లాడారు.

హారర్ కామెడీ



● పూజిత, శివ, జ్యోతి

శివ, గోవా జ్యోతి, స్వర్ణలత, పూజిత, సుమన్ శెట్టి, అప్పారావు ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'యజ్ఞ'. చిత్తజల్లు ప్రసాద్ దర్శకత్వంలో ఆర్‌ఆర్ మూవీ క్రియేషన్స్‌పై చిలుకోటి రఘురామ్, చలపల్లి విఠల్ గౌడ్, చిత్తజల్లు ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్, పాటల విడుదల వేడుకలో తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, నిర్మాత సాయి వెంకట్, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ పాల్గొన్నారు. ''వినోదం, ప్రేమ, యాక్షన్ నేపథ్యంలో ఈ మూవీ రూపొందుతోంది'' అన్నారు చిత్తజల్లు ప్రసాద్. ''మా చిత్రంలోని నటీనటులకు మంచి పేరు వస్తుంది'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి సమర్పణ: దేశ్‌పాండే, సుభాష్, రావ్(దొర) ముళ్లవరం, కెమెరా: జి.కృష్ణనాయుడు, సంగీతం: లక్ష్మణ సాయి.

సాక్షి బిజినెస్
మంగళవారం
10-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
483	141
65,512	19,512

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	13,469	△	36
డోజోన్స్	33,561	△	154
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,492	▽	2
డాక్స్	15,128	▽	102
షాంఘై	3,097	▽	14
నికాయ్ (శుక్రవారం ముగింపు)	30,995	▽	81

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	57,332
బంగారం (22 క్యారట్)	57,102
వెండి (కేజీ)	68,493

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.98	103.31
€	యూరో	ఒకటి	86.38	89.46
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.00	56.71
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.87	54.16
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.95	61.88
SAR	సౌదీ రియాల్	ఫారెక్స్	21.25	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	ఫారెక్స్	21.77	23.57
¥	చైనా యువాన్	ఫారెక్స్	10.30	12.37

మా ప్రతిష్టను దెబ్బతీసేందుకు విదేశీ శక్తుల కుట్ర

అదానీ గ్రూప్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: సుప్రీం కోర్టులో తమ కేసు వచ్చే వారం విచారణకు రానున్న నేపథ్యంలో తమ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొన్ని విదేశీ శక్తులు కుట్రలను కొనసాగిస్తున్నాయని అదానీ గ్రూప్ ఆరోపించింది. బొగ్గు దిగుమతులకు సంబంధించిన పాత, నిరాధార ఓవర్-ఇన్‌వాయిసింగ్ ఆరోపణలను పదే పదే ప్రచారం చేసి గ్రూప్‌ను ఆర్థికంగా అస్థిరపర్చేందుకు ఒక విదేశీ ప్రచురణ సంస్థ ప్రయత్నిస్తోందని ఒక ప్రకటనలో పేర్కొంది. 2016లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) జారీ చేసిన ఒక సర్క్యులర్ ఆధారంగా తమపై కథనాన్ని ప్రచురించబోతోందని అదానీ గ్రూప్ వివరించింది. అప్పటి డీఆర్ఐ సర్క్యులర్‌లో 40 పైచిలుకు దిగుమతిదార్ల పేర్లు ఉండగా కేవలం తమ కంపెనీని మాత్రమే లక్ష్యంగా ఎంచుకుందని పేర్కొంది. ఇన్‌వాయిస్‌ను పెంచి చూపిన కేసులో డీఆర్ఐ సుప్రీం కోర్టుకు వెళ్లగా.. అక్కడా తమకు అనుకూలంగానే తీర్పు వచ్చిందని వివరించింది. అదానీ గ్రూప్ కంపెనీల ఖాతాలు, షేర్ల ధరల్లో అవకతవకలపై సెబీ నిర్వహించిన దర్యాప్తుపై సుప్రీం కోర్టు ఈ వారంలో విచారణ చేపట్టనున్న నేపథ్యంలో గ్రూప్ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది.

రిలయన్స్ జువెల్స్ నుంచి 'స్వర్ణ బంగా' కలెక్షన్



న్యూఢిల్లీ: పండుగ సీజన్ సందర్భంగా రిలయన్స్ జువెల్స్ 'స్వర్ణ బంగా' కలెక్షన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. రిలయన్స్ ఆభరణాల శ్రేణిలో ఈ ఎనిమిదో కలెక్షన్‌ను బాలీవుడ్ నటి కరిష్మ కపూర్ ఆవిష్కరించారు. 'బెంగాలీలకు ఒక కావ్యాత్మక బహుమతి ఈ స్వర్ణ బంగా కలెక్షన్. టెర్రకోట సూక్ష్మత్వం, శాంతినికేతన్ నిర్మలత్వం, దుర్గాదేవీ పూజ సంబరం ప్రేరణలతో వీటిని రూపొందించాము. తప్పక కస్టమర్ల ఆదరణ పొందుతుంది' అని సంస్థ సీఈవో సునీల్ నాయక్ తెలిపారు. సాంస్కృతిక సంపద, ఆత్మ సౌందర్యం, శోభను కోరుకునే ప్రతి ఒక్కరికి ఈ కలెక్షన్‌ను సిఫార్సు చేస్తానని కరిష్మా కపూర్ అన్నారు. స్వర్ణ బంగా కలెక్షన్ అన్ని రిలయన్స్ జువెల్స్ స్టోర్లలో లభ్యమవుతుంది.

రత్నాలు-ఆభరణాల వాణిజ్యంపై ఎఫెక్ట్

- ఇజ్రాయెల్, హమాస్ ఘర్షణలపై నిపుణుల అంచనా
- మొత్తం వాణిజ్య విలువ దాదాపు 12 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: ఇజ్రాయెల్-హమాస్ వివాదం భారత్-ఇజ్రాయెల్ మధ్య రత్నాలు, ఆభరణాల వ్యాపారంపై ప్రభావం చూపుతుందని ఎగుమతిదారులు సోమవారం తెలిపారు. 2021-22లో భారత్ రెండు దేశాల మధ్య రత్నాలు, ఆభరణాల వాణిజ్యం 2.8 బిలియన్ డాలర్లు. 2022-23లో ఈ విలువ 2.04 బిలియన్ డాలర్లుగా ఉంది. కట్, పాలిష్డ్ వజ్రాలు భారతదేశం నుండి ఇజ్రాయెల్‌కు అత్యధికంగా ఎగుమతి అవుతున్నాయి. తర్వాతి స్థానంలో ల్యాబ్‌లో రూపొందించిన వజ్రాల వాటా ఉంది. ఇక ఇజ్రాయెల్ నుంచి భారత్ ప్రధానంగా కఠిన (రఫ్) వజ్రాలను దిగుమతి చేసుకుంటోంది. 2022-23లో సరుకులు, సేవల రంగాలలో మొత్తం భారతదేశం-ఇజ్రాయెల్ వాణిజ్యం దాదాపు 12 బిలియన్ డాలర్లుగా అంచనా. 2022-23లో ఇజ్రాయెల్ నుండి భారత్‌కు జరిగిన ఒక్క సరుకు ఎగుమతుల విలువ 8.4 బిలియన్ డాలర్లు. దిగుమతుల విలువ 2.3 బిలియన్ డాలర్లు. వెరసి ఇది 6.1 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులుకు దారితీసింది. ఇజ్రాయెల్‌కు భారత్ ఎగుమతుల్లో డీజిల్, కట్, పాలిష్డ్ వజ్రాలు ఉన్నాయి. దిగుమతుల్లో రఫ్ డైమండ్స్, కట్ అండ్ పాలిష్డ్ డైమండ్స్, ఎలక్ట్రానిక్స్, టెలికం పరికరాలు, పొటాషియమ్ క్లోరైడ్, హెర్బిసైడ్‌లు ఉన్నాయి. ఇజ్రాయెల్‌తో భారత్ వాణిజ్యం ఎక్కువగా ఎర్ర సముద్రంలో ఉన్న ఈలాట్ నౌకాశ్రయం ద్వారా జరుగుతోంది.

నిపుణులు ఏమన్నారంటే...




ఇజ్రాయెల్‌కు భారత ఎగుమతులపై తాజా పరిణామాల ప్రతికూల ప్రభావం ఉంటుంది. ముఖ్యంగా ఇక్కడ రత్నాలు, ఆభరణాల పరిశ్రమ తీవ్ర ప్రతికూల ప్రభావానికి గురికావచ్చు. రఫ్ వజ్రాలకు దేశంలో కొరత ఏర్పడే వీలుంది.

– కొలిన్ షా, కామా జ్యువెలరీ ఎండీ



ఇజ్రాయెల్‌లోని మూడు అతిపెద్ద నౌకాశ్రయాలు – హైఫా, అష్డోద్, ఈలత్‌లలో కార్యకలాపాలు అంతరాయం కలిగితే ఆ దేశంతో భారత్ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఎగుమతులకు ప్రతికూల పరిణామం ఇది.

– అజయ్ శ్రీవాస్తవ, జీటీఆర్ఐ సహ వ్యవస్థాపకులు



ఈ వివాదం స్వల్పకాలంలో భారతీయ ఎగుమతిదారులపై ప్రభావం చూపుతుంది. యుద్ధం తీవ్రతరం అయితే, ఆ ప్రాంతానికి ఎగుమతులు జరిపే ఎగుమతిదారులకు మరిన్ని ఇబ్బందులు ఎదురుకావచ్చు.

– శరద్ కుమార్ సరాఫ్, టెక్నోక్రాఫ్ట్ ఇండస్ట్రీస్ ఇండియా వ్యవస్థాపక చైర్మన్

ఫార్మాపై ప్రభావం తక్కువే!



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పాలస్తీనా-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం ప్రభావం భారత ఫార్మాపై పడే అవకాశం లేదని ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అభిప్రాయపడింది. దేశం నుంచి ఇజ్రాయెల్‌కు 2022-23లో ఎగుమతైన ఔషధాల విలువ రూ.766 కోట్లు. అంత క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 50 శాతం కంటే అధికం. దేశీయ మార్కెట్ నుంచి బల్క్ డ్రగ్స్ (ఏపీఐ), డ్రగ్ ఫార్ములేషన్స్, బయాలాజిక్స్ ఆ దేశానికి సరఫరా అవుతున్నాయి. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ముఖ్యంగా ఫార్మా రంగంలో వాణిజ్యం తక్కువగా ఉన్నందున.. ఫార్మాస్యూటికల్ వ్యాపారంపై పెద్దగా ప్రభావం కనిపించడం లేదని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రవి ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. 'ఔషధ తయారీ రంగంలో ఇజ్రాయెల్ బలంగా ఉంది. అలాగే అధిక నియంత్రణ కలిగిన ఫార్మా మార్కెట్ ఆ దేశం ప్రత్యేకత. సహజంగానే యుద్ధం కారణంగా సరఫరా అంతరాయాలు ఉంటాయి' అని అభిప్రాయపడ్డారు.

దలాల్ స్ట్రీట్‌పైనా 'యుద్ధ' సెగలు

- ఇజ్రాయెల్ -పాలస్తీనా పరస్పర దాడుల ప్రభావం
- ఫైనాన్స్, బ్యాంకింగ్, ఇంధన షేర్లలో అమ్మకాలు
- సెన్సెక్స్ నష్టం 483 పాయింట్లు
- నిఫ్టీ 141 పాయింట్లు పతనం



ముంబై: ఇజ్రాయెల్ – పాలస్తీనా పరస్పర దాడుల ప్రభావం దలాల్ స్ట్రీట్‌పైనా ప్రతికూల ప్రభావాన్ని చూపింది. పశ్చిమాసియాలో ఉద్భవించిన యుద్ధ ఉద్రిక్తతల కారణంగా క్రూడాయిల్ ధరలు భగ్గుమన్నాయి. అమెరికా సెప్టెంబర్ ఉద్యోగ గణాంకాలు అంచనాలకు మించి నమోదవడంతో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు ఆందోళనలు మరోసారి తెరపైకి వచ్చాయి. అలాగే దేశీయ కార్పొరేట్ క్యూ2 ఫలితాలు, స్థూల ఆర్థిక డేటా వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. మార్కెట్లో అస్థిరతను సూచించే వీఐఎక్స్ ఇండెక్స్ 12% శాతానికి పైగా పెరిగి 11.40 స్థాయికి చేరింది. ఫలితంగా ఇన్వెస్టర్లు ఫైనాన్స్, బ్యాంకింగ్, ఇంధన షేర్లలో తలెత్తిన అమ్మకాలతో 483 పాయింట్లు పతనమై 65,512 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 141 పాయింట్లు నష్టపోయి 19,512 వద్ద నిలిచాయి. ప్రతికూల సంకేతాలతో ఉదయం నష్టాలతో మొదలైన సూచీలు రోజంతా బలహీనంగా ట్రేడయ్యాయి. అన్ని రంగాల షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 561 పాయింట్లు క్షీణించి 65,435 వద్ద, నిఫ్టీ 173 పాయింట్లు పతనమై 19,480 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.998 కోట్ల ఈక్విటీ షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2661 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియా, యూరప్ మార్కెట్లు అరశాతం నుంచి ఒకశాతం నష్టపోయాయి. కాగా అమెరికా మార్కె ట్లు అరశాతానికి పైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సెన్సెక్స్ 30 షేర్లలో హెచ్‌సీఎల్ టెక్ 1%, టీసీఎస్, హెచ్‌యూఎల్ షేర్లు 0.50% మాత్రమే లాభపడ్డాయి. మిగిలిన 27 షేర్లూ నష్టపోయాయి. ఈ సూచీ 0.75% క్షీణించడంతో బీఎస్‌ఈలో రూ.4 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద హరించుకుపోయింది.
- వెబ్ ఆధారిత కొత్త కమోడిటీ డెరివేటివ్స్ ప్లాట్‌ఫాం ప్రారంభించేందుకు సెబీ నుంచి అనుమతులు లభించడంతో బీఎస్‌ఈలో ఎంసీఎక్స్ షేరు 2% లాభపడి రూ.2,078 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 5.50% ర్యాలీ చేసి రూ.2149.50 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- అంతర్జాతీయంగా చమురు ధరలు వేడెక్కడం దేశీయ ఇంధన రంగ షేర్లపై మిశ్రమ ప్రభావం పడింది. ధరలు పెరగడంతో ఆయిల్ ఇండి యా, ఓఎన్‌జీసీ షేర్లు 5%, 1% చొప్పున లాభపడ్డాయి. అయిల్ మార్కెటింగ్ దిగ్గజాలు ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ షేర్లు 2% చొప్పున నష్టపోయాయి.
- సెప్టెంబర్ క్వార్టర్‌లో అమ్మకాలు రెండు రెట్లు వృద్ధి చెంది రూ. 7,092 కోట్లకు చేరడంతో ప్రెస్టేజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ షేరు అరశాతానికి పైగా లాభపడి రూ.664 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ 5% పెరిగి రూ.699 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.

టాప్ గేర్‌లో వాహన విక్రయాలు

- సెప్టెంబర్‌లో 20 శాతం అప్
- 15.63 లక్షల నుంచి 18.82 లక్షలకు పెరిగిన రిజిస్ట్రేషన్లు



న్యూఢిల్లీ: పండుగల సీజన్ నేపథ్యంలో దేశీయంగా ఆటోమొబైల్ రిటైల్ అమ్మకాలు సెప్టెంబర్‌లో గణనీయంగా పెరిగాయి. 18,82,071 వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. 2022 సెప్టెంబర్‌లో నమోదైన 15,63,735 యూనిట్లతో పోలిస్తే ఇది 20 శాతం అధికం. ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్ల సమాఖ్య ఫాడా ఒక ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించింది. దీని ప్రకారం సెప్టెంబర్‌లో ద్విచక్ర వాహనాల విక్రయాలు 22 శాతం, త్రిచక్ర వాహనాల అమ్మకాలు 49 శాతం, ప్యాసింజర్ వాహనాలు 19%, వాణిజ్య వాహనాల అమ్మకాలు 5 శాతం పెరిగాయి. అయితే, ట్రాక్టర్ల రిటైల్ అమ్మకాలు మాత్రం 10 శాతం తగ్గాయని ఎఫ్ఏడీఏ ప్రెసిడెంట్ మనీష్ రాజ్ సింఘానియా తెలిపారు. కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడం, ఆకర్షణీయమైన ప్రమోషనల్ ఆఫర్లు, ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పెరగడం తదితర అంశాలు మార్కెట్ సెంటిమెంటు మెరుగుపడటానికి దోహదపడినట్లు ఆయన పేర్కొన్నారు. సానుకూల పరిస్థితులతో ఈ పండుగ సీజన్ ఆటోమొబైల్ రంగానికి మెరుగ్గా ఉండగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫాడా నివేదికలో మరిన్ని వివరాలు ..

- సెప్టెంబర్‌లో వాహనాల లభ్యత మెరుగుపడటంతో కార్ల అమ్మకాలు 19 శాతం పెరిగి 2,79,137 నుంచి 3,32,248 యూనిట్లకు పెరిగాయి.
- ద్విచక్ర వాహనాల అమ్మకాలు 10,78,286 యూనిట్ల నుంచి 13,12,101కు చేరాయి.
- వాణిజ్య వాహనాల విక్రయాలు 5 శాతం వృద్ధి చెంది 80,804 యూనిట్లకు పెరిగాయి.
- త్రిచక్ర వాహనాలు విక్రయాలు 68,937 యూనిట్ల నుంచి 49 శాతం పెరిగి 1,02,426 యూనిట్లకు ఎగిశాయి.
- ట్రాక్టర్ అమ్మకాలు 60,321 యూనిట్ల నుంచి 54,492 యూనిట్లకు తగ్గాయి.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ జెన్‌కోలో 60 కెమిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో) రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్వహణతో పాటు ఇప్పటికే ఉన్న పాత విద్యుత్ కేంద్రాల అవసరాల కోసం కెమిస్ట్ పోస్టులను భర్తీ చేయనుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 60 (లిమిటెడ్ రిక్రూట్‌మెంట్-03, జనరల్ రిక్రూట్‌మెంట్-57).
» **అర్హత:** బీఎస్సీ(కెమిస్ట్రీ), మొదటి శ్రేణిలో ఎంఎస్సీ(కెమిస్ట్రీ/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.65,600 నుంచి రూ.1,31,220.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సర్టిఫికేట్ల వెరిఫికేషన్, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.10.2023
» **రాతపరీక్ష తేది:** 03.12.2023.
» **వెబ్‌సైట్:** www.tsgenco.co.in

తెలంగాణ జెన్‌కోలో 339 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో).. ప్రత్యక్ష, రెగ్యులర్ నియామకాల పద్ధతిలో అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 339
» **విభాగాలు:** ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్.
» **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/మెకానికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ కంట్రోల్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ పవర్/పవర్ ఎలక్ట్రానిక్స్/సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.65,600 నుంచి రూ.1,31,220.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, సర్టిఫికేట్ల వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.10.2023
» **రాతపరీక్ష తేది:** 03.12.2023.
» **వెబ్‌సైట్:** https://tsgenco.co.in

బీఈఎల్‌లో 232 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) దేశవ్యాప్తంగా ఉన్న బీఈఎల్ యూనిట్లు/కార్యాలయాల్లో.. ప్రొబేషనరీ ఇంజనీర్, ప్రొబేషనరీ ఆఫీసర్, ప్రొబేషనరీ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 232
» **పోస్టుల వివరాలు:** ప్రొబేషనరీ ఆఫీసర్-205, ప్రొబేషనరీ ఆఫీసర్(హెచ్‌ఆర్)-12, ప్రొబేషనరీ అకౌంట్స్ ఆఫీసర్-15.
» **అర్హత:** పోస్టును అనుసరించి బీఈ/బీటెక్/బీఎస్సీ(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/మెకానికల్/కంప్యూటర్ సైన్స్), ఎంబీఏ/ఎంఎస్‌డబ్ల్యూ/పీజీ/పీజీ డిప్లొమా(హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్/ఇండస్ట్రియల్ రిలేషన్స్/పర్సనల్ మేనేజ్‌మెంట్), సీఏ/సీఎంఏ ఫైనల్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.09.2023 నాటికి ప్రొబేషనరీ ఇంజనీర్‌కు 25 ఏళ్లు, ప్రొబేషనరీ అకౌంట్స్ ఆఫీసర్‌కు 30 ఏళ్లు మించకూడదు.
» **బేసిక్ పే స్కేల్:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పోస్టింగ్ ప్రదేశం:** బెంగళూరు, ఘజియాబాద్, పుణె, హైదరాబాద్, చెన్నై, మచిలీపట్నం, పంచకుల, కోట్‌ద్వారా, నవీ ముంబై.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.10.2023
» **పరీక్ష తేది:** డిసెంబర్ 2023.
» **వెబ్‌సైట్:** https://bel-india.in

ఆర్ఈసీఐపీఎంటీ, హైదరాబాద్‌లో ఫ్యాకల్టీ పోస్టులు

హైదరాబాద్‌లోని ఆర్ఈసీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పవర్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్(ఆర్ఈసీఐపీఎంటీ).. కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **అర్హత:** బీఈ, బీటెక్, పీజీ(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్)ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 65 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** recipmt@gmail.com
» **దరఖాస్తులకు చివరితేది:** 25.10.2023.
» **వెబ్‌సైట్:** www.recipmt.com

జనవరిలో.. జేఈఈ మెయిన్

» జేఈఈ-మెయిన్-2024 తేదీలు ఖరారు
» జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు తొలి సెషన్
» ఏప్రిల్ 1 నుంచి 15 వరకు రెండో సెషన్ పరీక్షలు
» తెలుగు రాష్ట్రాల నుంచి లక్షకు పైగా విద్యార్థుల హాజరు

జేఈఈ-మెయిన్.. ప్రతిష్టాత్మక ఎన్ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో.. బీటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! దీంతోపాటు ఐఐటీల్లో అడ్మిషన్స్ కోసం జరిపే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత పరీక్ష కూడా ఇదే!! ఇంతటి కీలకమైన పరీక్ష కోసం విద్యార్థులు ఇంటర్ ఎంపీసీలో చేరిన మొదటి రోజునుంచే అహర్నిశలు కృషి చేస్తారనేది నిస్సందేహం! వచ్చే ఏడాది జనవరి 24 నుంచి తొలి సెషన్‌ను, ఏప్రిల్ 1 నుంచి రెండో సెషన్‌ను నిర్వహిస్తామని ఎన్‌టీఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) తాజాగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. జేఈఈ మెయిన్ పరీక్ష విధానం, ఇందులో విజయం సాధించేందుకు మార్గాలు..



జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్.. మెయిన్.. సంక్షిప్తంగా జేఈఈ-మెయిన్. దేశంలోని ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో బీటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష ఇది. ఏటా లక్షల మంది పోటీ పడుతుంటారు. ఈ ఏడాది ఎన్‌టీఏ ముందుగానే పరీక్ష తేదీలను ప్రకటించింది. కాబట్టి విద్యార్థులు ఇప్పటి నుంచే నిర్దిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే.. జేఈఈ-మెయిన్‌లో మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

పది లక్షలకు పైగా పోటీ

జేఈఈ-మెయిన్ పరీక్షకు జాతీయ స్థాయిలో ఏటా పది లక్షల మందికిపైగా విద్యార్థులు పోటీ పడుతున్నారు. గత ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్ రెండు సెషన్లలో కలిపి 11,13,325 మంది పరీక్షకు హాజరయ్యారు. జనవరి సెషన్‌లో 8,23,967 మంది; ఏప్రిల్ సెషన్‌లో 8,83,367మంది పరీక్ష రాసారు. వీరిలో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల సంఖ్య 1.10 లక్షల మంది.

2024 తేదీలు ఖరారు

జేఈఈ-మెయిన్ 2024 తేదీలను ఎన్‌టీఏ ప్రకటించింది. తొలి సెషన్‌ను 2024 జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వరకు; రెండో సెషన్‌ను ఏప్రిల్ 1 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొంది. అంటే.. తొలి సెషన్‌కు మూడు నెలలు.. రెండో సెషన్ ఏడు నెలల సమయం అందుబాటులో ఉంది. కాబట్టి విద్యార్థులు సరైన టైమ్ ప్లాన్ రూపొందించుకొని జేఈఈ-మెయిన్‌కు సన్నద్ధమయ్యే అవకాశం ఉంది.

300 మార్కులకు

బీఈ, బీటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి మొత్తం 300 మార్కులకు జేఈఈ మెయిన్(పేపర్ 1) పరీక్ష నిర్వహిస్తారు. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 30 ప్రశ్నల చొప్పున మొత్తం 90 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సబ్జెక్టులో సెక్షన్ ఏ, సెక్షన్ బీ ఉంటాయి. సెక్షన్-ఎ పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో (ఎంసీక్యూలతో) ఉంటుంది. సెక్షన్-బిలో న్యూమరికల్ వాల్యూ ఆధారిత ప్రశ్నలుంటాయి. ఛాయిస్ విధానం కారణంగా సెక్షన్-బిలో 10 ప్రశ్నల్లో అయిదింటికి సమాధానం ఇస్తే సరిపోతుంది. సెక్షన్-ఎలో 0.25 శాతం నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది.

బోర్డ్+జేఈఈ మెయిన్

ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు డిసెంబర్ రెండో వారం నాటికి ఇంటర్మీడియెట్ సిలబస్‌ను పూర్తి చేసుకుంటారు. వీరు జేఈఈ-మెయిన్ జనవరి సెషన్ పరీక్షలో రాణించేలా ఇప్పటి నుంచి ఉమ్మడి అంశాలపై దృష్టిపెట్టాలి. ఇంటర్మీడియెట్, జేఈఈ-మెయిన్‌లో ఉన్న ఉమ్మడి టాపిక్స్ పునశ్చరణకు అధిక సమయం కేటాయించాలి. తద్వారా జేఈఈ-మెయిన్ జనవరి సెషన్‌లో మంచి ప్రతిభ కనబర్చడానికి అవకాశం ఉంటుంది.

అప్లికేషన్స్, కాన్సెప్ట్స్

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జేఈఈ-మెయిన్ పరీక్ష ప్రశ్నల తీరుపై అవగాహన పెంచుకోవాలి. ఆ దిశగా ఆయా సబ్జెక్ట్‌లను అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో అధ్యయనం చేయాలి. ముఖ్యంగా ఆయా సబ్జెక్ట్‌ల బేసిక్ కాన్సెప్ట్స్‌పై పట్టు సాధించాలి. వాటిని వాస్తవ పరిస్థితులతో అన్వయం చేసుకుంటూ చదవాలి. ఫలితంగా ఇంటర్ సబ్జెక్ట్‌లపై పూర్తి స్థాయి పట్టుతోపాటు జేఈఈ-మెయిన్‌లోనూ రాణించేందుకు అవకాశం ఏర్పడుతుంది. అదే విధంగా చదివేటప్పుడే ముఖ్యమైన ఫార్ములాలు, కీ పాయింట్స్‌ను షార్ట్ నోట్స్‌గా రూపొందించుకుంటే.. పరీక్ష సమయంలో రివిజన్‌కు ఎంతో కలిసొస్తుంది.

సిలబస్ అనుసంధానం

జేఈఈ-మెయిన్ విద్యార్థులు..మొదటి, ద్వితీయ సంవత్సరం సిలబస్‌ను అనుసంధానం చేసుకుంటూ చదవాలి. మొదటి సంవత్సరం అంశాలను, రెండో సంవత్సరం అంశాలతో అనుసంధానం చేసుకుంటూ అభ్యసనం సాగిస్తే.. సంబంధిత అంశంపై పూర్తి స్థాయిలో అవగాహన లభించడంతోపాటు ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది. జేఈఈ-మెయిన్ సిలబస్‌లో ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం సిలబస్ అంశాలకు సమ ప్రాధాన్యం ఉంటోంది. కాబట్టి రెండు సంవత్సరాల సిలబస్‌పై పట్టు సాధించేలా కృషి చేయాలి.

న్యూమరికల్ ప్రశ్నలకు

జేఈఈ-మెయిన్ అభ్యర్థులు న్యూమరికల్ టైప్ కొశ్చన్స్ ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. జేఈఈ-మెయిన్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్..ఈ మూడు సబ్జెక్ట్‌ల నుంచీ అయిదు ప్రశ్నలు చొప్పున న్యూమరికల్ ఆధారిత ప్రశ్నలు అడుగుతున్నారు. ఇంటర్ విద్యార్థులు అప్లికేషన్ ఆధారిత ప్రిపరేషన్‌కు, ఆయా సబ్జెక్ట్‌లలో న్యూమరిక్స్ ఆధారంగా సమాధానం సాధించాల్సిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం

ఇంటర్, జేఈఈ-మెయిన్ రెండు పరీక్షలకూ ప్రాక్టీస్ చాలా ముఖ్యం. కాబట్టి ప్రతిరోజు తాము చదివిన సబ్జెక్ట్‌కు సంబంధించి..అందులోంచి ప్రశ్నలు అడిగే ఆస్కారమున్న అంశాలను గుర్తించి ప్రాక్టీస్ చేయాలి. విద్యార్థులు మెయిన్ మాక్ టెస్ట్‌లకు, ఇంటర్ ప్రీ-ఫైనల్ టెస్ట్‌లకు హాజరు కావడం కూడా పరీక్షలో రాణించేందుకు దోహదం చేస్తుంది. జనవరి సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులకు ప్రస్తుతం దాదాపు నెలరోజుల సమయం అందుబాటులో ఉంది. ఈ సమయంలో వీరు అధిక సమయాన్ని పునశ్చరణకు, వీక్లీ టెస్ట్‌లకు, మాక్ టెస్ట్‌లకు కేటాయించాలి.

టైమ్ మేనేజ్‌మెంట్

ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్ చదివే విధంగా సమయం కేటాయించాలి. ప్రతి సబ్జెక్ట్‌కు కనీసం రెండు గంటల సమయం కేటాయించాలి. తమకు బాగా సులభమైన సబ్జెక్ట్‌కు కొంత తక్కువ సమయం కేటాయించి.. క్లిష్టంగా భావించే సబ్జెక్ట్‌లకు కొంత ఎక్కువ సమయం కేటాయించడం మేలు. క్లిష్టంగా భావించిన సబ్జెక్ట్‌లు,అంశాల విషయంలోనూ కనీసం బేసిక్ ఫార్ములాలు తెలుసుకోవాలి. అంతకుముందు రోజు చదివిన అంశాన్ని ఒకసారి పునశ్చరణ చేసుకునే విధంగా కనీసం పది నిమిషాలు కేటాయించాలి.

ఏప్రిల్ సెషన్‌కు ఇలా

ఏప్రిల్ సెషన్‌పైనే దృష్టి పెట్టిన విద్యార్థులు ఇప్పటి నుంచే నిర్దిష్ట వ్యూహంతో ప్రిపరేషన్ సాగించడం ద్వారా మంచి మార్కులు సాధించే అవకాశముంది. డిసెంబర్‌లో ఇంటర్ సిలబస్ పూర్తి చేసుకున్న విద్యార్థులు.. ఆ తర్వాత జేఈఈ-మెయిన్ పరీక్ష సిలబస్‌కు అనుగుణంగా ఫిబ్రవరి చివరి వారం వరకు ప్రిపరేషన్ సాగించాలి. ఇంటర్ పరీక్షలు పూర్తయిన తర్వాత ఏప్రిల్ సెషన్ తేదీకి మధ్య ఉన్న వ్యవధిని పూర్తిగా రివిజన్, మాక్ టెస్ట్‌ల ప్రాక్టీస్‌కు కేటాయించాలి.

సబ్జెక్ట్ వారీగా ముఖ్యమైన టాపిక్స్

మ్యాథమెటిక్స్

ఈ సబ్జెక్ట్‌లో రెండు సంవత్సరాల సిలబస్‌కు సంబంధించి ప్రతి చాప్టర్‌ను తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. 3-డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్; పారాబోలా; ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్. వీటితోపాటు క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్, బైనామియల్ థీరమ్, లోకస్ అంశాలను కనీసం ఒక్కసారైనా పూర్తిచేసే విధంగా ప్రిపరేషన్ సాగించాలి.

ఫిజిక్స్

ఫిజిక్స్‌లో న్యూమరికల్ అప్లికేషన్ అప్రోచ్‌కు ప్రాధాన్యమివ్వాలి. ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్; సింపుల్ హార్మోనిక్ మోషన్,వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌పై అవగాహన ఏర్పరచుకుంటే మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు.

కెమిస్ట్రీ

విద్యార్థులు కొంత సులభంగా భావించే సబ్జెక్ట్ కెమిస్ట్రీ. ఈ విభాగంలో అడిగే ప్రశ్నలు కెమికల్ బాండింగ్, పిరియాడిక్ టేబుల్, బ్రేకింగ్‌ల మూలాలపై నైపుణ్యాలను తెలుసుకునే విధంగా ఉంటాయి. కాబట్టి మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

అడ్వాన్స్‌డ్‌కు అర్హతగా

ఐఐటీల్లో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు జేఈఈ-మెయిన్ నుంచి 2.5 లక్షల మందిని ఎంపిక చేస్తారు. కాబట్టి జేఈఈ-మెయిన్‌లో మంచి స్కోర్ సాధించేలా కృషి చేస్తే.. అడ్వాన్స్‌డ్‌కు అర్హుల జాబితాలో నిలిచే అవకాశం లభిస్తుంది.

కొందరికే 'గృహలక్ష్మి'!

- కేవలం 1.75 లక్షల మంది లబ్ధిదారులు మాత్రమే ఎంపిక?
- కోడ్ అమలులోకి రావటంతో ప్రక్రియ నిలిపివేత
- మిగతా వారి ఎంపిక ఎన్నికల తర్వాతనే
- మంజూరు పత్రాలు పొందిన వారికి నిధులు కేటాయించే వీలు



సాక్షి, హైదరాబాద్: గృహలక్ష్మి లబ్ధిదారుల జాబితా తయారీ అర్ధాంతరంగా నిలిచిపోయింది. నాలుగు లక్షల మందితో జాబితా రూపొందించాల్సి ఉండగా, సోమవారం వరకు కేవలం 1.75 లక్షల మందికి మాత్రమే మంజూరు పత్రాలు జారీ చేయగలిగారు. దీంతో అంతే సంఖ్యతో లబ్ధిదారుల జాబితా రూపొందింది. ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో జాబితా రూపొందించే పని నిలిచిపోయింది.

ఎమ్మెల్యేల జాబితాలతో జాప్యం..

గృహలక్ష్మి పథకానికి గత బడ్జెట్‌లో ప్రభుత్వం నిధులు కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. సొంత జాగా ఉన్న ఒక్కో లబ్ధిదారుకు రూ.3 లక్షలు అందించాల్సి ఉంటుంది. కానీ, దరఖాస్తుల ప్రక్రియను మాత్రం చాలా ఆలస్యంగా ప్రారంభించింది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో దరఖాస్తుల సేకరణ ప్రక్రియ ప్రారంభించగా, 15 లక్షల వరకు అందాయి. వాటి నుంచి 4 లక్షల మంది లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. నియోజకవర్గంలో ఏయే ఊళ్లు, ఒక్కో ఊరు నుంచి ఎంతమంది లబ్ధిదారులు.. అన్న విషయంలో అధికారపార్టీ ఎమ్మెల్యేలకు బాధ్యతను అప్పగించారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలోనే, లబ్ధిదారుల జాబితా రూపొందించాల్సి ఉన్నా.. వివరాలు మాత్రం ఎమ్మెల్యేలు అందించాల్సి ఉంది. కొంత మంది ఎమ్మెల్యేలు వేగంగా స్పందించగా, కొందరు జాప్యం చేశారు. ఫలితంగా జాబితా రూపొందించే ప్రక్రియ నత్తనడకన సాగింది.

పూర్తి జాబితా కోసం ఈసీని అనుమతి అడుగుతామంటున్న అధికారులు

ఈనెల ఆరో తేదీ తర్వాత ఏ క్షణాన్నయినా ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందన్న సమాచారంతో, ఐదో తేదీ రాత్రి వరకు జాబితాను సిద్ధం చేసి సమర్పించాల్సిందిగా సచివాలయం నుంచి సంబంధిత అధికారులకు ఆదేశాలందాయి. కానీ, ఎమ్మెల్యేల నుంచి వివరాలు సకాలంలో అందకపోవటంతో.. సోమవారం నాటికి 1.75 లక్షల మందితో కూడిన లబ్ధిదారుల జాబితా సిద్ధమైనట్టు తెలిసింది. కొన్ని జిల్లాల నుంచి వివరాలు అందాల్సి ఉందని, దీంతో ఆ సంఖ్య కొంతమేర పెరిగే అవకాశం ఉందని అధికారులంటున్నారు. కోడ్ అమలులోకి వచ్చినందున, మిగతా లబ్ధిదారుల ఎంపిక ఇప్పట్లో ఉండదని, కొత్త ప్రభుత్వం కొలువు దీరిన తర్వాతనే ఉంటుందని అధికారులు అంటున్నారు. అయినా, పూర్తి జాబితా సిద్ధం చేసేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు.

ఏదైనా ఇక ఎన్నికల తర్వాతనే..

ఎన్నికలు ముగిసి కోడ్ అడ్డంకి తొలగిపోయిన తర్వాతనే ప్రక్రియ పూర్తి చేసే అవకాశం కనిపిస్తోంది. అధికారంలోకి వచ్చే ప్రభుత్వ ఆలోచనలకు వీలుగా ఈ పథకం భవిష్యత్తు ఆధారపడి ఉంది. కోడ్ అమలులోకి వచ్చే లోపు మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులకు మాత్రం రూ.3 లక్షల చొప్పున నిధులు విడుదలవుతాయి. వారు పనులు మొదలుపెట్టుకోవచ్చు. మిగతా లబ్ధిదారులకు నిధుల విడుదల ప్రక్రియ మాత్రం ఎన్నికల తర్వాతనే జరుగుతుందని అధికారులంటున్నారు. కొలువుదీరే కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించాలనుకుంటేనే ఆ ప్రక్రియ ముందుకు సాగుతుందని, లేనిపక్షంలో తదనుగుణంగా నిర్ణయం ఉంటుందని చెబుతున్నారు.

రైతుబంధు చైర్మన్‌గా టి.రాజయ్య బాధ్యతలు



రాజయ్యను అభినందిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైతుబంధు సమితి చైర్మన్‌గా తాటికొండ రాజయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ తెలంగాణ రైతుబంధు సమితి సీఎం కేసీఆర్ మానస పుత్రిక అన్నారు. ఈ సమితిలో 1.60 లక్షల మంది సభ్యులున్నారని, సీఎం కేసీఆర్ సహకారంతో ఈ సంస్థను మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. పదేళ్లలో వ్యవసాయ రంగానికి తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని, ప్రపంచంలోనే వినూత్నమైన రైతుబంధు, రైతు బీమా పథకాలను ప్రవేశపెట్టిందని రాజయ్య పేర్కొన్నారు.

పార్టీ ఆదేశిస్తే బోథ్ అసెంబ్లీ బరిలో ఉంటా : ఎంపీ సోయం బాపూరావు

ఇచ్చోడ: తమపార్టీ ఆదేశిస్తే బోథ్ అసెంబ్లీ బరిలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని ఎంపీ సోయం బాపూరావు తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్‌లో నేడు నిర్వహించనున్న అమిత్ షా సభను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

రూ. కోట్లకొద్దీ డబ్బు, బంగారం స్వాధీనం

- రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలుతో పోలీసుల విస్తృత తనిఖీలు
- ఎలాంటి ఆధారాల్లేకుండా తరలిస్తున్న డబ్బు, బంగారం సీజ్



చైతన్యపురి పరిధిలో స్వాధీనం చేసుకున్న నగదు

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో హైదరాబాద్ సహా జిల్లాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు ప్రారంభించారు. ఎన్నికల్లో అక్రమంగా డబ్బు, మద్యం పంపిణీని అరికట్టేందుకు ఎక్కడికక్కడ చెక్ పోస్టులు, నాకా బందీలు పెట్టి సోదాలు నిర్వహించారు. ఎలాంటి పత్రాలు, ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగించారు.

రాజధాని పరిధిలో...

- బషీర్‌బాగ్ నిజాం కళాశాల వద్ద వాహన తనిఖీల్లో ఓ బంగారం దుకాణానికి చెందిన, ఎలాంటి పత్రాల్లేని 7 కిలోల బంగారం, 295 కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ. 7.5 కోట్లు ఉండొచ్చని చెప్పారు. పురానాపూల్ వద్ద బేగంబజార్‌కు చెందిన ఒకరి నుంచి రూ.15 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.
- హైదరాబాద్‌లోని చైతన్యపురి పరిధిలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు ఆధారాల్లేకుండా తరలిస్తున్న రూ.25 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతంలో షాద్‌నగర్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి సంతోష్ చంద్రశేఖర్ (48) నుంచి రూ. 5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.
- రంగారెడ్డి జిల్లా లాల్‌పహాడ్ చౌరస్తా వద్ద తనిఖీల్లో 2 కిలోల బంగారం, రూ. 1.22 లక్షలు పట్టుబడ్డాయి.
- ఆగాపురా హమీద్ కేఫ్ చౌరస్తాలో షాహీన్ నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ నుంచి రూ. 5 లక్షలు, బేగంబజార్‌కు చెందిన దినేష్ ప్రజాపతి నుంచి రూ.12 లక్షల నగదు స్వాధీనం.
- షేక్‌పేట నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజ్ కారులో తరలిస్తున్న రూ. 30 లక్షలు సీజ్.
- వనస్థలిపురం పరిధిలో ఓ కారులో సంరెడ్డి భరత్ రెడ్డి తీసుకెళ్తున్న రూ. 5.16 లక్షలు స్వాధీనం.
- గోపాలపురం పీఎస్ పరిధిలోని ఓ లాడ్జీలో చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డ రూ. 4 లక్షలు.
- పంచశీల క్రాస్ రోడ్స్ వద్ద గోపి అనే వ్యక్తి నుంచి రూ. 9.3 లక్షలు స్వాధీనం.

వివిధ జిల్లాల్లోనూ...

- రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి బీడీఎల్ చౌరస్తా వద్ద తనిఖీల్లో కారులో తరలిస్తున్న రూ. 9,38,970తో పాటు గాయత్రి ఆస్పత్రి వద్ద తనిఖీల్లో మరో కారులో తరలిస్తున్న రూ.71,50,000 నగదును పోలీసులు పట్టుకున్నారు. అలాగే షాద్‌నగర్ టోల్ ప్లాజా వద్ద సంగారెడ్డికి చెందిన నగేష్ నుంచి రూ.7 లక్షలతోపాటు షాద్‌నగర్‌లోని జీహెచ్‌ఆర్ కాలనీకి చెందిన అశోక్ బైక్‌పై తీసుకెళ్తున్న రూ. 11.50 లక్షలను సీజ్ చేశారు.
- నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి వద్ద తనిఖీల్లో నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన వ్యాపారి కారులో తరలిస్తున్న రూ. 5.40 లక్షల నగదును స్వాధీనం చేసుకొన్నారు.
- ఏపీకి చెందిన వారి నుంచి వైరాలోని చెక్‌పోస్టు వద్ద రూ.5లక్షలు, తల్లాడ సూపర్ మార్కెట్ యజమాని కొత్తూరి సైదకుమార్ రూ. 5 లక్షలను సీజ్ చేశారు. మధిర వద్ద తనిఖీల్లో కోనా గోపాలరావు అనే వ్యక్తి నుంచి రూ.12.65 లక్షలను సీజ్ చేశారు.

కదం తొక్కిన ఆశవర్కర్లు

- కాంట్రాక్ట్ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్
- కోఠి ఉమెన్స్ కాలేజీ చౌరస్తాలో ఆందోళన



కోఠి ఉమెన్స్ కళాశాల చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

సుల్తాన్‌బజార్(హైదరాబాద్): వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు సోమవారం ఇక్కడి కోఠి ఉమెన్స్ కళాశాల చౌరస్తాలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఒక్కసారిగా వేలసంఖ్యలో ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు తరలిరావడంతో ఉమెన్స్ కళాశాల చౌరస్తా జనసంద్రాన్ని తలపించింది. ఎక్కడికక్కడే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో చాదర్‌ఘాట్ నుంచి కోఠి బ్యాంక్‌స్ట్రీట్ వరకు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఒక్కసారిగా వేలాదిమంది చౌరస్తాలో బైఠాయించడంతో పోలీసులు సైతం చేతులెత్తేశారు. ఆశాలు, ఏఎన్ఎంలతోపాటు వైద్యశాఖలో పనిచేస్తున్న వివిధ కేడర్ల కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఆందోళన కొనసాగించారు. దీంతో ఈ ప్రాంతంలో పోలీసులు భారీ బలగాలను మోహరించారు.

కాజీపేట-హడప్సర్ రైలు ప్రారంభం

మరో మూడు రైళ్లు వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్: రైల్వేశాఖ మరోసారి సాహసోపేతమైన నిర్ణయంతో రెండు తెలుగు రాష్ట్రాలలో రైళ్ల పొడిగింపుతో పురోగతి సాధించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సోమవారం ఆయన కాజీపేట-హడప్సర్ (పుణే) రైలును జెండా ఊపి ప్రారంభించారు. దీంతో పాటు మరో మూడు రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే నాలుగు రైళ్లను పొడిగించిందని తెలిపారు. హడప్సర్-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట వరకు, జైపూర్-కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌ను కర్నూల్ పట్టణం వరకు, నాందేడ్-తాండూర్ ఎక్స్‌ప్రెస్‌ను రాయచూర్ వరకు, కరీంనగర్-నిజామాబాద్ ప్యాసింజర్‌ను బోధన్ వరకు పొడిగించినట్లు ఆయన వివరించారు.

ఆటోలో తిరుగుతూ సమోసా తింటూ.. చాయ్ తాగుతూ..



డాక్యుమెంటరీ షూటింగ్ కోసం ఆటోలో తిరుగుతూ.. హోటల్‌లో సమోసా, బిస్కెట్‌లు తింటూ.. చాయ్ తాగుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అందరి దృష్టిని ఆకర్షించారు. సోమవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగిన ఓ కార్యక్రమం తర్వాత బ్లూసీ హోటల్‌కు వచ్చి చాయ్ తాగారు. తర్వాత రియో పాయింట్ హోటల్‌కు వచ్చి బిస్కెట్, సమోసా తిన్నారు. అక్కడి నుంచి ఆటోలో పరేడ్ గ్రౌండ్ వరకు వెళ్లి మెట్రోరైల్‌లో సుల్తాన్‌బజార్‌కు చేరుకున్నారు.

– రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్)

ఆర్టీసీ వేతన సవరణ ఆశలు గల్లంతు!

సాక్షి, హైదరాబాద్: 'ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియను పూర్తి చేసే లోపే.. బకాయి ఉన్న 2017, 2021 వేతన సవరణలను పూర్తి చేయాలి'.. మూడు రోజుల క్రితం ఆర్టీసీ ఉద్యోగులు ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన మహాధర్నాలో గట్టిగా వినిపించిన డిమాండ్ ఇది. కానీ సోమవారం ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో వారి ఆశలు గల్లంతయ్యాయి. ఇప్పటివరకు ఆ రెండు వేతన సవరణలను అమలు చేస్తామంటూ ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించకపోవటంతో, ఇప్పుడు వాటిని అమలు చేసే వీలు లేకుండా పోయింది. దీంతో కొత్త ప్రభుత్వం కొలువు దీరే వరకు అవి అమలయ్యే అవకాశం లేకుండా పోయిందని అంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత 2015లో ఆర్టీసీలో వేతన సవరణ జరిగింది. 2017లో వేతనాలను సవరించాల్సి ఉన్నా, ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో కార్మికులు రోడ్డెక్కారు. ఏడాది జాప్యం తర్వాత 16 శాతం ఐఆర్‌ను మాత్రం ప్రకటించారు. 2021లో ఇవ్వాల్సిన మరో పీఆర్సీ కూడా పెండింగు జాబితాలోకి చేరింది. అయితే.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన నేపథ్యంలో.. వారి వేతనాలను ప్రభుత్వ ఉద్యోగులకు సమంగా పెంచితే ఇక పెండింగ్ పీఆర్సీల అవసరం ఉండదని కొన్ని వర్గాలు అంటున్నాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.